

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి స్వామి

- రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి
- మాజీ మంత్రి సురేష్‌పై ఫైర్

పొన్నలూరు(కొండపి)/ మర్రిపూడి, జూన్ 28 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఎవరి పింఛన్‌నూ రద్దు చేయబోమని, ఎలాంటి కక్ష సాధింపు చర్యలు ఉండవని స్పష్టం చేశారు. త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుడతామన్నారు. పొన్నలూరు, మర్రిపూడిల్లో శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చూపించిన ఆదరణతో తాను మంత్రినయ్యానని అన్నారు. వారి సంక్షేమానికి పాటుపడతానన్నారు. కొండపి నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఒకటో తేదీనే అందరికీ పింఛన్‌లు

గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.200 పింఛన్‌ను రూ.2,000కు పెంచి పేదలను ఆదుకోగా వైసీపీ ప్రభుత్వంలో రూ.1,000 పింఛన్ పెంచేందుకు జగన్‌కి ఐదేళ్లు పట్టిందని మంత్రి స్వామి ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు పింఛన్‌ను రూ.4,000కు పెంచుతానని హామీ ఇచ్చిన చంద్రబాబు, ఇచ్చిన మాట ప్రకారం వచ్చేనెల 1వ తేదీన మూడు నెలల బకాయితో కలిపి రూ.7,000 అందజేస్తున్నారన్నారు. దివ్యాంగులకు పింఛన్‌ను రెట్టింపు చేసిన ఘనత కూడా టీడీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఒకటోతేదీనే సచివాలయ సిబ్బందితోపాటు అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తల సహకారంతో నూటికి నూరుశాతం ఇళ్ల వద్దనే పింఛన్లు అందిస్తామని చెప్పారు.

పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు, చెట్టుతోపాటు వివిధ అభివృద్ధి పనులు చేసి వైసీపీ పాలనలో బిల్లులు రానివారికి త్వరలో చెల్లింపులు చేస్తామని మంత్రి స్వామి ప్రకటించారు. అప్పట్లో పక్కా గృహాలు నిర్మించుకొని రూ.1 బ్యాంక్ ఖాతాలో జమైన గృహ నిర్మాణాల లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు తనతోపాటు దామచర్ల పూర్ణచంద్రరావు, సత్య అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు.

అలజడులు సృష్టించాలని చూస్తే సహించం

మాజీ మంత్రి సురేష్‌పై స్వామి మండిపడ్డారు. 'గడచిన ఐదేళ్లలో ఎస్సీల పథకాలన్నీ జగన్ రద్దు చేస్తుంటే చేష్టలుడిగి చూశాడు. ఇప్పుడు ప్రగల్భాలు పలుకుతున్నాడు. చంద్రబాబు ఎర్రగొండపాలెం వస్తే చొక్కా విప్పి నిలుచున్నాడు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు దారి మళ్లించినప్పుడు, అంబేడ్కర్ విదేశీ విద్య పథకం పేరును జగనన్న విద్యా దీవెనగా మార్చినప్పుడు నోరు మెదపలేదు. ఇప్పుడు రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం లేదంటున్నాడు' అని సురేష్‌నుద్దేశించి మంత్రి స్వామి వ్యాఖ్యానించారు. సింగరాయకొండ గురుకుల పాఠశాలలో సీట్లు తొలగిస్తే మాట్లాడలేదన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఆయన చేసిందేమీ లేకపోగా కొండపి నియోజవకర్గానికి వచ్చాక అనేక తప్పుడు పనులు చేశాడని దుయ్యబట్టారు. శాంతియుతంగా ఉండే నియోజకవర్గంలో అలజడులు సృష్టించాలని చూశాడని సురేష్‌ను ఉద్దేశించి స్వామి విమర్శించారు. తప్పుడు కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు టీడీపీ ఎప్పుడూ పెట్టలేదని, రెచ్చగొడితే మాత్రం తమ పార్టీ కార్యకర్తలు సహించబోరని స్వామి సురేష్‌ను ఉద్దేశించి హెచ్చరించారు.

ఎన్నికల మేనిఫెస్టోలో పింఛన్ మొత్తాన్ని పెంచుతామని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. దానిని నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తోంది. జూలై ఒకటో తేదీన పెంచిన పింఛన్‌ను పంపిణీ చేసేందుకు సిద్ధమైంది. ఇంత పెద్ద మొత్తంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు పింఛన్లను పంపిణీ చేసిన ఘనత రాష్ట్ర చరిత్రలోనే ఇదే ప్రథమం కానుంది. ఇక ప్రతినెలా ఒకటో తేదీనే అందరికీ పింఛన్లను పంపిణీ చేసే దిశగా రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



29వ తేదీనే బ్యాంకుల నుంచి డ్రా చేయనున్న సిబ్బంది

జూలై 1న ఉదయం నుంచే పింఛన్లను పంపిణీ చేసేందుకు అవసరమైన నగదును ఈనెల 29నే సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి డ్రా చేయనున్నారు. 30వతేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే నగదును తీసి పంపిణీకి సిద్ధంగా ఉంచుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. సచివాలయ సిబ్బంది కాకుండా ఇతర శాఖల ఉద్యోగులు పంపిణీకి ఎంత మంది అవసరమవుతారో ఇప్పటికే ఎంపీడీవోలు లెక్కలు తేల్చారు. వారికి కూడా పంపిణీ చేయాల్సిన లబ్ధిదారుల వివరాలను అందజేసి ప్రత్యేక లాగిన్ ఇవ్వనున్నారు. మొత్తం మీద రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి పింఛన్ సొమ్మును ఏకంగా పెంచేయడమే కాకుండా, ప్రతినెలా మొదటిరోజునే సొమ్ము లబ్ధిదారుల చేతికి అందేలా చర్యలు చేపట్టింది.

ఒకటినే పూర్తిస్థాయిలో పంపిణీ

పింఛన్ సొమ్మును సచివాలయ సిబ్బందితోపాటు ఆ బాధ్యతలను అప్పగించిన ఇతర శాఖల సిబ్బంది జూలై ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటి తలుపుతట్టి అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ ప్రకారం పింఛన్ల పంపిణీ ఉదయం 6గంటల నుంచే ప్రారంభంకానుంది. 99శాతం మందికి ఒకటో తేదీనే పింఛన్ సొమ్మును చేతికి అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా కేంద్రం నుంచి అన్ని మండల కేంద్రాలకు ఆదేశాలు గురువారమే జారీ అయ్యాయి. గ్రామాల్లో లేని వారికి రెండో తేదీన అందజేయాల్సి ఉంది. పింఛన్లను పంపిణీ చేసే సిబ్బందికి ప్రత్యేకంగా లాగిన్‌ను ఇవ్వనున్నారు. దాని ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేసి నగదును అందజేయాల్సి ఉంది.

పింఛన్ పండుగ



ఒకటో తేదీనే సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ

ఒంగోలు నగరం, జూన్ 28 : రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఇస్తున్న రూ.3 వేల పింఛన్‌ను ఒకేసారి రూ.4 వేలకు పెంచేసింది. దీన్ని ఈ ఏడాది ఏప్రిల్ మాసం నుంచి అమలు చేయనుంది. పెంచిన మొత్తం బకాయిలను కలుపుకొని ఎన్టీఆర్ భరోసా పేరుతో జూలై ఒకటో తేదీన ఒక్కో లబ్ధిదారుడికి ఏకంగా రూ.7వేలను అందజేయనుంది. వృద్ధులు, వితంతువులు, చేనేతలు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, గీతకార్మికులు, చర్మకారులకు ఇంటి వద్దనే పంపిణీ చేయనుంది. దీంతోపాటు దివ్యాంగులకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.3వేల పింఛన్‌ను ఒకేసారి రూ.6వేలకు పెంచింది. పెరాలసిస్, ఇతర తీవ్ర వ్యాధులతో బాధపడుతూ పూర్తిగా మంచానికే పరిమితమై ఉన్నవారికి ఇప్పటివరకు రూ.5 వేలు పింఛన్ అందజేశారు. ఇకనుంచి వీరికి ప్రతినెలా రూ.15వేలు ఇవ్వనుంది. తలసేమియా, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రస్తుతం ఇస్తున్న రూ.5వేలను ప్రభుత్వం ఏకంగా రూ.10వేలకు పెంచేసింది. ఈ మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లాలోని సెర్ప్ అధికారులు, మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వీడియో సమావేశం నిర్వహించి పింఛన్ల పంపిణీపై దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో 2,91,524 పింఛన్లు

జిల్లాలో మొత్తం 2,91,524 పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీటిలో వృద్ధాప్య పింఛన్లు 1,59,259 ఉన్నాయి. దివ్యాంగులు 33,729, వితంతు 68,125, చేనేత కార్మికులు 1,829, ఒంటరి మహిళలు 7,821, కల్లుగీత కార్మికులు 247, చర్మకారులు 5,363, హిజ్రాలు 90, డప్పు కళాకారులు 4,725, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు 2,502 మంది నెలనెలా పింఛన్ తీసుకుంటున్నారు. రాష్ట్రప్రభుత్వం పెంచిన మేరకు ప్రతినెలా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు రూ.19,90,77,600 అవసరమవుతుంది.

సచివాలయ సిబ్బందితోపాటు ఇతర శాఖల ద్వారా...

- ఇతర శాఖల సిబ్బంది సేవలూ వినియోగం
- వలంటీర్లను పక్కనపెట్టిన ప్రభుత్వం
- తొలిరోజే అందరికీ అందజేత
- వృద్ధులు, వితంతువులకు ఒకేసారి రూ.ఏడు వేలు
- లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు

గత ప్రభుత్వం సామాజిక పింఛన్లను వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయించేది. అయితే రాష్ట్రంలో ఎక్కువమంది వలంటీర్లు గత వైసీపీ పెద్దలకు ఎన్నికల్లో తగిన సహకారం అందించేందుకు రాజీనామాలు సమర్పించారు. అయితే వారు ఊహించని విధంగా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రస్తుత ప్రభుత్వం పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారానే పంపిణీ చేయించాలని నిర్ణయించింది. ఒక్కొక్కరికి 50మంది చొప్పున ఇంటి వద్దకే నగదును అందించే విధంగా ప్రణాళిక రూపొందించింది. సచివాలయ సిబ్బంది తగినంతమంది అందుబాటులో లేకపోతే రెవెన్యూ, మండల పరిషత్ ఉద్యోగులకు కానీ పంపిణీ బాధ్యతలను అప్పగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు ఇప్పటికే జిల్లా యంత్రాంగం, డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు కసరత్తును పూర్తి చేశారు.

దొంగలకు సహకారం!

- స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలేసిన వైనం
- మరికొన్ని చోరీలకు పాల్పడిన నిందితులు
- చీమకుర్తిలో 80సవర్ల నగలు చోరీ
- మొత్తం దొరికిన సొత్తు
- ఆ మొత్తం వెనక్కి ఇచ్చేందుకు బాధితుల వద్ద నుంచి భారీగా డిమాండ్
- 40 సవర్లు మాత్రమే చోరీ అయినట్లు కేసు
- సీఐపై సస్పెన్షన్ వేటు

వివరాలు మెయిన్‌లో..


సీఐ దుర్గాప్రసాద్

సొసైటీలకు అధికార పీఐసీలు

- డీసీవోలకు నియామక అధికారం

ఒంగోలు(విద్య), జూన్ 28: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (సొసైటీలు) ఇక నుంచి అధికారుల పాలనలోకి రానున్నాయి. ఇప్పటివరకు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలతో నడుస్తున్న సొసైటీలు అధికార పర్సన్ ఇన్‌చార్జిల పాలనలోకి రాబోతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఎ.బాబు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సొసైటీల నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు రాజీనామా చేశాయి. రాష్ట్రంలో 360 సొసైటీల ఎన్‌పీపీఐసీలు రాజీనామా చేయకుండా కొనసాగుతు న్నాయి. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోని సొసైటీలకు అఫీషియల్ పీఐసీలను నియమించాలని జిల్లా సహకారశాఖ అధికారులను కమిషనర్ బాబు ఆదేశించారు. ఈ ఏడాది డిసెంబర్ 20 వరకు ఆరు నెలలపాటు అధికారిక పీఐసీలకు పదవీకాలంగా నిర్ణయించారు. ఈలోపు సొసైటీల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తే అప్పటివరకు, లేదా ప్రభుత్వం తదుపరి జారీచేసే ఉత్తర్వుల వరకు అధికార పీఐసీలు పదవిలో కొనసాగుతాయి. రుతుపవనాలు వచ్చి వ్యవసాయ పనులు ప్రారంభమైనందున సొసైటీల ద్వారా రైతులకు రుణాలు అందజేసేందుకు పీఐసీల నియామకాన్ని వెంటనే చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో సహకార శాఖ కమిషనర్ ఆదేశించారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 176 సొసైటీలలో అధికార పీఐసీల పాలన రానుంది.

ఏకపక్షం ఇక చెల్లదు!



- జడ్పీలో మూడేళ్లు సాగిన వైసీపీ ఆధిపత్యం
- ప్రజా సమస్యలు పట్టించుకోని వైనం
- తాజా ఎన్నికల్లో టీడీపీ భారీ గెలుపు
- ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు
- యంత్రాంగంతోపాటు పాలకమండలినీ నియంత్రించే అవకాశం
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం
- అన్ని శాఖల్లోనూ అస్తవ్యస్త పరిస్థితి
- సవాలక్ష సమస్యల్లో జిల్లా ప్రజలు

ఒంగోలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పాలకమండలిలో మూడేళ్లుగా సాగుతున్న వైసీపీ ఆధిపత్యానికి బ్రేకులు పడనున్నాయి. ప్రతిపక్షం లేకుండా సొంత పార్టీ సభ్యులతో ఏకపక్షంగా సాగిన పాలకమండలి సమావేశాలు ఇకపై అలా జరగని పరిస్థితి నెలకొంది. జడ్పీ పాలక మండలిలో సభ్యులంతా ఇప్పటికీ అంతా వైసీపీకి చెందిన వారే అయినప్పటికీ ప్రభుత్వ పరంగా అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు పాలకమండలిని నియంత్రించే అధికారం, అవకాశం ఉన్న కీలక ప్రజాప్రతినిధులు తాజాగా జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి భారీగా ఎన్నికయ్యారు. జడ్పీ పాలకమండలి సమావేశాలకు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా హాజరయ్యే ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలలో టీడీపీ వారే అధికంగా ఉండటంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా టీడీపీ కూటమిది కావడంతో పాలకమండలిలో వైసీపీ ఆధిపత్యం ఇక చెల్లని పరిస్థితి ఏర్పడుతోంది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం తొలిసారి జడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుంది.

అంతా ఇష్టారాజ్యం

ప్రస్తుత జడ్పీ పాలకమండలి 2021 జూలైలో ఏర్పడగా అప్పట్లో ఉమ్మడి జిల్లాలోని 56 మండలాల నుంచి మొత్తం జడ్పీటీసీలు, ఎంపీపీలు వైసీపీకి చెందిన వారే ఎన్నికయ్యారు. ఇద్దరు ఎంపీలతోపాటు 12 మంది ఎమ్మెల్యేల్లో ఎనిమిది మంది ఆ పార్టీ వారే కాగా తర్వాత కాలంలో మరొక టీడీపీ ఎమ్మెల్యే వైసీపీకి మద్దతు పలికారు. ఆ రకంగా జడ్పీలో పూర్తిగా వైసీపీ ఆధిపత్యం కొనసాగింది. జడ్పీ చైర్‌పర్సన్‌గా బూచేపల్లి వెంకాయమ్మ వ్యవహరిస్తుండగా వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు ప్రత్యేకించి బాలినేని హవా సాగింది. అయితే ఆ సమావేశాలలో ప్రజల సమస్యల గురించి, జిల్లా అభివృద్ధి అంశాలు, ప్రభుత్వ శాఖల పనితీరుపైన పెద్దగా చర్చలు జరగడం కానీ, స్థానిక ప్రజాప్రతి నిధుల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వ చర్యలు కానీ ఎక్కడా కనిపించలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ ప్రజాప్రతినిధులు ఉన్నదే తక్కువ కాగా వారు కూడా పెద్దగా సమావేశాలకు రాకపోవడంతో ప్రశ్నించేవారు లేక మొక్కుబడిగానే ముగిసేవి. దీంతో జడ్పీలో ఆ సంస్థ పర్యవేక్షించే శాఖల్లో వైసీపీ నేతలు, పార్టీ మద్దతు గా ఉండే ఉద్యోగులు, అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా నడిచింది. అయి తే ఇక అలాంటి పరిస్థితి సాగే అవకాశం లేదు.

వైసీపీ ఆధిపత్యానికి బ్రేక్

జడ్పీ జనరల్ బాడీల్లో జడ్పీటీసీ సభ్యులు ఓటు అర్హత ఉన్న సభ్యులు అయినప్పటికీ ఎక్స్ అఫిషియో సభ్యులుగా వచ్చే ఎంపీ, ఎమ్మెల్సీలు ప్రత్యేకించి ఎమ్మెల్యేలు అత్యంత కీలకంగా వ్యవహరిస్తారు. సమావేశ నిర్వహణ జడ్పీ చైర్‌పర్సన్ అయినా ఎమ్మెల్యేలు, ఆ స్థాయి నుంచి మంత్రులు అంతా ప్రభుత్వం తరపున సమావేశంలో పాల్గొనే వారి సూచనలకు అనుగుణంగా నడుస్తుంది. అలాంటి కీలకపాత్రలోకి ప్రస్తుతం టీడీపీ ప్రజాప్రతినిధులు వచ్చారు. ఉమ్మడి జిల్లా నుంచి తాజా ఎన్నికల్లో 12 మంది ఎమ్మెల్యేలలో 10 మంది టీడీపీకి చెందిన వారు గెలుపొందగా జిల్లాతో సంబంధం ఉన్న ముగ్గురు ఎంపీలు కూడా టీడీపీ వారే. అదేసమయంలో ఉమ్మడి జిల్లా నుంచి కేబినెట్‌లో గొట్టిపాటి రవికుమార్, స్వామిలు మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ రకంగా జడ్పీలో వైసీపీ ఆధిపత్యానికి బ్రేక్‌లు పడి టీడీపీదే పైచేయికానుంది. జడ్పీ నిర్వహణ, శాఖల పనితీరుపై వారి పర్యవేక్షణ పెరిగే అవకాశం ఉంది. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వ కాలంలో కేవలం సీఎం జగన్ బటన్ నొక్కే పథకాలు తప్ప జనం బాధలు గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యలకు అనుగుణమైన చర్చలు కూడా పెద్దగా జడ్పీలో జరగలేదు.

అస్తవ్యస్తంగా జడ్పీ నిధుల కేటాయింపు

జిల్లాలో వ్యవసాయ సీజన్ ప్రతికూలంగా ఉంది. నేటికీ వందలాది గ్రామాల్లో కోసం ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. అనేక సమస్యలతోపాటు కీలకమైన వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టులు, ట్రిపుల్‌ఐటీతోపాటు పారిశ్రామిక ప్రగతి పడకేసింది. మౌలిక రంగాలలో రోడ్లు, విద్య, వైద్యసంస్థలు అధ్వానంగా ఉన్నాయి. ఇక శాఖలపరంగా చూస్తే రెవెన్యూ, డ్వామా, వైద్యారోగ్యశాఖలు అవినీతికి ఆలవాలంగా మారాయి. గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థ ఆశించిన మేర పనిచేయడం లేదు. జడ్పీ నిధుల కేటాయింపు ఏకపక్షంగా జరగాయన్న ఆరోపణలు ఉండగా మండలాల్లో పాలన పడకేసింది. ఈ మొత్తం అంశాలను పరిగణనలోకి తీసుకొని టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులుగా పాల్గొనే ఆ పార్టీకి చెందిన మంత్రులు ఈ జడ్పీ సమావేశం నుంచే జిల్లా ప్రజల బాగోగులు, అభివృద్ధి అంశాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అస్తవ్యస్తంగా రేషన్ పంపిణీ



- యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలింపు
- ఎలాగూ తొలగిస్తారని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న డీలర్లు
- సరుకులు అందక ప్రజలకు అవస్థ

దర్శి, జూన్ 28: దర్శి నియోజకవర్గంలో రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. మూడు నెలలుగా ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కార్డుదారులకు సక్రమంగా ఇవ్వకుండా యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో తమను ఎలాగూ ఉంచరన్న ఉద్దేశంతో పాత డీలర్లు మరింత బరితెగిస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగింది. డీలర్లు, దళారులు రైస్ మిల్లర్లకు ఈ వ్యాపారం కల్పవృక్షంగా మారింది. వైసీపీ నాయకులు కొంతమంది ముండ్లమూరు మండలంలో ఒక మిల్లును లీజుకు తీసుకొని రేషన్ బియ్యాన్ని అక్కడకు తరలించేవారు. అక్కడ బియ్యాన్ని పాలిష్ చేసి రవాణా చేస్తూ ప్రతినెలా లక్షలాది రూపాయలు సంపాదించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డీలర్ల వ్యవస్థ ప్రక్షాళన జరిగి సక్రమంగా రేషన్ పంపిణీ జరుగుతుందని ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

సగానికి పైగా బియ్యం పక్కదారి

దర్శి నియోజకవర్గంలో మొత్తం 152 రేషన్ షాపులు ఉన్నాయి. ప్రతినెలా 1,100 టన్నుల బియ్యం సరఫరా అవుతోంది. అందులో సగానికిపైగా బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలివెళ్తోంది. కొంతమంది డీలర్లు కార్డుదారులు బియ్యం అడిగినప్పుడు నిల్వలు లేవని కేజీకి రూ.10 చొప్పున డబ్బులు ఇస్తున్నారు. ఇదేమిటని అడిగితే మీచేతనైనది చేసుకోమని బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్నారు. అధికారులు కూడా నెలసరి మామూళ్లు తీసుకుంటూ రేషన్ అక్రమ బియ్యం వ్యాపారానికి సహకారం అందిస్తున్నారు.

ప్రక్షాళనకు రంగం సిద్ధం

అస్తవ్యస్తంగా మారిన డీలర్ల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు రంగం సిద్ధమైంది. టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి రేషన్ పంపిణీ జరుగుతున్న తీరుపై ఇప్పటికే పూర్తి సమాచారం తీసుకున్నట్లు తెలిసింది. రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయని డీలర్లను సాగనంపేందుకు సిద్ధమయ్యారు. దీంతో కొంతమంది డీలర్లు ఇప్పటికే రాజీనామాలు చేశారు. మరికొందరు రాజీనామాలకు సిద్ధమవుతున్నారు. మిగిలినవారు తొలగించే వరకు వేచి ఉండాలని అలాగే కొనసాగుతున్నారు.



18 మంది డీలర్లు రాజీనామా

దర్శి నియోజకవర్గంలో ఇప్పటివరకు 18మంది డీలర్లు రాజీనామాలు చేశారు. వీరిలో తాళ్లూరు మండలంలో పదిమంది, కురిచేడు మండలంలో ఐదుగురు, ముండ్లమూరు మండలంలో ఇద్దరు, దొనకొండ మండలంలో ఒక డీలరు ఉన్నారు. మరికొంతమంది రెండు మూడు రోజుల్లో రాజీనామాలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటివరకూ కొనసాగిన టీడీపీ సానుభూతిపరులైన డీలర్లను బలవంతంగా తొలగించారు. నిజాయితీగా పనిచేస్తున్న వారిపై కూడా అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారు. కొంతమంది కోర్టులకు వెళ్లి స్టే తెచ్చుకొని మళ్లీ కేసులు పెట్టకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకొని నిబంధనల మేరకు రేషన్ పంపిణీ చేశారు. ఆ షాపులలో సీసీ కెమెరాలు ఉండటంతో అధికారులు తప్పుడు కేసులు బనాయించేందుకు వెనుకంజవేశారు. వైసీపీ సానుభూతిపరులుగా ఉన్న డీలర్లు మాత్రం రేషన్ పంపిణీ సక్రమంగా చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అక్రమార్కులను వెంటనే తొలగించి ఆ స్థానంలో కొత్తవారిని నియమించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి : జేసీ


గోడౌన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

చీమకుర్తి, జూన్28 : రేషన్ సరుకులను కార్డుదారులకు సక్రమంగా అందివ్వాలని జేసీ గోపాలకృష్ణ ఆదేశించారు. చీమకుర్తిలో ఉన్న ఎంఎల్‌ఎస్ పాయింట్‌ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో రికార్డులను పరిశీలించారు. సరకుల తూకాలను తనిఖీ చేశారు. సరుకుల నాణ్యత, పరిమాణంలో తేడా లేకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. తెలిపారు.

రేషన్ బియ్యం పరిశీలన


బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్): రేషన్ షాపులకు సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఒంగోలులోని ఎంఎల్‌ఎస్‌పాయింట్‌లోని గోడౌన్‌లో రేషన్ బియ్యాన్ని పరిశీలించారు. బియ్యాన్ని తూకం వేసి డీలర్లకు ఇస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆర్‌వీఎస్. కృష్ణమోహన్, గోడౌన్ ఇన్‌చార్జి ఆర్.ఆంజనేయనాయక్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఊతకోలు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భద్రతను ఉల్లంఘిస్తున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలి

చీమకుర్తి, జూన్ 28 : గ్రానైట్ క్వారీల్లో భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తూ క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ జ్ఞానేశ్వరరావుకు బీజేఎంఎం నాయకులు గుండా శ్రీనివాసరావు వినతిపత్రం అందచేశారు. శుక్రవారం రామతీర్థం వద్ద ఉన్న నాసా క్వారీలో తనిఖీ నిమిత్తం విచ్చేసిన జ్ఞానేశ్వరరావును కలిసిన శ్రీనివాసరావు డంపింగ్‌పై ఉన్న రాళ్లను భద్రతకు తిలోదకాలు ఇస్తూ తరలిస్తున్న వైనాన్ని వివరించారు. నిబంధనలు బేఖాతరు చేస్తూ బ్లాస్టింగ్ చేపట్టటంతో కార్మికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని, అటువంటి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB TRUST AND EXCELLENCE SINCE 1904
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in,
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు: 1) మెస్సర్స్ పుష్పా హ్యాండ్లూమ్స్ అండ్ డైయింగ్ వర్క్స్, డి.నం.12-11-71, బ్రహ్మిన్ రోడ్, చీరాల నగర్, జంధ్రపేట, ప్రకాశం జిల్లా-523165, ఆంధ్రప్రదేశ్. నం.2) శ్రీ బోయిన బాజి రెడ్డి, తండ్రి స్వర్గీయ కేశవ రెడ్డి, డి.నం. 35-153, చీరాల నగర్, జంధ్రపేట, ప్రకాశం-523165, ఆంధ్రప్రదేశ్. నం.3) శ్రీమతి బోయిన పుష్పలత, భర్త బాజిరెడ్డి, డి.నం.35-153, చీరాల నగర్, జంధ్రపేట, ప్రకాశం-523165, ఆంధ్రప్రదేశ్ నుండి 15.05.2024 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయితో కలిపి 14.05.2024 నాటికి రూ. 8,33,418/- (రూపాయలు ఎనిమిది లక్షల ముప్పై మూడు వేల నాలుగు వందల పద్దెనిమిది మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి/ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తి

షెడ్యూల్ - ఎ ఆస్తి - 1 : (శ్రీ బోయిన బాజిరెడ్డి తండ్రి స్వర్గీయ కేశవ రెడ్డి గారికి చెందిన ఆస్తి)
ప్రకాశం జిల్లా, చీరాల సబ్ జిల్లా, చీరాల మండలం (ఆర్.వి) ప్రస్తుత దేవాంగపురి (జంధ్రపేట) పంచాయతి, చీరాల గ్రామం, ఎస్.నం.602/2, బ్లాక్ నం.11, ప్లాట్ నం.లు 51, 52 మరియు 53, మొత్తం విస్తీర్ణం : ఎ.2.50 సెంట్ల స్థలంలో విస్తీర్ణం 367.79 చ.గ.లు = 303.95 చ.మీ.ల భూమి యావత్తు. సరిహద్దులు : తూర్పు : రోడ్-67.06 అ.లు, దక్షిణం : బుదారపు వెంకట సుబ్బారాయుడు ప్లాట్ నం.53 భాగం, స్థలం : 48.06 అ.లు, పశ్చిమం : ప్లాట్ నం.లు : 42 భాగం, 41 మరియు 40, స్థలాలు - 69.00 అ.లు. ఉత్తరం : పంచాయతి రోడ్-48.06 అ.లు.

రిజర్వు ధర: రూ. 11,00,000/-
(రూపాయలు పదకొండు లక్షలు మాత్రమే)

వేలం వివరాలు

టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
31-07-2024	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చీరాల శాఖ, 14-21-85, దర్బన్ రోడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, చీరాల, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523155. టెలిఫోన్ నం: 08594-238883, సెల్ నం.9397081234

టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చీరాల శాఖ, 14-21-85, దర్బన్ రోడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, చీరాల, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523155. వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం: 08594-238883, సెల్ నం.9397081234 లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. అందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెటును అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 18.05.2024 — అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

WANTED
■ మా ప్లే స్కూల్ నందు పనిచేయుటకు స్పోకెన్ ఇంగ్లీషులో అనుభవం కలిగిన లేడీ టీచర్స్ కావలెను. వివరములకు సంప్రం॥ సెల్: 7032047909.
AJO-183882

వరుడు కావలెను
■ బలిజ/ రెండో పెళ్లి/38/5'3"/M.Sc/ గవర్నమెంట్ ఎంప్లాయ్ / అందమైన వధువు తగిన వరుడు కావలెను. అన్ని కులాల వారి పెళ్లి సంబంధాల కొరకు సంప్రదించండి. శోభ రవి నాయుడు, మధువర్షిణి మ్యారేజెస్, సెల్ : 93921 92193
AJO-183937

BUILDING FOR RENT / SALE
■ ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ ఎదురు, రామ్‌నగర్, 6వ లైను, N.R.K.M లాడ్జి ప్రక్కన, 5అంతస్తుల బిల్డింగ్ (40X80 RCC) కొలతలతో అద్దె / అమ్మకానికి కలదు. సెల్: 9866659049, 7013261494
AJO-190171

PLOT FOR SALE
■ మారం వెంకారెడ్డి రియల్ ఎస్టేట్స్ ఒంగోలు NH-5 నుండి మంగమూరు రోడ్డు, పవర్ ఆఫీస్ దాటాక తక్షణం ఇల్లు నిర్మించుటకు, ఇన్వెస్ట్‌మెంట్‌కి అనుకూలంగా ఒక గది కేవలం 36 వేలకే ప్లాట్స్ కలవు. సంప్రం॥ 9885184207 స్పాట్ రి॥.
AJG-9462

రియల్ ఎస్టేట్
■ అవకాశౌ వ్యవసాయ భూమి అమ్మకం :- 4 లక్షలకే 11 సెంట్స్ / 8 లక్షలకే 22 సెంట్స్ / 15 లక్షలకే 44 సెంట్స్ / 30 లక్షలకే 88 సెంట్స్, ఇంద్రివనం, ముండ్లమూరు, అద్దంకి, సంప్రం॥ 8500031223, స్పాట్ రిజిస్ట్రేషన్.
AJG-191464

FLATS FOR SALE
■ గుంటూరు సిటీ, అమరావతి రోడ్‌కు దగ్గరలో వారాహి ఇన్‌ఫ్రా "నంది హోమ్స్" లో 3X విల్లాస్ మరియు సత్తెనపల్లిలో "షణ్ముఖ రాయల్" గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్‌లో అపార్ట్‌మెంట్స్, విల్లాస్ & డూప్లెక్స్ హౌసెస్ అమ్మకమునకు కలవు. ఫుల్ ఫినిష్డ్ రెడీ టు అక్యుపై. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. AP RERA NO. P07150120231. సంప్ర. 97016 89312
AJG-89

ప్లాట్లు కొనబడును
■ నెల్లూరులోని ముత్తుకూరు రోడ్, కనుపర్తి పాడు, బుజబుజనెల్లూరు, మైపాడు రోడ్ ఏరియాలోని ప్లాట్లు కొనబడును. సం.ప్ర. సెల్: 93464 48054, 79812 46665
AJR-193520

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

డయేరియా నివారణపై అవగాహన కల్పించాలి

● కలెక్టర్ తమిమ్ అన్సారియా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమిమ్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 28: జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున ప్రజలు డయేరియా వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు విస్తృతంగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమిమ్ అన్సారియా ఆదేశించారు. అందుకోసం జూలై 1నుంచి నెల రోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం వైద్య, అనుబంధ శాఖల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలుషిత నీరు తాగడం వల్ల అతిసారా, రక్తవిరోచనాలు, టైఫాయిడ్ తదితర రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రజలకు వాటిపై అవగాహన కల్పించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా అరికట్టేందుకు సాధ్యమవుతుందని తెలిపారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ ఎస్ఎన్.మూర్తి, డాక్టర్ బాలాజీనాయక్, టి.ఉషారాణి, సుభద్ర, మర్దన్‌అలీ, కె.మాధురి తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారితనంతో విధులు నిర్వర్తించాలి

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు జవాబుదారీతనంతో, నిజాయితీతో, బాధ్యతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ తమిమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక స్పందనహాలులో శుక్రవారం జిల్లా అధికారులతో సమావేశమై పరిచయం చేసుకుంటూ ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. వాటిని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని, ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలను పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఉందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో విశ్వేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన

ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఈవీఎంల గోడౌన్‌ను కలెక్టర్ తమిమ్ అన్సారియా శుక్రవారం పరిశీలించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ షట్టర్లకు వేసిన సీలును ఓపెన్ చేసి ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వినియోగించని(నాన్‌పోల్డ్) ఈవీఎంల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాన్ పోల్డ్ ఈవీఎంలు 1600 ఇక్కడ భద్రపర్చినట్లు సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈవీఎంలకు కల్పిస్తున్న భద్రత, సీసీకెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్న విధానంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అందుకు సంబంధించిన నివేదికను ఎన్నికల సంఘానికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో విశ్వేశ్వరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కాలేషా, రాజశేఖర్, రసూల్, సుదర్శనరావు, సయ్యద్‌హనీఫ్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి

విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంల పిలుపు ● విద్యాప్రవేశం కోసం పలు గ్రామాల్లో విద్యార్థుల ర్యాలీలు


గుండాయిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


ఒంగోలు డీఆర్ఎంఎం స్కూలులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఒంగోలు విద్యజూన్ 28: పాఠశాలల్లో ఒకటి నుంచి ఎనిమిదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వంద శాతం నమోదు లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాప్రవేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వివిధ పాటశాలల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. ఒంగోలు మండలం గుండాయపాలెం జడ్పీ హైస్కూలులో విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఒంగోలు మండల విద్యాధికారి కిషోర్‌బాబు, సమగ్రశిక్ష ఏఎంవో ఎం.రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బడి ఈడు బాలబాలికలు అందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్‌వీ.రమేష్, ఎస్.రామారావు పాల్గొన్నారు.

ఒంగోలు మండలం కరవది జడ్పీ హైస్కూలు విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఒంగోలు ఎంఈవో-2 సరస్వతి, హెచ్ఎం రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైస్కూలు ప్లస్‌లో కరవది ఉలిచి, చేజర్ల గ్రామాల నుంచి స్కూలు విద్యార్థులను ఇంటర్‌లో చేర్చుకున్నారు.

ఒంగోలు డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు వెంకటరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినందున విద్యార్థులు తమ పాఠశాలలో విరివిరిగా చేరాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, సురేష్, మాధవి, మధు, నరేష్ పాల్గొన్నారు.

కారుమూడివారిపాలెంలో..

మద్దిపాడు: బడి ఈడు పిల్లలు స్కూళ్లలో ఉండేవిధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు పి.నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని కారుమూడివారిపాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట విద్యార్థులను స్కూళ్లలో చేర్పేందుకు తల్లిదండ్రులు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిర, నరసింహారావు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



కారుమూడివారిపాలెంలో ర్యాలీ

కలెక్టర్‌కు పలువురి అభినందనలు


కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మొక్కను అందజేస్తున్న ఎన్‌జీవో సంఘం నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 28: నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ తమిమ్ అన్సారియాను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం అన్సారియాను కలిసిన వారు శాలువతో సత్కరించి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

- కలెక్టర్ తమిమ్ అన్సారియాను ఏపీఎన్‌జీవో సంఘం నాయకులు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలిశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు బొకేలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, కిషోర్, ప్రసన్న, విజయ్, మాధవి, కోటేశ్వరమ్మ, సునీల్, మంజేష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

- విజువల్లి చాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ తమిమ్ అన్సారియాను కలిసి బొకే అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మండపం గోపి, ప్రధానకార్యదర్శి నారపుశెట్టి రామమోహన్‌రావు, రంగస్వామి, శివకుమారి, దయానా, మరియమ్మ, పుష్ప, అజయ్‌కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా ఆధ్వర్యంలో కలెక్టర్ తమిమ్ అన్సారియాను కలిసి బొకే అందజేశారు. కార్యక్రమంలో బాణావతి, వెంకటేశ్వరరావు, షేక్ నజీర్‌బాషా, రాజేష్ పాల్గొన్నారు.

- బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టర్ తమిమ్ అనారియాను కలిసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తాటిపర్తి వెంకటస్వామి, ధరణికోట లక్ష్మీనారాయణ, జి.శివాజి, పేరం సత్యం, ఆర్. రాజశేఖర్, దాసు, రాజారావు పాల్గొన్నారు.

-మాలమహానాడు ఆధ్వర్యంలో కలెక్టర్ అన్సారియాకు బొకే ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బిళ్లా వసంతరావు, నాగార్జున, శ్రీనివాసరావు, క్రాంతి, భరత్, రాజశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

- ఆంధ్రప్రదేశ్ లేబర్ బోర్డు డైరెక్టర్ పెద్దిపోగు కోటేశ్వరరావు కలెక్టర్‌ను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు చెప్పారు.

- కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమిమ్ అన్సారియాను హైదరీ క్లబ్ కమిటీ ప్రతినిధులు కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. క్లబ్‌కు సంబంధించిన పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో హైదరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ గుండవరపు రాఘవ, కోశాధికారి జీవీ.ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీ ఈదుపల్లి గురునాథరావు, సభ్యులు కేవీ.సుబ్బయ్య, ఎండీ.మస్తాన్, ఎం.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి

● నివాళులర్పించిన పలు సంస్థలు

ఒంగోలు(కల్చరల్), జూన్ 28: మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు జయంతిని శుక్రవారం పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జేఏవి ఒంగోలు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజెన్స్ ఆధ్వర్యంలో స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న పీవీ.నరసింహారావు విగ్రహానికి పూలమాల వేసి పలువురు నివాళులర్పించి దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు సయ్యద్ ఇక్బాల్, జి.సుబ్బయ్యశర్మ, సురంపల్లి వెంకటేశ్వర్లు, జయశ్రీ సుబ్బారావు, పర్వతరెడ్డి, ఏడుకొండలు, కె.వరుణ్‌కుమార్, జేసీ బాలకృష్ణ, తడివర్తి దివ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీఅభయ కళారాధన సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాలలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావు పీవీ.నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఆంజనేయులురెడ్డి పండ్లు పంపిణీ చేశారు.


పీవీ.నరసింహారావుకు నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

యశోద హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స


మాట్లాడుతున్న డాక్టర్ శశికాంత్

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 28: హైదరబాద్ సోమాజిగూడలోని యశోద హాస్పిటల్‌లో విజయవంతంగా అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు డాక్టర్ శశికాంత్ మద్దు తెలిపారు. శుక్రవారం ఒంగోలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంగోలుకు చెందిన కొంగలేటి వెస్లీ కాలు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా దెబ్బతిని, ఆపరేషన్ చేసే వీలు కూడా లేకుండా పోయిందన్నారు. అయితే బాధితుడు వెస్లీ పలు వైద్యశాలలకు వెళ్లగా కాలు తొలగించాలని చెప్పారని, చివరిగా యశోద హాస్పిటల్‌లో వైద్యం కోసం చేరాడని తెలిపారు. అరుదుగా ఇలాంటి కేసులు నమోదు అవుతాయని, కాలు తొలగించకుండా ఆపరేషన్ కోసం తమ బృందం చర్యలు చేపట్టిందన్నారు. తాను, ఆర్థోపెడిక్ డాక్టర్‌లు సునీల్ దాచేపల్లి వైద్య పరీక్షలు నిర్వహించి, ఎలాంటి ఇబ్బంది లేకుండా యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో కాలు తొలగించకుండానే ఆపరేషన్ చేశామని తెలిపారు. ప్రస్తుతం బాధితుడు వెస్లీ ఆరోగ్యంగా ఉండటమే కాకుండా గతం లో లాగానే నడవగలుగుతున్నాడని ఆయన పేర్కొన్నారు.

గ్రంథాలయానికి బీరువా, ర్యాక్ వితరణ

ఒంగోలు(కల్చరల్), జూన్ 28: ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఇక్కడ లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న కాళహస్తి సంపూర్ణ శుక్రవారం బీరువా, పుస్తకాలు పెట్టుకునేందుకు ఐరన్ ర్యాక్‌ను బహూకరించారు. వీటిని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంపూర్ణ మాట్లాడుతూ తన తండ్రి, గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగి కాళహస్తి సుబ్బారావు, నాగమ్మల జ్ఞాపకార్థం బీరువా, ర్యాక్ వితరణ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఐ.నరసింహారావు, సామాజిక సేవకులు నున్నా ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.


బీరువాను ప్రారంభిస్తున్న ఆదిలక్ష్మి

అవీ..ఇవీ..

1న ఇంటి వద్దనే 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లు పంపిణీ

● నగర కమిషనర్ జశ్వంతరావు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 28: ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు జూలై 1వ తేదీన సచివాలయ సెక్రటరీల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేస్తామని నగర కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఎంవో ఎంఎస్ నెం.43 ప్రకారం ప్రస్తుతం అందిస్తున్న ఫించన్ రూ. 3వేల నుంచి రూ.4వేలకు పెంచారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన పెన్షన్‌లకు సంబంధించి మొత్తం కలిసి రూ.7 వేలు సోమవారం అందజేస్తారని పేర్కొన్నారు. అలాగే దివ్యాంగుల పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.6వేలు, దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారికి రూ.5 వేల నుంచి రూ.10వేలు, మంచానికే పరిమితమైన లబ్ధిదారులు, తీవ్రమైన మస్కులర్ డిస్ట్రోఫీ కేసులు, ప్రమాద బాధితులకు రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు పింఛను అందజేస్తాని తెలిపారు. లబ్ధిదారులు పింఛను కోసం సచివాలయం, కార్పొరేషన్ కార్యాలయం, బ్యాంకుల వద్దకు వెళ్లనవరం లేదన్నారు. సచివాలయ సెక్రటరీలు నేరుగా ఇంటివద్దనే పింఛను నగదు అందజేస్తారని, అందువల్ల లబ్ధిదారులు వారికి అందుబాటులో ఉండాలని కమిషనర్ కోరారు.

రైతులకు బహుమతుల ప్రదానం

ఒంగోలు(కల్చరల్), జూన్ 28: కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ నిర్వహించిన 2023-24 రబీ సీజన్‌కుగాను గ్రోమోర్ రైతు సంబరాలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రోమోర్ ఎరువులు కొనుగోలు చేసిన జిల్లాకు చెందిన రైతులలో ఐదుగురిని లాటరీ ద్వారా ఎంపిక చేసి వారికి ఒక్కొక్కరికీ 50 గ్రాముల వెండిని బహూకరించారు. కార్తీక్, కోటిరెడ్డి, రమణారెడ్డి, కాశయ్య, గోపాల్‌రెడ్డిలు బహుమతులు గెలుచుకోగా స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో డీఏవో శ్రీనివాసులు, మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి హరికృష్ణ, కోరమాండల్ సంస్థ సీనియర్ మేనేజర్ విజయ్ కుమార్ వారిని అభినందించారు.

పెన్షన్లు అందరికీ అందేలా చూడాలి

మద్దిపాడు, జూన్ 28: ఎన్టీఆర్ భరోసా పథకం కింద జూలై 1న పంపిణీ చేసే పెన్షన్ల పంపిణీ విజయవంతం చేయటానికి తెలుగుదేశం పార్టీ నాయకులు భాగస్వాములు కావాలని మద్దిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటింటికి పెన్షన్లు అందిస్తారని, అర్హులైన వారికి అవి అందేవిధంగా పార్టీ నాయకులు చూడాలని ఆయన పేర్కొన్నారు.

ఏడు ఆటోలు సీజ్


ఆటోలను సీజ్ చేసిన ఎస్ఐ మహేష్

మద్దిపాడు, జూన్ 28: వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేష్ పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడులో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన 7 ఆటోలను ఆయన సీజ్ చేశారు. ఆటో డ్రైవర్లు అధికంగా ప్రయాణికులను ఎక్కించుకొని వేగంగా డ్రైవ్ చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న ఉభయదాతలు

నాగులుప్పలపాడు, జూన్ 28: ముప్పాళ్ళ గ్రామంలో వేంచేసిన శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, హోమ పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఉభయ దాతలుగా గ్రామ సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ, వీరాంజనేయులు దంపతులు వ్యవహరించారు. శనివారం స్వామివారి కళ్యాణోత్సవం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

పీజీసెట్‌లో రాష్ట్రస్థాయి రెండో ర్యాంక్


బ్లెస్సీ జాయ్

నాగులుప్పలపాడు, జూన్ 28 : పీజీ సెట్ ఫలితాల్లో ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన బ్లెస్సీజాయ్ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించారు. ఒంగోలుకు చెందిన బ్లెస్సీజాయ్ కుటుంబం ఉప్పుగుండూరులో స్థిరపడ్డారు. తల్లి సుచరిత బాపట్ల జిల్లా పెదగంజాం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా, తండ్రి ముత్యాలయ్య ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో బీఏబీఈడీ పూర్తి చేసిన బ్లెస్సీజాయ్ ఉన్నత చదువుల నిమిత్తం రాష్ట్రంలో నిర్వహించిన పీజీసెట్ లో 89 మార్కులను సాధించి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ పొందారు. ఈ సందర్భంగా ఆమెను సీపీఎం నాయకులు టి.శ్రీకాంత్, కాకాని సుబ్బారావు, యు.వెంకటేశ్వర్లు, సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శామ్యూల్ తదితరులు మంగళవారం ఓ ప్రకటనలో అభినందించారు.

రేపు గౌడ విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 28: జిల్లా గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2023-24 పదో తరగతి పరీక్షలో ప్రతిభ చాటిన గౌడ విద్యార్థినీ విద్యార్థులకు ఈనెల 30వ తేదీన ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు సంఘ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. 500 నుంచి ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం ఉదయం 10గంటలకు ఒంగోలు నగరం బాలాజీరావు పేటలోని లావు బాలగంగాధరరావుభవన్‌లో అవార్డులను అందజేస్తామన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయం, తృతీయ బహుమతులు రూ.3వేలు, రూ.2వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. గౌడ, శెట్టిబలిజ, యాత, శ్రీశయనకు చెందిన విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు సెల్ నెం.9948160110 ద్వారా సంప్రదించాలని కోరారు.

నేడు సర్పంచ్‌ల సంఘ సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 28 : జిల్లా సర్పంచ్‌ల సంఘం అత్యవసర కార్యవర్గ సమావేశం శనివారం ఒంగోలులోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో జరుగుతుందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చ ఉంటుందని, కార్యవర్గ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు

సంతనూతలపాడు, జూన్ 28: ఎస్సీ, ఎస్టీలు విదేశీవిద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంబేడ్కర్ విదేశీవిద్యగా పేరు మార్చడంపై మండల టీడీపీ ఎస్సీ నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జగనన్న విదేశీవిద్యగా ఉన్న పేరును అంబేడ్కర్ విదేశీవిద్యగా మార్చినందున హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు టి.నరసింహారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి కృషి

నాగులుప్పలపాడు, జూన్ 28: నాగులుప్పలపాడులోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి చేసేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, ట్రాక్టర్ యజమానులు తమ వంతు కృషి చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నం వెంకటరావు, పొణకల గౌతమ్, మండల మైనార్టీ సంఘం అధ్యక్షుడు షేక్ ఖాసీం, గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు శ్మశానస్థలానికి మట్టి తోలి చదును చేశారు. అలాగే గతంలో నిర్మించిన బావి, మండపం, అరుగులను అభివృద్ధి చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

హోంమంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

సంతనూతలపాడు, జూన్ 28: మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రమాణస్వీకారానికి మండలం నుంచి రాష్ట్ర టీడీపీ సెక్రటరీ అడకాస్వాములు, మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, సురేష్, పలువురు నాయకులు తరలివెళ్లారు. ఈక్రమంలో అక్కడికి విచ్చేసిన హోంమంత్రి అనితను వారు మర్యాదపూర్వకంగా కలిశారు.

డయేరియా నివారణకు చర్యలు

మద్దిపాడు, జూన్ 28: డయేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం వెల్లంపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విరేచనాలు, టైఫాయిడ్ నీటి ద్వారా సంక్రమించే వ్యాధులను, వ్యక్తిగత పరిశుభ్రతతో నివారించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టిబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, ఎంపీటీసీ అద్దేపల్లి లక్ష్మీదుర్గాభవాని, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గురుకులంలో సైన్స్ గ్రూపుల్లో అడ్మిషన్లు

మంత్రి స్వామి ఆదేశాలతో విద్యార్థులకు తొలగిన ఇక్కట్లు

సింగరాయకొండ, జూన్ 28 : సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదేశాలతో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సీఈసీతోపాటు కొత్తగా ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచే ఇవి వినియోగంలోకి వస్తాయన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు తమ దరఖాస్తులను వచ్చేనెల 1వతేదీ సాయంత్రం 5 గంటల లోపు పాఠశాల కార్యాలయంలో సమర్పించాలన్నారు. 10వ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా తయారుచేసిన మెరిట్‌లిస్ట్ ప్రకారం స్పాట్ అడ్మిషన్లు ఉంటాయన్నారు. విద్యార్థులు ఈఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు నియోజకవర్గ స్థాయిలో మంత్రి సమీక్ష

కొండపి, జూన్ 28 : కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల అన్ని శాఖల అధికారులు, నియోజవకర్గస్థాయి అధికారులతో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శనివారం ఉదయం సమీక్ష నిర్వహించనున్నారు. అందుకోసం స్థానిక పొదిలి రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో చేసిన ఏర్పాట్లను తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో వీఆర్ఏలకు అన్యాయం

సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వివేకానంద



మాట్లాడుతున్న వీఆర్ఏల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వివేకానంద

టంగుటూరు, జూన్ 28 : గత వైసీపీ ప్రభుత్వంలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని వీఆర్ఏల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు వివేకానంద ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానికంగా జరిగిన సంఘ మండల స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం రివర్సు డీఏ పేరుతో ఒక్కో వీఆర్ఏ వద్ద రూ15 వేల నుంచి రూ18వేలు వసూలు చేసిందని గుర్తు చేశారు. 2014 ప్రాంతంలో అప్పటి ప్రభుత్వం వీఆర్ఏలకు రూ.4వేల వేతనం, డీఏ పెంచిందని.. దాన్ని చూసి ఓర్వలేకపోయిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ డీఏ పేరుతో రాష్ట్రంలోని వీఆర్ఏల వద్ద రూ.250 కోట్లు తిరిగి వసూలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు వేతనాలు పెంచిన టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు తిరిగి అధికారంలోకి రావడం సంతోషంగా ఉందని, పోరాటం చేసి అయినా కచ్చితంగా జీతాలు పెంచుకుంటామన్నారు.

సంఘ మండల నూతన కమిటీ ఎన్నిక

సంఘ మండల సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వీఆర్ఏల సంఘ మండల అధ్యక్షుడిగా పొట్టేళ్ల ఏడుకొండలరావు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా బనంపూడి సుందరరావు, ఉపాధ్యక్షురాలిగా ఆలూరి సుబ్బులు, ప్రధాన కార్యదర్శిగా మల్లెల కృష్ణ, సహాయ కార్యదర్శిగా కట్టా ఈతముక్కల, కోశాధికారిగా మిట్నసల నారాయణ, మండల కార్యవర్గ సభ్యులుగా శ్రావణి, తేజ, ప్రభాకర్, సుజాత, రవి ఏకగ్రీవమయ్యారు. అనంతరం నూతన కమిటీ తహసీల్దార్‌ను కలిసింది. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘ నాయకులు నారాయణ, ప్రభాకర్, సుజాత, మాధవి, అనిత, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌కు జనసేన నేత మనోజ్ శుభాకాంక్షలు

టంగుటూరు, జూన్ 28 : నూతన కలెక్టర్ తమీమ్ అన్సారియాను శుక్రవారం జనసేన పార్టీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్ కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కొండపి నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందివ్వాలని కోరారు. ఆయన వెంట పార్టీ సింగరాయకొండ మండల అధ్యక్షుడు అయినాబత్తిన రాజేష్, కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు, మర్రిపూడి మండలాల అధ్యక్షులు, సింగరాయకొండ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌ఖాజా హుస్సేన్ ఉన్నారు.

కామేపల్లిలో 'నేను బడికిపోతా' అవగాహన ర్యాలీ



ర్యాలీలో ఎంఈవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు

జరుగుమల్లి (కొండపి), జూన్ 28 : మండంలోని కామేపల్లిలో శుక్రవారం 'నేను బడికిపోతా' అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో-1 బి.నాగేంద్ర వదన్ మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని, డ్రాప్‌అవుట్స్ లేకుండా చూడాలని అధికారులు, ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని సూచించారు. చిన్నారులతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 డోలా శ్రీనివాసరావు, జడ్పీస్కూల్ హెచ్ఎం ఎస్.శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లకు 53,863 దరఖాస్తులు

నూజివీడు టౌన్, జూన్ 28 : రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యలో ప్రవేశాలకు అధికభాగం బాలికల నుంచి దరఖాస్తులు అందాయని, ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ఆర్కేవ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో ఉన్న 4,400 సీట్లకు మొత్తం 53,863మంది విద్యార్థులు దరఖాస్తు చేశారన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల నుంచి 34,154 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 19,671 మంది, ఇతర రాష్ట్రాల నుంచి 38 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 30,857 మంది బాలికలు ఉండగా, 23,006 మంది బాలురు ఉన్నారన్నారు. ఇక సైనిక సంతతి విభా గంలో 2,582 మంది, ఎన్‌సీసీలో 1830, స్పోర్ట్స్ విభాగంలో 1162, దివ్యాంగుల విభాగంలో 332, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 270 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

ఒకటి నుంచి అడ్మిషన్ల ప్రక్రియ

జూలై 1వ తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. సైనిక సంతతికి చెందిన విద్యార్థులకు జూలై 1 నుంచి 3వ తేదీ వరకు ఎన్‌సీసీ విద్యార్థులకు జూలై 3 నుంచి 5వ తేదీ వరకు, దివ్యాంగులకు, స్పోర్ట్స్ విభాగంలోని వారికి జూలై 3వ తేదీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వారికి జూలై 2,3 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల తుదిజాబితా జూలై 11న విడుదల చేస్తారని, నూజివీడు, ఆర్కే వ్యాలీలలో ఆయా క్యాంపస్‌లకు కేటాయించిన విద్యార్థులకు జూలై 22, 23 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతుందని, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి జూలై 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి 26,27 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ప్రత్యేక కేటగిరిల్లో పోటాపోటీ

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో 2024 అడ్మిషన్‌లలో తీవ్ర పోటీ నెలకొంది. ఈసారి సాధారణ కేటగిరిలోనే కాక ప్రత్యేక కేటగిరిల్లో సైతం అడ్మిషన్లకు పోటీ నెలకొనడం విశేషం. క్రీడల విభాగంలో 0.5శాతం రిజర్వేషన్ క్రింద మొత్తం నాలుగు క్యాంపస్‌ల మీద 20 సీట్లను కేటాయించగా, 1162 మంది దరఖాస్తు చేశారు. అంటే ఒక్కో సీటుకు దాదాపు 58 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఇక సైనిక సంతతి విభాగంలో 40 సీట్లకు 2,587 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, ఇక్కడ ఒక్కో సీటుకు 64 మంది పోటీ పడుతున్నారు. ఎన్‌సీసీ విభాగంలో 80 సీట్లకు 1,830 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, ఒక్కో సీటుకు 22.8 మంది పోటీ పడుతుండగా, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 20 సీట్లకు 270 మంది దరఖాస్తు చేశారు. ఈ విభాగంలోనూ 14 మంది విద్యార్థులు పోటీ పడుతుండగా, ఒక ప్రత్యేక అవసరాలు కలిగిన విభాగంలో మాత్రం 200 సీట్లకు 332 మంది దరఖాస్తు చేయగా, ఒక్కో సీటుకు 1.66 మంది విద్యార్థులు పోటీ ఏర్పడింది. మొత్తం మీద స్పెషల్ కేటగిరీలో ఒక ప్రత్యేక అవసరాలు కలిగిన విభాగంలో మినహా మిగిలిన అన్ని విభాగాల్లోనూ ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌లో ప్రవేశానికి తీవ్ర పోటీ నెలకొంది.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే సహించం

వైసీపీ నేతలకు మంత్రి స్వామి హెచ్చరిక

మర్రిపూడి/పొన్నలూరు(కొండపి) జూన్ 28 : ప్రశాంతంగా ఉండే కొండపి నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే సహించబోమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి హెచ్చరించారు. శుక్రవారం మర్రిపూడిలో జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారంటు మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆరోపించడం అవివేకమన్నారు. వైసీపీ పాలనలో దళిత ఎమ్మెల్యేనైన తనపై శాసనసభలో దాడి చేస్తే మంత్రిగా ఉండి కూడా నోరు మెదపని సురేష్.. ఇప్పుడు అవాకులు, చెవాకులు పేలుతున్నారన్నారు. టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారిస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి, మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు, తెలుగు రైతు అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తుళ్లూరి నరసింహారావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు హనుమారెడ్డి, నాయకులు సారెడ్డి యోగిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, నరసారెడ్డి, వెంకటరెడ్డి, మోహన్‌రావు, ఏడుకొండలు, బాల నరసయ్య, గురజాల పోలయ్య పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

కుర్రా ఆధ్వర్యంలో మంత్రి స్వామికి అపూర్వ స్వాగతం

తెలుగు యువత నాయకుడు కుర్రా మల్లికార్జునరావు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామికి అపూర్వ స్వాగతం పలికారు. కుర్రా స్వగ్రామమైన గంగపాలెం నుంచి కిలోమీటర్ మేర రోడ్డుకు ఇరువైపులా స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రాజుపాలెం వద్ద కుర్రా బంధువులు, మహిళలు స్వామిపై పూల వర్షం కురిపించి అపూర్వ స్వాగతం పలికారు. మర్రిపూడిలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంత్రిని కలిసి పూల దండలు వేసి బొకేలు అందజేసి అభినందించారు. మర్రిపూడిలోని బస్టాండ్ నుంచి తూర్పు బజారు వరకు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

పొన్నలూరు మండలంతోపాటు, నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయన్న మంత్రి స్వామి.. గర్భకండ్రిగలు, చుక్కల భూములు, అసైన్డ్ భూ సమస్యల పరిష్కరించుకుందామని అన్నారు. పొన్నలూరులోని గిరిజన గురుకుల పాఠశాల టీడీపీ హయాంలోనే ఏర్పాటైందని, తిరిగి తన హయాంలోనే భవనాలు పూర్తి చేసి ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వంలో సచివాలయాలను అసంబద్ధంగా, నిరుపయోగంగా గ్రామాలకు దూరంగా నిర్మించారని, వీటిలో పెద్దఎత్తున అవినీతి జరిగినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వాటిపై కూడా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్వామి వివరించారు. 2014-19 మధ్య కాలంలో ఆగిపోయిన ఇళ్ల బిల్లులు చెల్లిస్తామని, ఇతర అభివృద్ధి పనులను పునఃప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా పలువురు కొత్త పింఛన్‌లు, గురుకుల పాఠశాలల్లో సీట్లు కోసం, రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారం కోరుతూ స్వామికి వినతిపత్రాలు అందజేశారు. ఆయనే పలువురు వద్దకు వెళ్లి వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ పొన్నలూరు మండల అధ్యక్షుడు అనుమోలు సాంబయ్య, మండవ ప్రసాద్, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, మండవ మురళి, అనుమోలు సుధాకర్, రాపూరి కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన మంత్రి

అన్నం వృథా చేయొద్దని సూచన

పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లిన ప్రిన్సిపాల్

పరిష్కరిస్తానని స్వామి హామీ

కొండపి, జూన్ 28 : కొండపిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వంట గదిని సందర్శించి పనివారితో మాట్లాడారు. విద్యార్థులు భోజనం చేసి చేతులు శుభ్రం చేసుకునే కొళాయిల వద్ద అన్నం ఎక్కువగా పడి ఉండటాన్ని చూసిన ఆయన ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. అన్నం వృథా చేయవద్దని సూచించారు. అనంతరం స్కూల్ లోపల, వెలుపల ఉన్న మరుగుదొడ్లను స్వామి పరిశీలించారు. వెలుపల ఉన్న టాయిలెట్లు కొన్ని పనిచేయడం లేదని ప్రిన్సిపాల్ వివరించారు. విద్యార్థులు దుస్తులు ఉతుక్కునే చోట, వెలుపల టాయిలెట్ల వద్ద పిచ్చిచెట్లు, వ్యర్థాలు ఉండటాన్ని గుర్తించిన మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో చెత్తను, పిచ్చిచెట్లను తొలగించాలని సూచించారు. అదేవిధంగా బయో టాయిలెట్లను స్వామి పరిశీలించారు. విద్యుత్ దీపాలు లేకపోవడంపై ప్రిన్సిపాల్‌ను వివరణ అడగ్గా స్కూల్‌కు విద్యుత్ హెల్పర్ లేడని, ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. విద్యుత్ బిల్లులు కూడా 2023 సెప్టెంబర్ నుంచి రూ.9 లక్షలకుపైగా బకాయిలు ఉన్నాయని ఆమె వివరించారు. వెంటనే మంత్రి సాంఘిక సంక్షేమశాఖ డీడీతో ఫోన్‌లో మాట్లాడి స్కూల్‌కు విద్యుత్ హెల్పర్‌తోపాటు, ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఇతరత్రా సౌకర్యాలపై అర్జీ రాసి ఇవ్వాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

డాక్టర్లుగా తయారు కావాలి

ఈసందర్భంగా మంత్రి సీనియర్, జూనియర్ ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నీట్ కోచింగ్ ఇస్తున్న విషయం మీకు తెలుసా? అని ప్రశ్నించారు. కొందరు తెలుసని మంత్రికి చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా నీట్ కోచింగ్ ఇస్తున్నదని విద్యార్థులు కష్టపడి, ఇష్టంతో చదివి డాక్టర్లు కావాలని సూచించారు. ఈఏడాది బ్యాచ్‌ల్లో కనీసం ఇద్దరైనా డాక్టరు కోర్సులకు వెళ్లి రాబోయే విద్యార్థినులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించారు. మంత్రి వెంట సీనియర్ నాయకుడు బంగారయ్య, టీడీపీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్యచౌదరి ఉన్నారు.



వంటగది వద్ద విద్యుత్ దీపాలు లేకపోవడాన్ని ప్రశ్నిస్తున్న స్వామి

ఉపాధి హామీలో చేతివాటం

అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లు

సామాజిక తనిఖీల్లో వెలుగులోకి

ఆగ్రహం వ్యక్తం చేసిన డ్వామా పీడీ అర్జున్‌రావు



కనుమళ్ల ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ అర్జున్‌రావు

సింగరాయకొండ, జూన్ 28 : వైసీపీ ప్రభుత్వం (2023-24 ఆర్థిక సంవత్సరం)లో మండలంలోని పలు గ్రామాల్లో చేసిన ఉపాధి హామీ పనుల్లో అవినీతి బయటపడింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని ప్రాంగణంలో శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 10 గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆడిట్ చేసిన డీఆర్పీలు తాము గుర్తించిన అంశాలను డ్వామా పీడీ అర్జున్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 923 ఉపాధి హామీ పనులకు రూ.8.84 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అందులో రూ.1.99 లక్షల మేర అవినీతి జరిగినట్లు వివరించారు. సోమరాజుపల్లి, పాకల, ఊళ్లపాలెం గ్రామాల్లోని పంట చెరువుల్లో ఉపాధి హామీ పనులను యంత్రాలతో చేయించి కూలీలు చేసినట్లు చూపారని డీఆర్పీలు పీడీ దృష్టికి తీసుకెళ్లారు. పాతసింగరాయకొండ ఫీల్డ్ అసిస్టెంట్ కొత్త జాబ్‌కార్డుకి ఒక్కొక్కరి నుంచి రూ.1,400 వసూలు చేసినట్లు తమకు ఫిర్యాదు అందిందని వివరించారు. పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద నాటిన మొక్కలకు, లెక్కల్లో చూపిన వాటికి వ్యత్యాసాలు గుర్తించిట్లు డీఆర్పీలు తెలిపారు. ఊళ్లపాలెం హైస్కూల్‌లో ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటినట్లు చూపగా అక్కడ అవి కనిపించలేదన్నారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్‌ను వివరణ కోరగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా అడ్డుగా ఉన్నాయని తొలగించామని వింత సమాధానం చెప్పారని డీఆర్పీలు వివరించారు. అన్ని గ్రామాల్లో కొందరి కూలీలు సంతకాలు పెట్టకుండానే హాజరువేసి కూలి చెల్లించట్లు గుర్తించిట్లు చెప్పారు. చేసిన పనులకు, రికార్డుల్లో చూపిన కొలతలకు వ్యత్యాసాలు ఉన్నాయని వెల్లడించారు. పనులకు సంబంధించిన ఫొటోలను కూడా సక్రమంగా అప్‌లోడ్ చేయలేదన్నారు. అనంతరం పీడీ అర్జున్‌రావు మాట్లాడుతూ 15 రోజుల్లో రికార్డుల్లో చూపిన విధంగా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద నాటిన మొక్కలు ఉండాలన్నారు. లేకుంటే షోకాజ్ నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అవినీతి సొమ్మును రికవరీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి, ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో నాగేష్‌కుమారి, పూర్వపు ఎంపీడీవో జమీవుల్లా, ఏపీవో సుధాకర్‌రావు పాల్గొన్నారు.

బింగినపల్లి చెరువును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



సమస్యను అధికారులకు వివరిస్తున్న టీడీపీ నేతలు

సింగరాయకొండ, జూన్ 28 : మండలంలోని బింగినపల్లిలో దెబ్బతిన్న చెరువు తూమును ఇరిగేషన్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. మూడేళ్ల క్రితం ఇది మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి చెరువులో నీరు నిలవక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు నీటి విడుదల సమయంలో కూడా కష్టాలు తప్పడం లేదు. ఈ సమస్యను టీడీపీ నాయకులు, రైతులు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు మరమ్మతులకు గురైన తూమును పరిశీలించారు. ఈసందర్భంగా చెరువులో రొయ్యల పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు కలవడం వలన నీరు కలుషితమవుతుందని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కలుషిత నీటి వలన పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యర్థాలను చెరువులోకి రాకుండా నియంత్రించాలని కోరారు. అలాగే తూముకు త్వరితగతిన మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ మధుబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, టీడీపీ నాయకులు సన్నెబోయిన మాలకొండయ్య, రోశిరెడ్డి రైతులు పాల్గొన్నారు.



అధిక ధరలకు పొలాలను కౌలుకు తీసుకోవద్దు

వేలం కేంద్రం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ సూచన



మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి, జూన్ 28 : రైతులు రాబోయే సీజన్‌కు అధిక ధరలకు పొలాలు, పొగాకు బ్యారన్‌లు కౌలుకు తీసుకుని నష్టపోవద్దని స్థానిక వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ సూచించారు. ఎస్‌జీవో సాయికుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం వేలం కేంద్రంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేలంకేంద్రం అధికారులు రైతుల సంక్షేమం కోసమే పనిచేస్తున్నారన్నారు. సాయికుమార్ కూడా నిజాయితీతో సేవలందించారన్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పొలాల్లో చల్లుకుని నేల సారాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ఎస్‌జీవో సాయిని వేలం కేంద్రం సిబ్బంది, రైతులు సన్మానించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు మాజీ కార్యదర్శి ఎస్.మధుసూదనరావు, బోర్డు సభ్యుడు బొడ్డపాటి బ్రహ్మయ్య, ఎరువుల కమిటీ అధ్యక్షుడు కొల్లూరి హరిబాబు, రైతు సంఘం నాయకులు పోటు శ్రీనివాసమురళి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, నాగినేని భాస్కర్, నన్నూరి సుబ్బరామయ్య, పోకూరి కోటేశ్వరరావు, సీపీఎం మండల నాయకుడు కేజీ మస్తాన్ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూన్ 27: రైతాంగం అభివృద్ధి కోసం అధికారులు మరింత చొరవ చూపాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో రైతులు ఆర్థికంగా చితికిపోయారన్నారు. కేవలం కాగితాల్లో రైతులకు మేలు చేసినట్లు కాదని, ప్రత్యక్షంగా రైతులకు మేలు చేకూరినప్పుడే తిరిగి పంటలు వేసేందుకు ముందుకు వస్తారన్నారు. రైతులకు సరైన సేవలు అందించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవటంలో ఏమాత్రం వెనుకాడేదిలేదన్నారు. రైతులు కూడా వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ శ్రీరాంమూర్తి, ఏడీఏ ఈవీ రమణ, ఏవో జ్యోష్ణాదేవి, కృష్ణ, ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, ఎంపీపీ ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ గఫార్, నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్), నంబులు వెంకటేశ్వర్లు యాదవ్, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, పెన్నా చిననాగయ్యయాదవ్, మూలె బ్రహ్మారెడ్డి, ఫిరోజ్ పాల్గొన్నారు.

వాగులో అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ?

కనిగిరి, జూన్ 28: పట్టణంలో వాగు ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకుంటున్నామని చెప్పే మాటలు ఆచరణలో కనిపించటం లేదు. పట్టణ సమీపంలో పొదిలి రోడ్డులోని లారీ స్టాండ్ సమీపంలో గత ప్రభుత్వంలో వైసీపీ నాయకుల అండతో ఆరు ఎకరాల వాగు విస్తీర్ణాన్ని ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. పొదిలి రోడ్డులోని సర్వే నెంబరు 845లో 6.6 ఎకరాల ప్రభుత్వ వాగు పోరంబోకు భూమి ఉంది. దీనిపైన కన్నేసిన ఆక్రమణదారుడు తన సోదరుడిని అడ్డంగా పెట్టి భూమి పక్కన ఉన్న అసైన్డ్ భూమిని ఆనుకుని ఉన్న వాగు భూమిని ఆక్రమించారు. ఆక్రమించిన భూమిలో నిర్మాణాలు కూడా చేపట్టారు. అప్పట్లో సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకుండా ఆక్రమణదారులకు మద్దతుగా నిలిచారు. దీ వెనక వైసీపీ ముఖ్యనేత అండ ఉండటంతో అధికారులు ప్రేక్షకపాత్ర వహించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ వాగు భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు





మార్కాపురం తహసీల్దార్ కార్యాలయం

ఆ వీఆర్వోలు మళ్లీ వస్తున్నారా?

- భూ అక్రమాలలో ఆరునెలలు సస్పెన్షన్
- కలెక్టర్ మారడంతో తిరిగి వచ్చేందుకు యత్నాలు
- తర్వాత బాపట్ల, నెల్లూరులో పోస్టింగులు
- సిఫార్సుల కోసం ప్రదక్షిణలు

మార్కాపురం, జూన్ 28: వారంతా గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థకు మూలస్తంభాలు. రాష్ట్రంలో ఉన్న రెవెన్యూ పాలన అంతటికీ వీరే కీలకం. గ్రామీణ ప్రాంతాలలో భూమి ఉన్న ప్రతి ఒక్కరూ పూర్వం నుంచి గ్రామరెవెన్యూ అధికారిని గౌరవప్రదంగా చూసుకుంటారు. వీఆర్వోలు కూడా తమ ఉద్యోగాన్ని హుందాతనం తగ్గకుండా భూసంబంధమైన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుంటారు. అయితే మార్కాపురంలో గత వైసీపీ పాలనలో రెవెన్యూ పాలన దారి తప్పింది. అప్పటి అధికార వైసీపీకి చెందిన నాయకులు ఒత్తిడి, రెవెన్యూ ఉద్యోగుల స్వలాభాపేక్ష వెరసి భూ అక్రమాలకు ఆజ్యం పోశాయి. ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూములపై వైసీపీ నేతల కన్ను పడగా, రెవెన్యూ అధికారులు చేతికందినంత దండుకొని దొంగ రికార్డులు సృష్టించి భూములను అక్రమార్కులకు కట్ట బెట్టారు. ఇంకొంత మంది వీఆర్వోలు తమ కుటుంబసభ్యుల పేరున భూమిని రాసుకున్నారు. ఈ అక్రమ తతంగానికంతటికి 2022 జూన్ 30న ఉద్యోగవిరమణ చేసిన తహసీల్దార్ విద్యాసాగరున్ని ఆయుధంగా మరల్చు కున్నారు. అయితే ఈ భాగోతాలు పత్రికల్లో వెలుగు చూడడంతో నాటి కలెక్టర్ దినేష్‌కుమార్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని సస్పెండ్ చేశారు. అనంతరం వారికి బాపట్ల, నెల్లూరు జిల్లాలలో ఉద్యోగాలిచ్చారు. వారిప్పుడు కొందరు ఉద్యోగాలు చేస్తుండగా, ఇద్దరు మరణించారు. మరికొందరు సెలవుపై ఉన్నారు.

మార్కాపురం వచ్చేందుకు తిరిగి యత్నాలు

మార్కాపురం మండలంలో చేసిన భూ అక్రమాలపై నెల్లూరు, బాపట్ల జిల్లాలలో పనిచేస్తున్న వీఆర్వోలు తిరిగి మార్కాపురం వచ్చేందుకు నూతన ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇటీవల బదిలీ అయిన కలెక్టర్ దినేష్‌కుమార్ ఉండటంతో కొందరు వీఆర్వోలు ఆయన ఉండగా రాని స్తాడో..? లేదో..? అని మిమాంసలో ఉన్నారు. అయితే నూతన ప్రభుత్వం కలెక్టర్ దినేష్ కుమార్‌ను బదిలీ చేయడంతో వారి యత్నాలు ముమ్మరం చేశారు. నూతనంగా వచ్చిన కలెక్టర్‌కు తమగురించి పూర్తిగా తెలిసేలోపే తామంతా సొంతగూటికి వచ్చి చేరాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

సిఫార్సుల కోసం ప్రదక్షిణలు

భూ అక్రమాల ఆరోపణలతో బదిలీ అయిన వీఆర్వోలు స్వస్థలానికి వచ్చేందుకు సిఫార్సుల కోసం తాము నమ్ముకున్నవారి కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు నూతనంగా ఎన్నికైన శాసన సభ్యులు, వారి కుటుంబసభ్యుల చుట్టూ తిరుగుతున్నారు. మరి కొందరు ఉద్యోగ సంఘాల నేతల చుట్టూ, ఇంకొందరు కలెక్టరేట్‌లో పైరవీలు చేయడంలో పేరుగాంచిన ఉన్నతోద్యోగుల చుట్టూ తిరుగుతున్నారు. మరి నూతనంగా వచ్చిన కలెక్టర్ ఉద్యోగుల బదిలీల్లో పారదర్శకత పాటిస్తారో? లేదా సిఫార్సులకు తలొగ్గి అక్రమార్కులను చేరదీస్తారో? చేసి చూడాలి.

ఇంటివద్దనే పెన్షన్ పంపిణీ

బేస్తవారపేట, జూన్ 28 : బేస్తవారపేట మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉదయం 6గంటల నుండి సచివాలయ సిబ్బంది ద్వారా పెరిగిన పెన్షన్‌తో కలిపి లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో టి.పార్వతి తెలిపారు. సచివాలయ సిబ్బందికి లబ్ధిదారులు పెన్షన్లు తీసుకోవాలని ఆమె కోరారు.

రేపు కార్యవర్గ సమావేశం

గిద్దలూరు, జూన్ 28 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గిద్దలూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఈనెల 30న ఉదయం 10గంటలకు స్థానిక పింఛనర్ల భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ఎస్.వి.రమణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల పరిధిలోని అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB TRUST AND EXCELLENCE SINCE 1904
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము: నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in,
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు: 1) మెస్సర్స్ పుష్పా హ్యాండ్లూమ్స్ అండ్ డైయింగ్ వర్క్స్, డి.నం.12-11-71, బ్రాహ్మిన్ రోడ్, చీరాల నగర్, జండ్రపేట, ప్రకాశం జిల్లా-523165, ఆంధ్రప్రదేశ్. నం.2) శ్రీ బోయిన బాజి రెడ్డి, తండ్రి స్వర్గీయ కేశవ రెడ్డి, డి.నం. 35-153, చీరాల నగర్, జండ్రపేట, ప్రకాశం-523165, ఆంధ్రప్రదేశ్. నం.3) శ్రీమతి బోయిన పుష్పలత, భర్త బాజిరెడ్డి, డి.నం.35-153, చీరాల నగర్, జండ్రపేట, ప్రకాశం-523165, ఆంధ్రప్రదేశ్ నుండి 15.05.2024 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయిలతో కలిపి 14.05.2024 నాటికి రూ. 8,33,418/- (రూపాయలు ఎనిమిది లక్షల ముప్పై మూడు వేల నాలుగు వందల పద్దెనిమిది మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి/ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తి

షెడ్యూల్ - ఎ ఆస్తి - 1 : (శ్రీ బోయిన బాజిరెడ్డి తండ్రి స్వర్గీయ కేశవ రెడ్డి గారికి చెందిన ఆస్తి) ప్రకాశం జిల్లా, చీరాల సబ్ జిల్లా, చీరాల మండలం (ఆర్.వి) ప్రస్తుత దేవాంగపురి (జండ్రపేట) పంచాయితీ, చీరాల గ్రామం, ఎస్.నం.602/2, బ్లాక్ నం.11, ప్లాట్ నం.లు 51, 52 మరియు 53, మొత్తం విస్తీర్ణం : ఎ.2.50 సెంట్ల స్థలంలో విస్తీర్ణం 367.79 చ.గ.లు = 303.95 చ.మీ.ల భూమి యావత్తు. సరిహద్దులు : తూర్పు : రోడ్-67.06 అ.లు, దక్షిణం : బుదారపు వెంకట సుబ్బారాయుడు ప్లాట్ నం.53 భాగం, స్థలం : 48.06 అ.లు, పశ్చిమం : ప్లాట్ నం.లు : 42 భాగం, 41 మరియు 40, స్థలాలు - 69.00 అ.లు. ఉత్తరం : పంచాయితీ రోడ్-48.06 అ.లు.

రిజర్వు ధర: రూ. 11,00,000/-
(రూపాయలు పదకొండు లక్షలు మాత్రమే)

వేలం వివరాలు

టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
31-07-2024	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చీరాల శాఖ, 14-21-85, దర్భవ్ రోడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, చీరాల, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523155. టెలిఫోన్ నం: 08594-238883, సెల్ నం.9397081234

టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
[illegible]
ప్రదేశం : కుంబకోణం, తేది : 18.05.2024 అధీకృత అధికారి
నమోదిత కార్యాలయం:149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

మార్కాపురం మున్సిపాలిటీలో డీజిల్ దొంగలు

మార్కాపురం, జూన్ 28: మార్కాపురం పుర పాలక సంఘంలో ప్రజా ప్రతినిధులు, అధికార గణం చేతివాటం గురించి అందరికీ తెలిసిందే. ఇప్పటి వరకు అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలకు అనుమతులు, కొత్తపన్నులు తక్కువగా వేసేందుకు, పౌర సేవలకు అవినీతి జరిగేది. అయితే ఇటీవల డీజిల్ పేరుతో దోపిడీ చేస్తున్న నయా దందా వెలుగు చూస్తోంది. సాగర్ నీటి సరఫరా కోసం వినియోగించే జనరేటర్ దోపిడీ చేసే వాళ్లకు కల్పతరవుగా మారింది. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతున్నట్లు చూపుతూ, నెలకు రూ.లక్షకు పైగా దోపిడీకి పాల్పడుతున్నారు. దోచుకున్న డీజిల్‌ను నిసిగ్గుగా తమ వాహనాలకు వినియోగిస్తున్నారు.

బహిరంగంగానే కౌన్సిలర్ల చర్చ

మార్కాపురం పట్టణానికి తాగునీరు అందించే ఎస్ఎస్ ట్యాంకు త్రిపురాంతకం మండలం దూపాడు వద్ద ఉంది. అక్కడి నుంచి 28 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ద్వారా తాగునీటిని పట్టణానికి పంపింగ్ చేస్తున్నారు. దూపాడు వద్ద పంప్‌హౌస్‌లో విద్యుత్‌తో పనిచేసే రెండు మోటార్లు ఉన్నాయి. దాదాపు విద్యుత్‌తో పనిచేసే మోటార్ల ద్వారానే పంపింగ్ ప్రక్రియ సాగుతుంది. ఈ పంపింగ్ కోసమే మున్సిపాలిటీ నెలకు రూ.7 లక్షల వరకు విద్యుత్ బిల్లులు చెల్లిస్తోంది. పెద్ద ఎత్తున గాలివానలు, తుపానుల సమయాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినప్పుడు మాత్రమే ఇక్కడ ఏర్పాటు చేసిన 400 కేవీఏ జనరేటర్‌ను వినియోగిస్తారు. దాని ద్వారా మోటార్లకు నీటిని అందించి సరఫరా చేశారు. అయితే డీజిల్‌ను ఎలాగైనా కొట్టేయాలని వ్యూహం పన్నిన ముఖ్య ప్రజాప్రతినిధి, అధికారులు కలిసి విద్యుత్ అంతరాయాన్ని బూచిగా చూపి నెలకు రూ.1.5 లక్షల మేర డీజిల్‌కు ఖర్చు పెడుతున్నట్లు లెక్కల్లో చూపుతున్నారు. అందులో రూ.లక్ష వరకు ప్రజా ప్రతినిధి, అధికారులు చెరిసగం చొప్పున పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. సంవత్సరం క్రితం ఈ వ్యవహారం విషయంలో ముఖ్య ప్రజాప్రతినిధికి, కొందరు కౌన్సిలర్లకు మధ్య అప్పటి స్థానిక ఎమ్మెల్యే వద్దే పంచాయతీ జరిగినట్లు తెలిసింది. కొన్ని విషయాల్లో చూసీచూడనట్లు పోవాలని వారి మధ్య సయోధ్య కుదిర్చినట్లు సమాచారం.


దూపాడు వద్ద ఉన్న జనరేటర్

నీళ్ల కోసం రోడ్డెక్కి మహిళల నిరసన

పెద్దదోర్నాల, జూన్ 28: తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ మహిళలు శుక్రవారం రోడ్డెక్కారు. స్థానిక వీబీఎస్ నగర్‌కు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. మరమ్మతులకు గురైన మోటార్లను బాగు చేయకుండా రోజుల తరబడి జాప్యం చేస్తుండడం, మరోవైపు ట్యాంకర్లతో అరకొరగా సరఫరా చేస్తుండడంతో ఎటూ సరిపోవడం లేదని ఆరోపిస్తున్నారు. బోరుబావుల మోటార్లు బాగు చేయాలని, ట్యాంకర్ల సంఖ్య పెంచాలని కోరారు. దీంతో పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు ఘటనా స్థలానికి చేరుకొన్నారు. మోటార్లు మెకానిక్‌కు ఇచ్చామని వెంటనే ఏర్పాటు చేసి నీటి సమస్య తీరుస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నీటి కొరతపై దృష్టి పెట్టాలి

నీటి కోసం రోజూ ఏదొక కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి ఆందోళన చేపట్టాల్సిన అగత్యం ఏర్పడింది. ఉన్న బోర్లలో జలాలు అడుగంటాయి. దీంతో మోటార్లు తరచూ కాలిపోతున్నాయి. పైగా దోర్నాల మేజరు పంచాయితీ కావడంతో తరచూ నీటి సమస్య ఉత్పన్నం అవుతోంది. దోర్నాల పరిధిలో ఐదు గ్రామాల్లో 60 బోరు బావులుండగా, 13 మోటార్లు మాత్రమే పని చేస్తున్నాయి. ప్రధానంగా దోర్నాలలో 5 మోటార్లు పని చేస్తున్నాయి. అవి కూడా కొద్ది నీరు మాత్రమే వస్తోంది. రోజూ ఏదొక మోటారు మరమ్మతులకు గురవుతూ నీటి ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. ట్యాంకర్లతో ప్రస్తుతం దోర్నాలలో 40 ట్రిప్పులు సరఫరా చేస్తున్నా నీరు సరిపోవడం లేదు. మరో 40 ట్రిప్పులు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. పంచాయతీ సర్పంచి, అధికారులు మాత్రం రెండు రోజులకు ఒక మోటారు కాలిపోతోందని ఎన్నిసార్లు మరమ్మతులు నిర్వహించాలి, డబ్బులు ఎక్కడ నుండి తీసుకురావాలంటూ విసుక్కుంటున్నారు. కొత్త ప్రభుత్వమైన తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


నిరసన తెలుపుతున్న మహిళలు

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

మార్కాపురం రూరల్, జూన్ 28: మండలంలోని రాజుపాలెం గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీని శుక్రవారం తిప్పాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రోహిత్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లవద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమలను నిర్మూలించుకోవడానికి దోమతెరలు వినియోగించాలన్నారు. రాత్రి వేళల్లో వేపాకు పొగతో మలేరియా దోమలను నిర్మూలించవచ్చన్నారు. అలాగే దోమల నిర్మూలనకు మురికినీటి గుంటల్లో కాలువలలో మలేరియా వ్యాధి వ్యాపించే లార్వాల మీద ఎబెట్ ద్రావణం పిచికారి చేయాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రరెడ్డి, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మలేరియా వ్యతిరేక మాసోత్స వం నిర్వహించారు. మలేరియా వ్యాప్తి అరికట్టే విధానం గురించి అధికారులు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల చుట్టూ నీరు నిలబడకుండా చూసుకోవాలని, మస్కిటో నెట్‌లు సిద్ధం చేసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమలు కుట్టకుండా చూసుకోవడం లాంటి విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి సిబ్బంది, వైద్యసిబ్బంది రంగనాయ కులు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పొదిలికి చేరిన పాదయాత్ర

పొదిలి, జూన్ 28 : సనాతన ధర్మం కోసం ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జాతీయ ప్రచారక్ చీఫ్ ఆఫ్ చాంపియన్ శివసేవక్ శివకరణ్ పాదయాత్ర చేపట్టారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు చేస్తున్న పాదయాత్ర నేడు పొదిలికి చేరింది. ఈ సందర్భంగా పొదిలి ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక నిర్మామహేశ్వర దేవాలయంలో ఆయనకు ప్రత్యేక పూజలు చేశారు. సనాతన ధర్మరక్షణ కోసం, అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ శివకరణ్ పాదయాత్ర చేయడం శుభపరిణామమన్నారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ రక్షణలో అమరులైన వీరులగాథలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మార్గనిర్దేశం చేస్తూ సనాతన ధర్మాన్ని రక్షించే లక్ష్యంతో పాదయాత్ర ప్రారంభించామన్నారు. దేశం బాగుండాలని కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదరక్షలు లేకుండా పాదయాత్ర చేయతలపెట్టానన్నారు. శివకరణ్ పాదయాత్ర విజయవంతం కావాలని పట్టణంలోని ఆధ్యాత్మిక వేత్తలు స్వామివారిని ప్రార్థించారు.


శివకరణ్‌కు స్వాగతం పలుకుతున్న నేతలు

కారు ఢీకొని వ్యక్తి మృతి

కంభం, జూన్ 28 : కంభంలో ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతూ ఫ్లై ఓవర్ బ్రిడ్జి అంచులను ఢీకొని అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొన్న వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకొంది. కంభం ఎస్సై పులి రాజేష్ కథనం ప్రకారం.. కంభంలో ఓ ప్రైవేటు ఛానల్ విలేకరిగా పనిచేస్తున్న దూదేకుల ఖాశిం (45) శుక్రవారం రాత్రి ఫ్లైఓవర్ మీదుగా ద్విచక్ర వాహనంపై వెళుతూ అంచులను ఢీకొన్నాడు. దీంతో బండి అదుపు తప్పడంతో విజయవాడ నుంచి అనంతపురం వెళుతున్న బొలెరో వాహనం ఆయన్ను ఢీ కొట్టింది. దీంతో ఖాశీంకు తీవ్రగాయాలయ్యాయి. ఖాశింను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

అటవీ శాఖాధికారులపై దాడి కేసులో నిందితుడికి జైలు

పెద్ద దోర్నాల, జూన్ 28 : అటవీశాఖ అధికారులపై దాడులు చేసిన నేపథ్యంలో దోషి భూమని వెంకటేశం అలియాస్ సుబ్బారెడ్డికి మార్కాపురం అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి నాలుగు సంవత్సరాలు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్సై అంకమరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే 7 నవంబర్ 2017న కొర్రప్రోలులో ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద భూమని వెంకటేశం మద్యంసేవించి విధుల్లో ఉన్న అటవీ శాఖాధికారులు షేక్ ఖాజాముద్దీన్, చక్రాల కోటిలింగం, అమ్మిరెడ్డి రామిరెడ్డిలతో గొడవపడి ఫర్నిచర్, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి గొడ్డలితో దాడులు చేశాడు. ఈ క్రమంలో కోటిలింగం తీవ్రంగా గాయపడ్డాడు. బాధితులు దోర్నాల పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రామకోటయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ నేపథ్యంలో నిందితుడిపై ఆరోపణలు రుజువు కావడంతో న్యాయాధికారి దేవేందర్‌రెడ్డి దోషి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గిద్దలూరు, జూన్ 28 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ షేక్ టపావలి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కురిసిన వర్షంతో కొన్నిచోట్ల అపరిశుభ్రంగా ఉండడంతో దోమల ఉధృతి పెరిగింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించిన మున్సిపల్ సిబ్బంది శుక్రవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. పట్టణంలోని కొప్పువారివీధి, నల్లబండ బజారు, పాములపల్లి రోడ్డు, పలువీధుల్లో రోడ్ల అంచుల్లో వర్షం నీరు నిలబడి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు.

మాంసం దుకాణాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలి

పొదిలి, జూన్ 28 : పట్టణంలోని చికెన్, మటన్ దుకాణాల వద్ద నిర్వహిస్తున్న యజమానులు తగు జాగ్రత్తలతో దుకాణాలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో నిర్వహిస్తున్న చికెన్ దుకాణాలను ఆయన పరిశీలించారు. రానున్నది వర్షాకాలం కనుక సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. మాంసపు నిల్వలపై క్రిములు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిల్వలు చేయడం వలన క్రిములతోపాటు, ఈగలు, దోమలువ్యాప్తి చెందుతాయన్నారు. వాటి వలన మలేరియా, డయేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా దుకాణాల్లో ఎలాంటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పరిసరాలను శుభ్రంగా ఉంచకోవడం వలన వ్యాధులను అరికట్టవచ్చని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తారావాణి అన్నారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చదువుకొనే పాఠశాల, నివసించే గృహాల మధ్య ఎక్కడైనా పరిశుభ్రతను పాటించడం వలన వ్యాధులను అరికట్టవచ్చన్నారు. మురుగునీటి నిల్వల వలన మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం ప్రతిరోజు క్లాసిఫైడ్స్

WANTED
■ మా ప్లే స్కూల్ నందు పనిచేయుటకు స్పోకెన్ ఇంగ్లీషులో అనుభవం కలిగిన లేడీ టీచర్స్ కావలెను. వివరములకు సంప్రదించు సెల్: 7032047909.
AJO-183882

వరుడు కావలెను
■ బలిజ/ రెండో పెళ్లి/38/5'3"/M.Sc/ గవర్నమెంట్ ఎంప్లాయ్ / అందమైన వధువు తగిన వరుడు కావలెను. అన్ని కులాల వారి పెళ్లి సంబంధాల కొరకు సంప్రదించండి. తోట రవి నాయుడు, మధుస్మృతి మ్యారేజెస్, సెల్ : 93921 92193
AJO-183937

BUILDING FOR RENT / SALE
■ ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ ఎదురు, రామ్‌నగర్, 6వ లైను, N.R.K.M లాడ్జి ప్రక్కన, 5అంతస్తుల బిల్డింగ్ (40X80 RCC) కొలతలతో అద్దె / అమ్మకానికి కలదు. సెల్: 9866659049, 7013261494
AJO-190171

PLOT FOR SALE
■ మూరం వెంకారెడ్డి రియల్ ఎస్టేట్స్ ఒంగోలు NH-5 నుండి మంగమూరు రోడ్డు, పవర్ ఆఫీస్ దాటాక తక్షణం ఇల్లు నిర్మించుటకు, ఇన్వెస్ట్‌మెంట్‌కి అనుకూలంగా ఒక గది కేవలం 36 వేలకే ప్లాట్స్ కలవు. సంప్ర॥ 9885184207 స్పాట్ రి॥.
AJG-9462

రియల్ ఎస్టేట్
■ అవకాశం వ్యవసాయ భూమి అమ్మకం :- 4 లక్షలకే 11 సెంట్స్ / 8 లక్షలకే 22 సెంట్స్ / 15 లక్షలకే 44 సెంట్స్ / 30 లక్షలకే 88 సెంట్స్, బంద్రివనం, ముండ్లమూరు, అద్దంకి, సంప్ర॥ 8500031223, స్పాట్ రిజిస్ట్రేషన్.
AJG-191464

FLATS FOR SALE
■ గుంటూరు సిటీ, అమరావతి రోడ్‌కు దగ్గరలో వారాహి ఇన్‌ఫ్రా "నంది హోమ్స్" లో 3X విల్లాస్ మరియు సత్తెనపల్లిలో "షణ్ముఖ రాయల్" గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్‌లో అపార్ట్‌మెంట్స్, విల్లాస్ & డూప్లెక్స్ హౌసెస్ అమ్మకమునకు కలవు. ఫుల్ ఫినిష్డ్, రెడీ టు ఆక్యుపై. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. AP RERA NO. P07150120231. సంప్ర. 97016 89312
AJG-89

ప్లాట్లు కొనబడును
■ నెల్లూరులోని ముత్తుకూరు రోడ్, కనుపర్తి పాడు, బుజబుజనెల్లూరు, వైపాడు రోడ్ ఏరియాలోని ప్లాట్లు కొనబడును. సం.ప్ర. సెల్: 93464 48054, 79812 46665
AJR-193520

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

అవీ.. ఇవీ..

కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాపు సంఘం నాయకులు

బేస్తవారపేట, జూన్ 28 : గతంలో టీడీపీ ప్రభుత్వం కాపులకు ప్రత్యేకించి కాపు కార్పొరేషన్ ద్వారా పేదలకు రాయితీపై రుణాలు అందించే వారని, అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాపు కార్పొరేషన్ ద్వారా ఎటువంటి నిధులు కాపులకు కేటాయించకుండా మోసం చేశారని గిద్దలూరు నియోజకవర్గ కాపు సంఘ నాయకులు శుక్రవారం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి వివరించారు. ముందుగా ఆయన్ను సన్మానించి సమస్యలు వివరించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అందించిన విధంగానే కాపులకు కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు అందించాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. కాపులకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విధంగానే మరోసారి కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డి.బాలిశ్వరయ్య, తుపాకుల వెంకటేశ్వర్లు, లంకానరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 28: సమాజంలోని దివ్యాంగులను ఆదరించాలని డాక్టర్ రాహుల్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో చైల్డ్ రైట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ల్యాంప్ సహకారంతో నివేదిత రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ డైరెక్టర్ కళావతి ఆధ్వర్యంలో దివ్యాంగుల హక్కుల గురించి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ.. దివ్యాంగుల్లోనూ, అపారమైన నైపుణ్యాలు దాగి ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ల్యాంప్ సంస్థ ముద్రించిన ఏపీ బాలల విభిన్న ప్రతిభావంతుల హక్కులు, వారి అవసరాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ల్యాంప్ డైరెక్టర్ సాల్మాన్ పాల్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సుబ్బాయమ్మ, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ల్యాంప్ సిబ్బంది, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ వెంకటరామిరెడ్డి, జిల్లా ఎన్‌జీవో ప్రతినిధులు, ఎన్‌సీసీ విద్యార్థులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

వార్డెన్‌కు ఘన సన్మానం


హాస్టల్ వార్డెన్‌ను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు

తర్లుపాడు, జూన్ 28: తర్లుపాడులోని ఎస్సీ హాస్టల్‌లో పదోతరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడంపై వార్డెన్ కందుల వెంకటరెడ్డిని, సిబ్బంది బి.వెంకటేశ్వర్లను స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. హాస్టల్‌లో ఉన్న 26మంది పరీక్షలు రాయగా 26మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేసిన వెంకటరెడ్డిని పలువురు ఉపాధ్యాయులు సన్మానించారు. రానున్న రోజుల్లో కూడా విద్యాభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని కందుల వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.సుధాకర్, గోను శ్రీనివాసులు, చల్లా నాయుడు, భాస్కర్, ఆనంద్, రామయ్య పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

పొదిలి, జూన్ 28 : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేసిన పల్లా శ్రీనివాసరావును రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గునుపూడి భాస్కర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు, రాష్ట్ర అధ్యక్షులుకు శుభాకాంక్షలు తెలిపారు.


హోంమంత్రిని అభినందిస్తున్న భాస్కర్

వసతిగృహాన్ని సందర్శించిన సంక్షేమ అధికారి

కంభం, జూన్ 28 : కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని బీసీ బాలికల వసతి గృహాన్ని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ జబ్బార్ పరిశీలించారు. కంభం బాలికోన్నత పాఠశాల సమీపంలో అన్ని వసతులు కలిగిన భవనం కోసం పరిశీలించి మార్చేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'వసతిగృహ విద్యార్థుల నరక యాతన' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బీసీ సంక్షేమ అధికారి జబ్బార్ వసతిగృహాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న భవనంలో వసతులు సక్రమంగా ఉన్నాయని, దీంతో ఇక్కడే వసతి గృహం కొనసాగిస్తున్నామన్నారు. పాఠశాలకు దగ్గరగా మరో వసతులున్న భవనం అద్దెకు దొరికితే అక్కడకు మారుస్తామన్నారు. కార్యక్రమంలో వార్డెన్ లలితాభాయ్ పాల్గొన్నారు.

మన్‌కీబాత్‌ను విజయవంతం చేయాలి

గిద్దలూరు, జూన్ 28 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగించే మన్‌కీ బాత్ కార్యక్రమంలో పాల్గొనాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎం.బ్రహ్మేశ్వరప్రసాద్, కోకన్వీనర్ గుమ్మా రాముడు ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30న మన్‌కీ బాత్ కార్యక్రమంలో నరేంద్రమోదీ ప్రత్యక్షంగా ప్రసంగించనున్నారన్నారు. బూత్‌స్థాయి నుంచి మండల స్థాయి వరకు నియోజకవర్గ స్థాయి బీజేపీ, అనుబంధ శ్రేణుల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ఎర్రగొండపాలెంలో 'నేను బడికి పోతా' ర్యాలీ


మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు

ఎర్రగొండపాలెం, జూన్ 28 : విద్యార్థులు చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. ఎర్రగొండపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో కలసి శుక్రవారం 'నేను బడికి పోతా' ర్యాలీ, ప్రధాన కేంద్రంలో మానవహారం నిర్వహించారు. చదువు ప్రాముఖ్యతను గుర్తించి బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని అన్నారు. చదువుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా ఉపాధి పొందవచ్చునని అన్నారు. 6 నుంచి 14 సంవత్సరంలోపు పిల్లలు బడిబయట ఉంటే బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు ఎంఈవో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుకోవడానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, పేద పిల్లలు అందరుబడిలో చేరి చదువుకున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామివార్ల కల్యాణం

పామూరు, జూన్ 28: మండలంలోని కమ్మవారిపాలెంలో గల శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో శ్రీసీతారామస్వామి వార్ల శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా దేవస్థాన ప్రాంగణంలోని రావిచెట్టు, వేప చెట్టు వద్ద పూజలు చేశారు. తదనంతరం దేవస్థానంలో ఉత్సవ విగ్రహాలకు శాంతి పూజలు, కల్యాణాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదానం ఏర్పాటుచేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉత్సవ విగ్రహాలను ఏర్పాటుచేసి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో అడుసుమల్లి నరసింహులు, దుద్దుకురి యోగానంద్, దుద్దుకూరి మల్లికార్జున, వడ్డెంపూడి వెంకటేశ్వర్లు, కమ్మ మాలకొండరాయుడు, దుద్దుకూరి నరసింహారావు, కరణం మాలకొండయ్య దంపతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

పీసీపల్లి, జూన్ 28: యూటీఎఫ్, పీసీపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సభ్యులందరూ కలిసి పాఠశాలలు తిరిగి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో సభ్యత్వాలు నమోదు చేయించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ పరిష్కరించిన ఘనత యూటీఎఫ్‌కే దక్కుతుందన్నారు. జీవో నెం.117ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు యేసుబాబు, రమేష్, గౌస్, కృష్ణప్రసాద్, పోతులూరయ్య శ్రీనివాసులు, రమణయ్య, సత్యం, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బడి వయస్సు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



నాగంబొట్లపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తాళ్లూరు, జూన్ 28: బడికి పోకుండా విద్యకు దూరంగా ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని నాగంబొట్లపాలెం హెచ్‌ఎం అంజలి అన్నారు. మండలంలోని నాగంబొట్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో నేను బడికి పోతా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా అంజలి మాట్లాడుతూ ప్రభుత్వం అనేక రకాలుగా విద్యాభివృద్ధికి ప్రోత్సహిస్తున్నదన్నారు. కొందరు విద్యార్థులు బడి మానుకుని పనులకు వెళ్లటం వల్ల వారి భవిష్యత్తు దెబ్బతింటుందని చెప్పారు. ముందుగా గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

దాతల సహకారంతో విద్యా సామగ్రి పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), జూన్ 28: మండలంలోని ముండ్లపాడు గ్రామంలో దాతలు సమకూర్చిన విద్యా సామగ్రిని మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బోయిళ్ల నారాయణరెడ్డి శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. మంచిగా చదువుకొని గ్రామానికి, పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజాల ఆదిరెడ్డి, పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సమాచార కేంద్రాలుగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న సీడీపీవో సరోజిని

పామూరు, జూన్ 28: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సమాచార కేంద్రాలుగా కార్యకర్తలు తీర్చిదిద్దాలని సీడీపీవో పి.సరోజిని సూచించారు. శుక్రవారం మండలంలోని వగ్గంపల్లి, పామూరులో జరిగిన అంగన్‌వాడీల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు కేంద్రాలను సక్రమంగా నడపాలని సూచించారు. ప్రతినెలా 1 నుంచి 5వ తేదిలోపు పిల్లల బరువును తూచి పౌష్టికస్థాయి గురించి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. పిల్లల మానసిక స్థితినిబట్టి వేర్వేరుగా విభజించి ఆటపాటల ద్వారా విద్యా బోధన చేయాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ జి.పద్మజ, కార్యకర్తలు, హెల్పర్లు, పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపిన టీడీపీ నేతలు

దర్శి, జూన్ 28: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు పదవీ బాధ్యతలు చేపట్టటం ఆనందదాయకమని ఆపార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పేర్కొన్నారు. అమరావతిలో బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాసరావును శుక్రవారం వారు కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాసరావు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంగా తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

సీఎస్‌పురం(పామూరు), జూన్ 28: పాఠశాలల అభివృద్ధికి దాతలు చేస్తున్న సహకారం మరువలేమని హెచ్‌ఎం శివప్రసాదచారి కొనియాడారు. మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయుడు రుసుం ఖాజావలి జ్ఞాపకార్థం కుమారులు , టీడీపీ నాయకులు ఆర్‌కే వలి బ్రదర్స్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్, నోటు పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ డి. తిరుపతయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, జూన్ 28: ముండ్లమూరులో శుక్రవారం షిరిడీ సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు దద్దాల వెంకటరావు, అరుణ దంపతులు, కొణతం శ్రీరాములు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. భక్తుల సాయినామ కీర్తనలతో ఆలయం మారుమోగింది. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు, జూన్ 28: మండలంలోని చిలకలేరు, గుండ్లకమ్మ ప్రాంతాల నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జె.మధుబాబు అన్నారు. శుక్రవారం రెవెన్యూ, ఎస్‌ఈబీ, మైనింగ్ శాఖల అధికారులు సంయుక్తంగా మండలంలోని పోలవరం, మారెళ్ళ సమీపంలోని నదీ పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మధుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో పెద్ద ఎత్తున ఇసుక తరలిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ సీఐ బి.సుందరరామయ్య, వీరేష, జాన్ లిఫి, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

గేదెల అపహరణతో పశుపోషకుల ఆందోళన

ముండ్లమూరు, జూన్ 28: మండలంలోని పసుపుగల్లులో బిజ్జం ఆదినారాయణరెడ్డికి చెందిన రూ 1.50 లక్షలు విలువ చేసే గేదెను గుర్తు తెలియని దుండగులు అపహరించుకొని వెళ్ళినట్టు యజమాని శుక్రవారం ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు గేదె ఇంటి ముందు కట్టి వేసి ఉంది. యజమాని తెల్లవారిన తరువాత లేచి చూడగా గేదె లేక పోవటంతో గ్రామంలోని పలు ప్రాంతాల్లో వెతికినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గత వారం రోజుల క్రితం మారెళ్ళలో కూడా లక్ష రూపాయల విలువ చేసే గేదెను కూడా దొంగలు అపహరించుకొని వెళ్ళి పోయారు. దీంతో పోలీసులు రాత్రి వేళ గస్తీ తిరగాలని స్థానికులు కోరుతున్నారు.

మాలకొండ రోడ్డుకు మోక్షం

- నిర్మాణానికి అనుమతులు
- వైసీపీ ప్రభుత్వంలో పనులు చేపట్టని కాంట్రాక్టర్
- ఎమ్మెల్యే ఉగ్ర చొరవతో ప్రారంభం


ఎక్స్‌కవేటర్‌తో సాగుతున్న రోడ్డు పనులు

పీసీపల్లి, జూన్ 28: మండలంలోని లక్ష్మక్కపల్లి నుండి పుణ్యక్షేత్రమైన మాలకొండ వరకు రోడ్డు నిర్మాణం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరవతో ఎట్టకేలకు శుక్రవారం కార్యరూపం దాల్చింది. లక్ష్మక్కపల్లి బీటి రోడ్డు నుంచి లింగన్నపాలెం మీదుగా మాలకొండ సమీపంలోని కందుకూరు-పామూరు బీటి రోడ్డు వరకు ఐదు కిలోమీటర్లు మట్టిరోడ్డు ఉంది. ఈ రోడ్డులో పెద్ద గోతులు ఏర్పడి అధ్వాన్నంగా ఉంది. పుణ్యక్షేత్రమైన మాలకొండకు వెళ్లాలంటే కనిగిరి, పీసీపల్లి మండలాల నుంచి వెళ్లే భక్తులు ఈ మార్గం గుండానే వెళ్లాలి. అధ్వానంగా ఉన్న ఈరోడ్డులో వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడాల్సివచ్చేది. వర్షాకాలంలో భక్తుల కష్టాలు వర్ణనాతీతం. భక్తులే కాకుండా అడివిలోపల్లి, పెదయిర్లపాడు, లక్ష్మక్కపల్లి, లింగన్నపాలెం, నాయుడిగారిపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనులు, అవసరాల కోసం కందుకూరు, నెల్లూరు, పామూరు తదితర పట్టణాలకు వెళ్లాలన్నా ఈ మార్గం గుండానే వెళ్లాలి. ఈ రోడ్డు పంచాయతీరాజ్ కింద ఉంది. బీటి రోడ్డుగా మార్చాలంటే ఆర్‌అండ్‌బీలోకి మారిస్తేనే తగినంత నిధులు మంజూరవుతాయని ఇంజనీరింగ్ అధికారులు చెప్పడంతో 2014-19 టీడీపీ ప్రభుత్వంలో ఈరోడ్డును పంచాయతీరాజ్ నుంచి ఆర్ అండ్‌బీకి బదలాయించారు. ఆతరువాత ఈ రోడ్డును బీటి రోడ్డుగా మార్చేందుకు రూ.6 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాని విషయం తెలిసిందే. ఈక్రమంలోనే నిధులు మంజూరై పనులు చేసేందుకు అనుమతి ఆర్డర్లు ఇచ్చినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఈక్రమంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. కనిగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఉగ్ర నరసింహారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రణాళికను తయారుచేసే క్రమంలో నిధులు మంజూరై పనులు చేసేందుకు అనుమతులు వచ్చినా మాలకొండ రోడ్డు నిర్మాణ పనులు కాంట్రాక్టర్ చేపట్టకుండా ఉన్న విషయాన్ని గుర్తించారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి రోడ్డు పనులు ఎందుకు చేపట్టలేదో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్ ఆలస్యం చేస్తున్నాడనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఉగ్ర త్వరితగతిన రోడ్డు పనులు పూర్తిచేస్తే సకాలంలో బిల్లులు వచ్చేలా చూస్తానని కాంట్రాక్టర్‌కు భరోసా కల్పించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తిచేయించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కూడా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశించారు. ఎమ్మెల్యే ఉగ్ర ఇచ్చిన భరోసాతో కాంట్రాక్టర్ శుక్రవారం రోడ్డు పనులు ప్రారంభించారు.

పునాదుల్లోనే కోల్డ్ స్టోరేజీ

- వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణం
- కూటమి ప్రభుత్వం రాకతో రైతుల్లో ఆశలు


పునాదుల్లో నిలిచిపోయిన కోల్డ్ స్టోరేజీ

దర్శి, జూన్ 28: రైతుల ప్రయోజనం కోసం నిర్మించతలపెట్టిన కోల్డ్ స్టోరేజీ నిర్మాణం గత ఐదేళ్లుగా పునాదుల్లోనే నిలచిపోయింది. వైసీపీ పాలకుల అసమర్థత, నిర్లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పథకాలు అలాగే నిలచిపోయాయి. ఎంతో ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం కూడా వైసీపీ పాలనలో నిలచిపోయింది. అయితే, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 18.51 కోట్లు విడుదల చేస్తూ రవాణాశాఖ మంత్రి తొలిసంతకం చేశారు. వాస్తవంగా గత టీడీపీ హయాంలో డ్రైవింగ్ శిక్షణ కేంద్రం, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం ప్రారంభించారు. రెండు పథకాల నిర్మాణం మొదలుపెట్టగానే 2019లో ఎన్నికలు రావటంతో పనులు నిలిచిపోయాయి. ఆతర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుల నిర్మాణం గురించి పట్టించుకోలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కృషితో ప్రభుత్వం డ్రైవింగ్ శిక్షణకేంద్రానికి నిధుల విడుదల చేసింది. కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి కూడా టీడీపీ కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు చేపడుతుందని రైతులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

దర్శి నియోజకవర్గంలో మిర్చి, టమోటా, ఇతర కూరగాయలు అధికంగా పండిస్తారు. మిర్చి రైతులు ఇక్కడ నిల్వ చేసుకునే అవకాశం లేక గుంటూరు తీసుకెళ్లి అక్కడ స్టోరేజీల్లో నిల్వ ఉంచుతుంటారు. మార్కెట్‌లో ధరలు వచ్చినప్పుడు విక్రయించుకుంటున్నారు. ఇక్కడనుంచి సరుకు తరలించేందుకు రైతులు అధిక ఖర్చులు భరించటంతో పాటు ఎంతో శ్రమించాల్సి వస్తుంది. రైతుల అవసరాలను గుర్తించి 2018లో టీడీపీ ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేపట్టింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో నిలిచిపోయిన కోల్డ్ స్టోరేజీ నిర్మాణం పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.


మెగా మెడికల్ క్యాంపు నిర్వాహణకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డాక్టర్ లలిత్‌సాగర్, నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు

దర్శిలో రేపు మెగా మెడికల్ క్యాంపు

- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహణ

దర్శి జూన్ 28: టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో ఈనెల 30న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా కళాశాలలో ఏర్పాట్లను టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తదితరులు పరిశీలించారు. వైద్యులు పరీక్షలు చేసేందుకు తరగతి గదులను ఏర్పాటుచేశారు. ఆరుబయట రోగులకు భోజనం, మంచినీటి వసతుల ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఈ క్యాంపులో గుంటూరు, నర్సరావుపేటకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు రోగులకు వైద్య సేవలు అందిస్తారు. డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మితో పాటు 20 మంది ప్రముఖ వైద్యులు రోగులకు పరీక్షలు చేసి అవసరమైన మందులు సరఫరా చేస్తారు. దర్శిలో ప్రప్రథమంగా రోగులకు క్యాన్సర్ స్కానింగ్, న్యూరో పరీక్షలు కూడా నిర్వహిస్తారు. దర్శి నియోజకవర్గ ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లలిత్‌సాగర్ కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడియాల శివ, దర్శి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, దారం సుబ్బారావు, గుర్రం బాలకృష్ణ, మౌలాలి, నారాయణ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లు పంపిణీ అభినందనీయం

దర్శి జూన్ 28: వృద్ధులు, వితంతువులకు పింఛన్లు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయటం టీడీపీ ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయమని ఆపార్టీ దర్శి నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు అనేకమంది ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. వైసీపీ కార్యకర్తలుగా వ్యవహరించి అర్హులైన అనేకమందిని ఇబ్బంది పెట్టారన్నారు. అక్రమాలను అరికట్టేందుకు సీఎం చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులైన సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలనే నిర్ణయం తీసుకోవటం ఆనందదాయకమన్నారు. దర్శి నియోజకవర్గంలో 30,676 మంది పింఛన్‌దారులకు రూ.20 కోట్లకు పైగా పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. జూలై 1వ తేదిన మొత్తం పింఛన్లు పంపిణీ జరిగేలా నియోజకవర్గంలో అధికారులు కృషి చేయాలని కోరారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూన్ 27: రైతాంగం అభివృద్ధి కోసం అధికారులు మరింత చొరవ చూపాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో రైతులు ఆర్థికంగా చితికిపోయారన్నారు. కేవలం కాగితాల్లో రైతులకు మేలు చేసినట్లు కాదని, ప్రత్యక్షంగా రైతులకు మేలు చేకూరినప్పుడే తిరిగి పంటలు వేసేందుకు ముందుకు వస్తారన్నారు. రైతులకు సరైన సేవలు అందించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవటంలో ఏమాత్రం వెనుకాడేదిలేదన్నారు. రైతులు కూడా వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలు వేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ శ్రీరాంమూర్తి, ఏడీఏ ఈవీ రమణ, ఏవో జ్యోష్నాదేవి, కృష్ణ, ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, ఎంపీపీ ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ గఫార్, నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్), నంబులు వెంకటేశ్వర్లు యాదవ్, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, పెన్నా చిననాగయ్య యాదవ్, మూలె బ్రహ్మారెడ్డి, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.


వాగు పోరంబోకు భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

వాగును ఆక్రమించి నిర్మాణాలు

కనిగిరి, జూన్ 28: పట్టణంలో వాగు ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకుంటున్నామని చెప్పే మాటలు ఆచరణలో కనిపించటం లేదు. పట్టణ సమీపంలో పొదిలి రోడ్డులోని లారీ స్టాండ్ సమీపంలో గత ప్రభుత్వంలో వైసీపీ నాయకుల అండతో అరు ఎకరాల వాగు విస్తీర్ణాన్ని ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. పొదిలి రోడ్డులోని సర్వే నెంబరు 845లో 6.6 ఎకరాల ప్రభుత్వ వాగు పోరంబోకు భూమి ఉంది. దీనిపైన కన్నేసిన ఆక్రమణదారుడు తన సోదరుడిని అడ్డంగా పెట్టి భూమి పక్కన ఉన్న అసైన్డ్ భూమిని అనుకుని ఉన్న వాగు భూమిని ఆక్రమించారు. ఆక్రమించిన భూమిలో నిర్మాణాలు కూడా చేపట్టారు. అప్పట్లో సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకుండా ఆక్రమణదారులకు మద్దతుగా నిలిచారు. దీ వెనుక వైసీపీ ముఖ్యనేత అండ ఉండటంతో అధికారులు ప్రేక్షకపాత్ర వహించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ వాగు భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

లైసెన్స్ లేని ఆటోలు సీజ్

పామూరు, జూన్ 28: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆటో పత్రాలు కలిగి ఉండాలని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎంవీఐ కె.జయప్రకాష్ సూచించారు. శుక్రవారం పామూరు పట్టణంలో ఆటో డ్రైవర్‌ల లైసెన్సులను పరిశీలించారు. సరైన పత్రాలు, డ్రైవర్ లైసెన్స్‌లేని ఏడు ఆటోలను సీజ్‌చేసి స్థానిక పోలీస్‌స్టేషన్ తరలించినట్లు జయప్రకాష్ తెలిపారు.

పాక్షికంగా ట్రావెల్ బస్సు దగ్ధం

- ప్రయాణికులు సురక్షితం
- వేరే వాహనాలు మాట్లాడుకుని గమ్యస్థానాలకు వెళ్లిన వైనం


మంటలకు పగిలిన బస్సు టైరు


డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న ప్రయాణికులు

కురిచేడు, జూన్ 28: హైదరాబాద్ నుంచి పామూరు వెళుతున్న ట్రావెల్ బస్సు శుక్రవారం ఉదయం కురిచేడు వద్ద ప్రమాద వశాత్తు పాక్షికంగా దగ్ధమైంది. ప్రయాణికులు మంటలు గమనించి వెంటనే బస్సులో నుంచి దిగడంతో సురక్షితంగా బయటపడ్డారు. అయితే, ప్రయాణికులను అక్కడే వదిలేసి డ్రైవర్ బస్సును తీసుకెళ్లాడు. దీంతో ఎవరికివారు ప్రైవేటు వాహనాలు మాట్లాడుకుని గమ్యస్థానాలకు వెళ్లారు.


రోడ్డుపై వేచిఉన్న ప్రయాణికులు

హైదరాబాద్ నుంచి పామూరుకు శ్రీలక్ష్మీ ప్రవంతి శివ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సుకు ప్రయాణికులు టిక్కెట్లు బుక్ చేశారు. ఆ బస్సు మరమ్మతులకు గురికావడంతో గంట ఆలస్యంగా హైదరాబాద్‌లో మరో బస్సును ఏర్పాటుచేశారు. అదికూడా దారిపొడవునా ఆగుతూ ఆగుతూ వచ్చింది. ఈక్రమంలో శుక్రవారం ఉదయం 6 గంటల సమయానికి కురిచేడు వద్దకు వచ్చేసరికి బస్సు వెనుకవైపు టైర్ల నుంచి పొగలు రావడాన్ని ప్రయాణికులు గమనించి డ్రైవర్‌కు తెలపడంతో నిలిపివేశాడు. ప్రయాణికులంతా బస్సు నుంచి సామాన్లుతో బయటకు దిగారు.

బస్సును రిపేరు చేయిస్తానన్న డ్రైవరు తమ ఓనరుకు సమాచారం ఇచ్చి అక్కడ నుంచి తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. తమను మరో బస్సులో ఎక్కించాలని డ్రైవర్‌తో ప్రయాణికులు వాగ్వాదం చేశారు. అయితే, డ్రైవర్ వారిని పట్టించుకోకుండా బస్సును తీసుకెళ్లాడు. తప్పనిసరి పరిస్థితులలో ప్రయాణికులు స్వంతగా వాహనాలు మాట్లాడుకుని గమ్యస్థానాలకు వెళ్లారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- పట్టించుకోని పాలకులు
- ప్రజలకు తప్పని పాట్లు


గుంతలమయమైన రోడ్డు

పామూరు, జూన్ 28: పామూరు మండలంలోని పలు గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహనదారు లు అవస్థలు పడుతున్నారు. రోడ్ల అభివృద్ధి గురించి వైసీపీ పాలకులు పూర్తిగా విస్మరించి వారికి అనుకూలమైన గ్రామాల్లోనే రోడ్లు నిర్మించారని ఆరోపణలు ఉన్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన గ్రామీణ రోడ్లు ఆనవాళ్లు కోల్పోయి ఉన్నాయి. గత టీడీపీ హయాంలో మండలంలో 16 గ్రామీణ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. అయితే, ఎన్నికలు జరిగి వైసీపీ ప్రభుత్వం ఏర్పడటంతో ఆ పార్టీ నాయకులకు అనుకూలమైన ప్రాంతా ల్లో రోడ్లు వేశారు. టీడీపీ సానుభూతిపరుల గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టలేదు. దీనికితోడు పాత రోడ్లను నిర్మాణం పేరుతో గోతులు తీసి అర్ధంతరంగా వదిలేశారు. ఈక్రమంలో రోడ్లపై గోతులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.


మరమ్మతులకు నోచుకోని రోడ్డు

ఇటీవల రజాసాహెబ్‌పేటకు ఫెన్సింగ్ రాళ్లతో వస్తున్న ట్రాక్టర్ గోతుల కారణంగా ఒక వైపునకు ఒరిగిపోవడంతో ఇద్దరు కూలీలు కిందపడ్డారు. వారిపై ఫెన్సింగ్ రాళ్లు పడటంతో మృతిచెందారు. కాటంవారిపల్లి, తూర్పు కోడిగుడ్లపాడు, నర్రమారెళ్ల, తూర్పు కట్టకిందపల్లి గ్రామాల్లో 15 సంవత్సరాల క్రితం గ్రామ సడక్‌యోజన కింద రోడ్లు నిర్మించారు. అతర్వాత మరమ్మతులు చేయకపోవడంతో గుంతలమయంగా మారి ఛిద్రమయ్యాయి.

గత పాలకులు గ్రామీణప్రాంత రోడ్ల అభివృద్ధి గురించి విస్మరించారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతరోడ్లు అభివృద్ధికి నోచుకుంటాయని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY


బాపట్ల జిల్లా వార్తలు

5

శనివారం 29 జూన్ 2024



ఇంటి వద్దకే.. రూ.7000



- జూలై 1న రూ.7 వేల పింఛన్
- ఏప్రిల్, మే, జూన్ నెలలకు కలిపి మొత్తంగా అందజేత
- తొలి రోజే అందించాలన్న లక్ష్యంతో కదులుతున్న ప్రభుత్వ యంత్రాంగం
- ఇంటికే వెళ్లి పింఛన్లు అందించేందుకు అధికారుల ఏర్పాట్లు
- సచివాలయ సిబ్బందితోపాటు, ప్రభుత్వ ఉద్యోగులకూ బాధ్యత
- మూడు జిల్లాల్లో 7.73 లక్షల మందికి రూ.541.43 కోట్ల లబ్ధి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అన్నమాట ప్రకారం పింఛను మొత్తాన్ని రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచడమే కాకుండా ఆ మొత్తాన్ని ఏప్రిల్ నెల నుంచి లెక్కగట్టి మొత్తం రూ.7 వేలు అవ్వాతాతలు, ఒంటరి, వితంతు మహిళలు, ఇతర వర్గాల వారికి ఇవ్వనున్నారు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రూ.3 వేల పింఛను తీసుకున్నవారికి కూడా ఆ మూడు నెలలకు అదనంగా రావాల్సిన రూ.3 వేలు కూడా కలిపి మొత్తం ఏడు వేల రూపాయలు లబ్ధిదారులకు అందించనున్నారు.


గుంటూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తాజా గణాంకాల ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని 7లక్షల 73వేల 482 మంది పింఛనుదారులకు పెరిగిన పింఛన్లతో లబ్ధి చేకూరనుంది. గుంటూరు జిల్లాలో 2,59,315 మంది, పల్నాడు జిల్లాలో 2,80,568 మంది, బాపట్ల జిల్లాలో 2,33,599 మంది పింఛనుదారులు వున్నారు. వీరందరికీ పెంచిన పింఛన్లు జూలై ఒకటో తేదీన చేతికి అందనున్నాయి. అందుకోసం ఇప్పటికే బడ్జెట్ కేటాయింపులు జరిగిపోయాయి. జిల్లాలోని లబ్ధిదారుల కోసం రూ.541.43 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. జూలై ఒకటో తేదీనాటికే లబ్ధిదారులు అందరికీ పింఛన్లు పంపిణీ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోంది. అందుకోసం ఏర్పాట్లు కూడా జరిగిపోయాయి. జిల్లాలోని సచివాలయ సిబ్బంది 13వేల మంది తోపాటు, ఇతర శాఖలకు సంబంధించిన ఉద్యోగులను కూడా పింఛన్ల పంపిణీ కోసం నియమించారు.

20 రెట్లు పెంచిన చంద్రబాబు

2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అయిన వెంటనే రూ.200గా వున్న పింఛనును ఒక్కసారిగా ఐదు రెట్లు పెంచి రూ.1000 చేశారు. ఆ తరువాత మరో మూడేళ్లకు ఆ వెయ్యిని రెట్టింపు చేసి రూ.2 వేలు పింఛను ఇచ్చారు. కాగా 2019 ఎన్నికల సందర్భంగా తాను పింఛను రూ.3 వేలు చేస్తానని హామీ ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ తాను అధికారం చేపట్టిన వెంటనే మాట తప్పారు. నాలుక మడతేసి తాను దశలవారీగా పెంచుతానని అవ్వాతా తలను వంచించారు. ఏడాదిన్నరకు ఒకసారి రూ.250 చొప్పున పెంచి వారిని వంచించారు. సరిగ్గా ఎన్నికల కు మూడు నెలల ముందు రూ.3 వేలు ఇచ్చి హామీని నిలబెట్టుకున్నట్లు మాజీ ముఖ్యమంత్రి జగన్, వైసీపీ నేతలు ప్రచారం చేసుకున్నారు. ఐతే పింఛనుదారులెవరూ వారి మాటలు నమ్మలేదు. అయితే ప్రస్తుతం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఒక్కసారిగా రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచారు. మొత్తంగా 200గా వున్న పింఛనును పదేళ్లలో 20 రెట్లు పెంచి ఇస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కింది.

11 కేటగిరీల వారికి 7 వేల పింఛను

మొత్తం 11 కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు రూ.7వేలు పింఛను ఇవ్వనున్నారు. వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, హెచ్ఐవీ బాధితులు, ట్రాన్స్‌జెండర్లు, డప్పు కళాకారులు, ఇతర కళాకారుల కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు ఈనెల రూ.7 వేల పింఛను అందుతుంది. మరుసటి నెల నుంచి రూ.4వేలు చొప్పున పింఛను అందనుంది. దివ్యాంగులు, కుష్టుబాధితులకు ఇక నుంచి రూ.6 వేలు, సాధారణ డయాలసిస్, కిడ్నీ, గుండె, లివర్ మార్పిడి బాధితులకు రూ.10వేలు చొప్పున, పూర్తి వైకల్యం, పక్షవాత బాధితులు, మంచంపట్టినవారికి రూ.15వేలు చొప్పున జూలై నెల నుంచి పింఛను అందించనున్నారు.



- వారి స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిల నియామకం
- చైర్మన్ కార్యాలయాల సీజ్.. మార్కెటింగ్ శాఖ స్వాధీనం
- జేసీ/మార్కెటింగ్ జేడీలకు బాధ్యతలు అప్పగించే అవకాశం

మొండికేస్తున్నారని వేటు

ఏఎంసీల చైర్మన్లను తొలగిస్తూ ఆదేశాలు

గుంటూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి టీడీపీ నేతృత్వ పరిపాలన వచ్చింది. అయినప్పటికీ నైతికంగా నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయకుండా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని కొందరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు మొండికేస్తున్నారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన మార్కెటింగ్ శాఖ ఆయా చైర్మన్లను తొలగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వారి కార్యాలయాలను సీజ్ చేయాల్సిందిగా ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, తాడికొండ ఏఎంసీ చైర్మన్ పూర్ణచంద్రరావు, మాచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి(పెద్దబ్బాయి), చిలకలూరిపేట ఏఎంసీ చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి తమ పదవులను కోల్పోయారు. వారి స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించే అధికారాన్ని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు కల్పించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో సంబంధిత మార్కెటింగ్ సెక్రెటరీలు చైర్మన్ల కార్యాలయాలను సీజ్ చేసి వారి ఆధీనంలోకి తీసుకున్నారు.

పదవీ కాలం ఉందని మొండి..

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వ్యవసాయ మార్కెట్ కమిటీలకు తన పార్టీకి చెందిన నాయకులకే నామినేటెడ్ పదవులను ఇస్తుంది. చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులను నామినేట్ చేస్తుంది. వీరంతా సంబంధిత ఎమ్మెల్యేల సిఫార్సులతో పదవులు పొందుతుంటారు. ఎన్నికల్లో ఒకవేళ గత ప్రభుత్వం ఓటమి పాలైతే నైతికంగా మార్కెట్ కమిటీల చైర్మన్లు, సభ్యులు కూడా వెనువెంటనే వైదొలుగుతుంటారు. అయితే ఈ దఫా అందుకు విరుద్ధమైన పరిస్థితులు కొన్ని మార్కెట్ కమిటీల్లో తలెత్తాయి. వైసీపీ ప్రభుత్వంలో నామినేట్ అయిన చైర్మన్లు తమకు ఇంకా పదవీకాలం ఉందంటూ కొంతమంది మొండికేశారు. వారికి ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయాన్ని సెక్రెటరీలు తెలియజేసినా రాజీనామా పత్రాల సమర్పించేందుకు ససేమిరా అన్నారు. కొంత సమయం ఇచ్చి వేచి చూసిన ప్రభుత్వం శుక్రవారం తొలగింపు ఉత్తర్వులు జారీ చేసింది. తాడికొండ ఏఎంసీ చైర్మన్ పదవీకాలం జూలై 11 వరకు ఉన్నది. ఎన్నికలకు ముందు ఆయన టీడీపీలోకి మారడంతో తాను వైదొలిగేది లేదని చెప్పి కొనసాగుతున్నారు. గుంటూరు ఏఎంసీ చైర్మన్ పదవీ కాలం జూలై 18తో ముగుస్తుంది. చిలకలూరిపేట ఏఎంసీ చైర్మన్ పదవీకాలం 2025 మార్చి 13, మాచర్ల ఏఎంసీ చైర్మన్ పదవి జూలై 2తో ముగుస్తాయి. వీరందరిని మార్కెటింగ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరి తొలగించారు. గతంలో చిన్న మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్ జేడీ, సెలెక్షన్ గ్రేడ్ ఉంటే జేసీలకు పర్సన్ ఇన్‌చార్జ్ బాధ్యతలు కేటాయించేవారు.

- ప్రహసనంగా అసైన్డ్ భూముల చట్ట సవరణ
- పేదలకు ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా
- కొత్త ప్రభుత్వం అసైన్డ్ దోపిడీపై దృష్టి పెట్టేనా...?
- సమగ్ర విచారణ కోసం డిమాండ్



సూర్యలంక సముద్రతీరంలో అసైన్డ్ భూముల్లో రిసార్టులు

అసైన్డ్.. మాయాజాలం

- ఐదేళ్లలో వేల ఎకరాలను చెరబట్టిన వైసీపీ నేతలు

బాపట్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు గూడు కోసం, సాగుకోసం ప్రభుత్వ భూములను అసైన్డ్ చేసి అప్పగించడం అనేది ఏళ్ల తరబడి వస్తూ ఉంది. కానీ ఈ ఐదేళ్లలో వైసీపీ నేతల కన్ను పేదలకు అసైన్డ్ చేసిన ప్రభుత్వ భూములపై పడింది. బాపట్ల, చీరాల పరిసర ప్రాంతాలలో వేల ఎకరాల అసైన్డ్ భూమితో పాటు ప్రభుత్వ భూమి అదే స్థాయిలో ఉండడంతో వైసీపీ నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వాటిలో చాలా వరకు కైంకర్యం చేసేశారు. నేతలతో పాటు వారి అనుచరులు ఇష్టారాజ్యంగా ఆ భూములను నయానో భయానో తమ పరం చేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన అసైన్డ్ భూముల చట్ట సవరణ సదరు పార్టీ నేతల కోసమే అన్నట్లుగా తయారైందే తప్ప నిరుపేదలకు దక్కిన ప్రయోజనం గుండుసున్నా. అసైన్డ్ భూముల విషయంలో దోపిడీ పర్వాన్ని రక్తి కట్టించడానికి బాపట్లలో అనేక విన్యాసాలను వైసీపీ చేసింది. వైసీపీ నేతల అసైన్డ్ భూముల మాయాజాలనికి ఉన్నతాధికారుల సహకారం కూడా తోడవడంతో వారి పని మరింత తేలికయింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ ఐదేళ్లలో జరిగిన అసైన్డ్ భూబాగోతాలపై సమగ్ర విచారణ జరిపితే ఎన్నో పెద్దతలకాయల దోపిడీ వెలుగులోకి వస్తుందని, అదే సమయంలో ప్రభుత్వానికి పెద్దఎత్తున ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటయ్యే అవకాశం ఉందని జిల్లా ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలకు రాష్ట్రమంత్రి వర్గంలో చోటు కూడా దక్కడంతో వైసీపీ పాలనలో జరిగిన భూ దోపిడీపై వారు దృష్టి పెట్టాలని కోరుతున్నారు. సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్ అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

అసైన్డ్ భూములను కొనడమే నేరమైతే...

బాపట్లలో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తిగా అసైన్డ్ భూముల్లోనే జరుగుతోంది. ఆ భూములన్నీ అసైన్డ్ అని ప్రభుత్వ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. కానీ మెడికల్ కళాశాల నిర్మాణం కోసం బాపట్లకు చెందిన ఓ దాత విరాళంగా భూమి ఇచ్చారని, ఏకంగా అతనికి సీఎం చేత సన్మానం గతంలో వైసీపీ నేతలు చేయించారు. ఈ నిర్ణయం బాపట్ల ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఉన్నప్పుడు జరిగింది. అప్పుడు ఉన్న అధికారులు అసైన్డ్ నిబంధనలు తోసిరాజని మరీ వైసీపీ నేతల సేవలో తరించడం వల్లే ఇలా జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మెడికల్ కళాశాలకు వితరణగా కొంత అసైన్డ్ భూమి ఇవ్వడం వెనక వైసీపీ నేతల రియల్ ప్రయోజనాలు దాగి ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపితే మరిన్ని నిజాలు బట్టబయలయ్యే అవకాశం ఉందని బాపట్ల ప్రజానీకం అంటోంది.

చట్ట సవరణ వైసీపీ నేతలకే వరం

వైసీపీ ప్రభుత్వం ఏడాదిన్నరక్రితం తెచ్చిన అసైన్డ్ భూముల చట్ట సవరణ వైసీపీ నేతలకే వరంగా మారింది తప్పితే పేదలకు ఆ చట్టం వల్ల ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. జిల్లాలో దాదాపు 43,000 ఎకరాల ప్రభుత్వ భూమిని నిరుపేదలకు అసైన్డ్ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వం తెచ్చిన అసైన్డ్ చట్ట సవరణ ద్వారా నిర్దిష్ట కాలపరిమితి నిబంధనలను అనుసరించి దాదాపు 25,000 ఎకరాలపై పేదలకు విక్రయ హక్కులు సక్రమించి ఉండాల్సింది. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందాన జిల్లాలో చట్ట సవరణ ఫలాలు కేవలం 2,750 ఎకరాలకే పరిమితమయ్యాయి. ఇది కూడా వైసీపీ నేతలు క్రమబద్ధీకరణ చేయించుకున్నవే తప్పితే పేదలకు జరిగిన మేలు ఏం లేదనే విమర్శలు అప్పట్లోనే వినిపించాయి.

రీసర్వేలో వెలుగు చూసినా అదే నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో భాగంగా వందిళ్లపల్లి పరిసరాల్లో దాదాపు 450 ఎకరాలు అసైన్డ్ భూమి పరాధీనమైనట్లు గుర్తించారు. ఇవన్నీ కూడా గతంలో పేదలకిచ్చిన భూములే కాగా వీటిని నిన్నమొన్నటి వరకు వైసీపీలో ఉండి ఇటీవలే పార్టీమారిన ఓ కీలక నేత కబంధహస్తాల్లోనే ఈ భూములన్నీ ఉన్నట్లు తెలుస్తోంది. వీటికి సంబంధించి అప్పటి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు నోటీసులు కూడా జారీ చేశారు. కానీ ఇంతవరకు పురోగతి లేదు. బాపట్ల సమీపంలో ఏకంగా ప్రభుత్వ ఉద్యోగులంతా కలిసి అసైన్డ్ భూములను కొనుగోలు చేసి వాటిలో నిర్మాణాలు చేపట్టడం నిబంధనల ఉల్లంఘనలకు పరాకాష్ట. పైగా డబ్బులు ఇచ్చి కొనుక్కుంటే తప్పేమిటనే ఎదురుదాడిని చేయడం గమనార్హం. అసైన్డ్ నిబంధనలకు కంచెలాగా వ్యవహరించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులే ఆ నిబంధనలకు తూట్లు పొడవడం, వారికి రక్షణగా వైసీపీ నేతలు వ్యవహరించడం, ఉన్నతాధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం ఇదీ అసైన్డ్ భూములపై ఐదేళ్ల పాలించిన వైసీపీకి ఉన్న శ్రద్ధకి నిదర్శనం.

సముద్రతీర ప్రాంతమే అడ్డాగా...

సూర్యలంకతో పాటు చీరాల సమీపంలో అసైన్డ్ భూముల్లో రిసార్టులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఇవన్నీ కూడా వైసీపీ చోటామోటా నేతల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. అప్పటికే అక్కడ నివాసం ఉంటున్న పేదలను అధికారం అండతో ఖాళీ చేయించి పెద్దఎత్తున రిసార్టుల వ్యాపారానికి తెరలేపారు. మరికొన్ని భూములు అయితే రికార్డుల్లోనే ప్రభుత్వానికి చెందినవిగా చూపెడుతుంటే ఎంచక్కా అక్కడ వ్యాపారాలు చేస్తూ ఐదేళ్లలో కోట్లు దండుకున్నారు. సూర్యలంక సముద్రతీర ప్రాంతం మొత్తాన్ని వైసీపీ ద్వితీయశ్రేణి నేతాగణం తమ కబంధ హస్తాల్లో ఉంచుకుని, నిబంధనలకు పాతరేస్తూ ఇష్టారాజ్యంగా అసైన్డ్ భూములను చెరబట్టారు.



నామినేటెడ్.. ఆశలు

- వైసీపీ ప్రభుత్వంలో ఉన్నవారందరూ రాజీనామాలు
- కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలపై కసరత్తు

బాపట్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే నామినేటెడ్ పదవుల్లో ఉన్న వైసీపీ ద్వితీయ శ్రేణి నేతాగణమంతా రాజీనామా బాట పట్టారు. ప్రస్తుతం వీటి భర్తీ మీద కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆయా కార్పొరేషన్లకు నిధులు సమకూర్చి, వాటిని బలోపేతం చేసే విధంగా కసరత్తు మొదలుపెట్టింది. నామినేటెడ్ పదవుల విషయంలో పార్టీలో ఆది నుంచి జెండా మోసిన వారికే న్యాయం జరుగుతుందనే సంకేతాలను ఇటీవల సీఎం చంద్రబాబు పంపడంతో జిల్లాకు చెందిన నేతలు వాటిపై ఆశలు పెట్టుకున్నారు. మార్కెట్ కమిటీలు చైర్మన్లు మొదలుకుని సహకార సంఘాలలో ఉన్న త్రీమెన్ కమిటీ సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లలో సభ్యులుగా ఉన్నవారు, మత్స్య శాఖ డైరెక్టర్‌తో పాటు దాదాపుగా అందరూ రాజీనామాలు చేశారు. ఎన్నికలకు ఏడాదికి ముందు హడావిడిగా వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బావుడా) చైర్మన్ పోస్టుపై సైతం పలువురు కూటమి నేతలు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో మొత్తం 8 మార్కెట్ కమిటీలు ఉండగా ఆరింటికి చైర్మన్లు ఉన్నారు. వీరిలో ఒకరి పదవీకాలం రెండు నెలల ముందే ముగిసిపోవడంతో ఖాళీగానే ఉంది. మిగిలిన 5 చోట్ల ఇప్పటికే చైర్మన్లు రాజీనామాలు సమర్పించారు. పీఏసీఎస్‌లలో ఉన్న త్రి సభ్య కమిటీలను ఇప్పటికే రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇక జిల్లా వ్యాప్తంగా బీసీ కార్పొరేషన్‌తో పాటు మత్స్యశాఖ లాంటి కార్పొరేషన్లలోని సభ్యులుగా తప్పుకున్నారు. దీంతో ఆయా పదవులు కూటమి పార్టీ నేతలను వరించనున్నాయి. జిల్లాలో ఖాళీ అయిన నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో నేతలు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఇటీవల వ్యవసాయ శాఖతో జరిపిన సమీక్షలో పాల్గొన్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ త్వరలోనే బాపట్ల మార్కెట్ యార్డు కమిటీకి చైర్మన్‌ను నియమిస్తామనే సంకేతాలు ఇచ్చారు. మిగిలిన చోట్ల ఖాళీ అయిన కమిటీ చైర్మన్‌లతో పాటు కార్పొరేషన్ డైరెక్టర్ల పదవుల విషయంపై మంతనాలు జరుపుతున్నారు. ఈ పదవుల పంపకానికి సంబంధించి జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ నిర్ణయం కూడా కీలకం కానుంది.

క్షేత్రస్థాయిలో కష్టించిన వారికే..

ఆయారం గయారాంలకు కాకుండా పార్టీ కష్టకాలంలో జెండా మోసిన వారికే గుర్తింపు ఇచ్చే విధంగా అన్ని కోణాలలో వివరాలు తెప్పించుకుని కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా ఆశావహుల జాబితా ఇప్పటికే నేతల దగ్గరకు చేరింది. రెండుమూడు దశలలో కసరత్తు అనంతరం నామినేటెడ్ పదవుల కేటాయింపుపై ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పైగా వైసీపీ ఐదేళ్ల పాలనలో పదవుల కోసమే అన్నట్లుగా నామినేటెడ్ పోస్టులను సృష్టించి వాటికి ఓ దశ, దిశ లేకుండా చేశారన్న అపప్రథను మూటగట్టుకుంది. కునారిల్లిపోయిన కార్పొరేషన్లకు జవసత్వాలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పరిమితంగానే నామినేటెడ్ ప్రాతిపదికన భర్తీ చేసినప్పటికీ వాటికి కల్పించే నిధులు, అధికారాల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి న్యాయం చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది.

పర్సన్ ఇన్‌చార్జిల నియామకం..

నామినేటెడ్ పదవుల విషయంలో అడుగులు ఆచితూచి వేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. దానిలో భాగంగానే పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికి జిల్లా సహకార అధికారి పంపిన ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలిచ్చింది. వైసీపీ నియమించిన త్రీమెన్ కమిటీలన్నీ రద్దు కావడంతో వాటి నియామకం జరుగుతుందని టీడీపీ శ్రేణులు భావించాయి. కానీ ప్రస్తుతానికి పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికే ప్రభుత్వం మొగ్గు చూపింది. జిల్లాలో ఉన్న 112 పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిల నియామకం జరగనుంది. వీటిపై పూర్తి స్థాయిలో కసరత్తు చేసిన అనంతరం పాలక కమిటీలను ఎన్నికల విధానంలోనా లేక నామినేటెడ్ ప్రాతిపదికనా అన్న నిర్ణయం ప్రభుత్వం తీసుకోనుంది.

వైసీపీతో ఐదేళ్లు అంటకాగి...

వైసీపీ నేతలతో ఐదేళ్లు అంటకాగి చివరిలో పార్టీ మారిన నేతలు సైతం నామినేటెడ్ పదవులకోసం ముందు వరుసలో ఉంటూ తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఇలాంటి కొత్త చుట్టాల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని టీడీపీ శ్రేణులు గుర్తు చేస్తున్నాయి. ఆది నుంచి పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులలో పెద్ద పీట వేయడం జరుగుతుందని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదనే అభిప్రాయాన్ని నేతలు వ్యక్తం చేస్తున్నారు.

వర్సిటీలో అడ్డగోలు నియామకాలు

- అతిథి అధ్యాపకులకు నియామక ఉత్తర్వులు
- ప్రతి పోస్టుకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వసూళ్లు
- వీసీ రాజశేఖర్ వ్యవహారంపై భగ్గుమంటున వర్సిటీ వర్గాలు



పెదకాకాని, జూన్ 28: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ తీరు మరోసారి విమర్శలకు లోనవుతోంది. వర్సిటీలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకి ఎటువంటి విధి విధానాలు పాటించకుండా హడావుడిగా బుధవారం నియామక ఉత్తర్వులను ఆచార్య పి.రాజశేఖర్ జారీ చేశా రు. గడిచిన రెండేళ్లలో ఎటువంటి నిబంధనలు పా టించకుండా, వైసీపీ పెద్దల సిఫార్సులతో పెద్దయెత్తున్న అతి థి అధ్యాపకులుగా నియమించారు. దీంతో పాటు వీసీకి నమ్మినబంట్లుగా పేరున్న కొందరికి అతిథి అధ్యాపకుల ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.5లక్షల నుంచి 7 లక్షల వరకు వసూలు చేసినట్లు వర్సిటీలో జోరుగా ప్రచారం జరుగుతుంది. 2019కి ముందు 45 మంది అతిథి అధ్యాపకులు ఉంటే వీసీ రాజశేఖర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు దాదాపు 75 మందిని అదనంగా అతిథి అధ్యాపకులుగా నియమించారు. కేవలం తనకు వ్యతిరేకంగా పనిచేశారన్న సాకుతో 2022లో ఐదుగురిని తొలగించారు. దీంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం వీసీ రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలు చెల్లవని కోర్టు కొట్టి వేసింది. దానితో పాటు 17 ఏళ్లుగా నిరాటంకంగా వర్సిటీలో సేవలందిస్తున్న అతిథి అధ్యాపకుల్ని విధుల నుంచి తొలగించటం రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడు తన పదవికి రాజీనామా చేస్తే తన అనుయాయులకు ఎక్కడ ఇబ్బంది కలుగుతుందో అని హడావిడిగా వారిని 2024-25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.దీనిపై రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించి వీసీ హయాంలో చేపట్టిన నియామకాలపై విచారణ జరిపి, అక్రమాలను వెలికి తీయాలని వర్సిటీ వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నారు.


మహిళామార్ట్ కమిటీ సభ్యులు, మెప్మా సీఎంఎంతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

మహిళామార్ట్ లెక్కలు తేలాల్సిందే..!

- సీఎంఎంపై కమిషనర్ ఆగ్రహం

అద్దంకి, జూన్28: మహిళా మార్ట్ లెక్కలు అన్నీ తేలాల్సిందేనని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. మెప్మా సభ్యుల నుంచి సేకరించిన సుమారు 11 లక్షల రూపాయలతో రెండున్నర సంవత్సరాల క్రితం మహిళామార్ట్ ఏర్పాటు చేసి నిర్వహిస్తుండగా ఇంతవరకు లెక్కలు చెప్పకపోవటంతో సభ్యులు, ఆర్‌పీలు సీఎంఎంను ప్రశ్నించటంతో పాటు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆర్‌పీలను, మార్ట్ నిర్వహణ కమిటీ సభ్యులను పిలిపించారు. మార్ట్ నిర్వహణ కమిటీలో 12 మంది సభ్యులు ఉండగా ఆరుగురు మాత్రమే హాజరు అయ్యారు. ఈ సందర్భంగా కమిటీ ఏర్పాటు బైలా, జమా ఖర్చుల వివరాలు గురించి సీఎంఎం ఫణికుమారిని కమిషనర్ ప్రశ్నించారు. పూర్తి స్థాయి సమాచారం లేకపోవటం, కమిటీ సభ్యులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసి గురువారం మరో సారి అందరితో సమావేశం నిర్వహిస్తామని, అందరు ఖచ్చితంగా హాజరయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. తనకు అనుకూలంగా ఉండే కమిటీ సభ్యులను సమావేశానికి హాజరుకాకుండా సీఎంఎం వ్యవహరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జమా,ఖర్చులు నిర్వహించే కమిటీ సభ్యులే హాజరుకాకపోవటంలోని ఆంతర్యం ఏమిటని పలువురు ఆర్‌పీలు ప్రశ్నిస్తున్నారు. బ్యాంక్ ఖాతాలో 70 వేల రూపాయల నగదు మాత్రమే ఉందని, మార్ట్‌లో సరుకుల విలువ కూడా అతి తక్కువగానే ఉందని, ఈ తరుణంలో సుమారు 10 లక్షల రూపాయలు ఏ మయ్యాయని మెప్మా సభ్యులు, ఆర్‌పీలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాలన్నీ విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోనున్నట్లు తెలిపారు.


బూదవాడలో మలేరియాపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు

నీటి శుభ్రత, దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం

పంగులూరు, జూన్ 28 :పరిశుభ్రమైన నీటి వినియోగంతో పాటు దోమల నిర్మూలనతో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, బోదకాలు వంటి వ్యాధులు దరిచేరవని ఆరోగ్య పర్యవేక్షకులు మదర్‌సా అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా శుక్రవారం బూదవాడలో ఆరోగ్య సిబ్బంది స్థానిక పాఠశాల విద్యార్థులతో అవగాహనా ర్యాలీని హెచ్.యం. బంగారుకొండ ఆధ్వర్యంలో నిర్వహించారు. నీరు నిల్వ లేకుండా చూడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించడం, నీటితొట్లను బ్లీచింగ్‌తో శుభ్రపరచి ఎండబెట్టడం, దోమతెరల వాడకం, దోమల నిర్మూలన చర్యలు చేపట్టడం చేయాలని సూచించారు. ఖాళీ కొబ్బరి బొండాలు, రోలు, తొట్లు, కూలర్లు, వాడిపడేసిన డబ్బాలలో నీరు నిల్వకుండా చూడాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో. స్వప్నలత, ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీరంలో భద్రతా చర్యలకు శ్రీకారం

చీరాల, జూన్ 28 : తీరప్రాంతంలో భద్రతా చర్యలకు రిసార్టుల నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. ఇటీవల జరిగిన వరుస ప్రమాదాలు, మృత్యుసంఘటనల నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య ఆ ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించారు. భవిష్యత్‌లో అలాంటి సంఘటన ఒక్కటి కూడా జరగకుండా ఉండేందుకు రిసార్టుల నిరాహకులు, పోలీస్ అధికారులతో ఒకటికి రెండు పర్యాయాలు సమీక్షలు నిర్వహించారు. అధికారులతో తీరప్రాంతంలో ప్రత్యేకంగా పరిశీలనలు చేశారు. పలు సూచనలు చేశారు. అందులో భాగంగా రిసార్టుల నిర్వాహకులు భద్రతా చర్యలకు శ్రీకారం చుట్టారు. ముందస్తుగా ఐదు ప్రదేశాల్లో బీచ్ ఏరియాలుగా అభివృద్ధి పరిచనున్నారు. పర్యాటకులు ఎవరైనా ఆ ఐదు ప్రాంతాల్లోనే స్నానాలు చేయాలి. ప్రత్యేకంగా నిర్ణీత పార్కింగ్ ఏరియాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. వాహనాలు అక్కడే నిలపాలి. ప్రమాదాల నివారణకు, ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు గజ ఈతగాళ్లను సిద్ధం చేస్తున్నారు. అనౌన్స్‌మెంట్ క్యాబిన్లు(వాచ్ టవర్స్) ఏర్పాటు చేస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా ఎర్రజెండాలతో హెచ్చరిక పోల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము: నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in,
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారులు: 1) మెస్సర్స్ పుష్పా హ్యాండ్లూమ్స్ అండ్ డైయింగ్ వర్క్స్, డి.నం.12-11-71, బ్రహ్మాస్ రోడ్, చీరాల నగర్, జాండ్రపేట, ప్రకాశం జిల్లా-523165, ఆంధ్రప్రదేశ్. నం.2) శ్రీ బోయిన బాజి రెడ్డి, తండ్రి స్వర్గీయ కేశవ రెడ్డి, డి.నం. 35-153, చీరాల నగర్, జాండ్రపేట, ప్రకాశం-523165, ఆంధ్రప్రదేశ్. నం.3) శ్రీమతి బోయిన పుష్పలత, భర్త బాజిరెడ్డి, డి.నం.35-153, చీరాల నగర్, జాండ్రపేట, ప్రకాశం-523165, ఆంధ్రప్రదేశ్ నుండి 15.05.2024 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏమేని ఇతర బకాయిలతో కలిపి 14.05.2024 నాటికి రూ. 8,33,418/- (రూపాయలు ఎనిమిది లక్షల ముప్పై మూడు వేల నాలుగు వందల పద్దెనిమిది మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి/ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తి

షెడ్యూల్ - ఎ ఆస్తి - 1 : (శ్రీ బోయిన బాజిరెడ్డి తండ్రి స్వర్గీయ కేశవ రెడ్డి గారికి చెందిన ఆస్తి) ప్రకాశం జిల్లా, చీరాల సబ్ జిల్లా, చీరాల మండలం (ఆర్.వి) ప్రస్తుత దేవాంగపురి (జాండ్రపేట) పంచాయతి, చీరాల గ్రామం, ఎస్.నం.602/2, బ్లాక్ నం.11, ప్లాట్ నం.లు 51, 52 మరియు 53, మొత్తం విస్తీర్ణం : ఎ.2.50 సెంట్ల స్థలంలో విస్తీర్ణం 367.79 చ.గ.లు = 303.95 చ.మీ.ల భూమి యావత్తు. సరిహద్దులు : తూర్పు : రోడ్-67.06 అ.లు, దక్షిణం : బుదారపు వెంకట సుబ్బారాయుడు ప్లాట్ నం.53 భాగం, స్థలం : 48.06 అ.లు, పశ్చిమం : ప్లాట్ నం.లు : 42 భాగం, 41 మరియు 40, స్థలాలు - 69.00 అ.లు. ఉత్తరం : పంచాయతి రోడ్-48.06 అ.లు.

రిజర్వు ధర: రూ. 11,00,000/-
(రూపాయలు పదకొండు లక్షలు మాత్రమే)

వేలం వివరాలు

టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
31-07-2024	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చీరాల శాఖ, 14-21-85, దర్బన్ రోడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, చీరాల, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523155. టెలిఫోన్ నం: 08594-238883, సెల్ నం.9397081234

టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు : 1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చీరాల శాఖ, 14-21-85, దర్బన్ రోడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, చీరాల, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523155. వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన ప.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం: 08594-238883, సెల్ నం.9397081234 లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్డును కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెటును అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్డను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 18.05.2024 — అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

టిడ్కో ఇళ్లకు మహర్దశ

- అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు చర్యలు
- త్వరలో లబ్ధిదారులకు అందించే అవకాశం
- ప్రథమ ప్రాధాన్యంగా తీసుకున్న టీడీపీ కూటమి ప్రభుత్వం


అద్దంకి పట్టణంలోని శింగర కొండ సమీపంలో నిర్మాణ దశలో ఆగిపోయి ఉన్న టిడ్కో ఇళ్లు

అద్దంకి, జూన్ 28: టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల ముఖాలలో ఆనందం వెల్లువిరుస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చేందుకు టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో అద్దంకి పట్టణంలోని శింగరకొండ సమీపంలో సుమారు 960 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు మంజూరు అయ్యాయి. అందులో 97 గృహాలు రద్దు అయ్యాయి. దీంతో 863 ఇళ్ల నిర్మాణం అత్యధిక శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన కొద్ది పాటి పనులు పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయటంపై వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. దీంతో 5 సంవత్సరాలు టిడ్కో ఇళ్ల అసంపూర్తి పనులు అడుగు ముందుకు పడలేదు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో టిడ్కో ఇళ్ల అసంపూర్తి పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసే పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే అద్దంకి పట్టణంలోని టిడ్కో ఇళ్ల వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కు అధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. ఇక మిగిలి పోయిన పనులు కూడా వేగవంతంగా పూర్తి చేసే అవకాశం ఉంది. దీంతో మరో ఐదారు నెలలలో అన్ని పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేసే అవకాశం ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రీ టెండర్ పేరుతో అద్దంకి పట్టణ సమగ్ర మంచినీటి పథకాన్ని మార్పు చేశారు. దీంతో తమ్మవరం సమీపంలోని గుండ్లకమ్మ నది వద్ద నుంచి శింగరకొండ సమీపంలోని టిడ్కో ఇళ్ల వద్దకు వేయాల్సిన మెయిన్ పైప్‌లైన్, ఓవర్ హెడ్ ట్యాంక్ కాస్తా రద్దు చేసి అద్దంకి పట్టణం వరకే పరిమితం చేశారు. టిడ్కో ఇళ్ల అసంపూర్తి పనులు చేపట్టే క్రమంలో మంచినీటి పథకాన్ని పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అమరావతి రైతుల పాదయాత్రకు ఘనస్వాగతం


ఇంకొల్లులో పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

- ఐదో రోజు ఇంకొల్లుకు చేరిక

ఇంకొల్లు,జూన్ 28: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి నారాచంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి గౌరవసభలో అడుగిడిన శుభసందర్భంగా అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించడంతో అమరావతి రైతులు మొక్కులు తీర్చుకునేందుకు వెంకటపాలెం నుంచి తిరుపతి వరకు పాదయాత్ర చేపట్టారు. ఆ పాదయాత్ర 24 వతేదీన వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి 30 మంది రైతులు ప్రారంభించగా ఐదో రోజు శుక్రవారం ఇంకొల్లు చేరుకుంది. మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలు వారికి ఘనస్వాగతం పలికారు. ఇంకొల్లులో రాత్రికి ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో బస చేసే విధంగా వారికి మండల పార్టీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. శనివారం పాదయాత్ర ఇంకొల్లు నుంచి ప్రారంభమై కొణికి, దుద్దుకూరు, రాచపూడి, నాగులుప్పలపాడుకు చేరుకుంటుందని తెలిపారు. ఈ పాదయాత్రలో అమరావతి రైతులు సురేష్, జయకృష్ణ, కృష్ణారావు, అనుపమ, అనిత, ప్రసన్న, చెన్నకేశవరావు, శివకుమారి, రేణుక, సంధ్య, రత్నకుమారి, గీత, శివలీల పాదయాత్రలో పాల్గొనగా స్థానిక టీడీపీ నాయకులు నాయుడు హనుమంతరావు, మార్కు, కరి శ్రీను, సాంబయ్య రవీ, సంధ్యారాణి, అనంతలక్ష్మి, సుబ్బాయమ్మ, శివయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైతులకు స్వాగతం పలికిన దగ్గుబాడు వాసులు

దగ్గుబాడు(పర్చూరు) : రైతులు చేపట్టిన కృతజ్ఞతా పాదయాత్ర శుక్రవారం కారంచేడు మండలం దగ్గుబాడుకు చేరుకుంది. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాసీం నేతృత్వంలో ఆపార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మేము సైతం అమరావతి రైతులకు మద్దతు అంటూ నినాదాలు చేశారు.


అమరావతి రైతుల పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ శ్రేణులు

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం

తాగునీటి ఎద్దడి ఉన్నా ప్రస్తావించని కౌన్సిలర్‌లు


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, జూన్28: అద్దంకి మున్సిపల్ సమావేశం శు క్రవారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగింది. మున్సిపల్ సమావేశం ప్రారంభమైన 15 నిమిషాలకే ముగిసింది. అజెండాలో ఉన్న మూడు అంశాలను చదవగా చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ఆమోదిస్తున్నట్లు ప్రకటించటంతో సమావేశం ముగిసింది. అద్దంకి పట్టణంలో ప్రస్తుతం తాగునీటి సమస్య తీవ్రతరం అయ్యింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రోజు విడిచి రోజు నీటి సరఫరా జరుగుతోంది. అందులో కూడా గతంతో పోల్చుకుంటే అతి తక్కువ పరిమాణంలో మాత్రమే నీటి విడుదల జరుగుతోంది. సమగ్ర మంచినీటి పథకం పూర్తి కాకపోవటం, గుండ్లకమ్మ నదిలో ఊటబావులలో నీటి లభ్యత తక్కువగా ఉండటంతో నీటి సమస్య ఉత్పన్నమైంది. గతంలో మరి కొన్ని తాత్కాలిక ఊటబావులను తవ్వి నీటిని పంపింగ్ చేశారు. అయితే ప్రస్తుతం అటు వైపు అంతగా దృష్టి పెట్టకపోవటం సమస్య జటిలం అ య్యింది. అయినప్పటికి కౌన్సిలర్‌లు సమావేశంలో ప్రస్తావించకపోవటం విమర్శలకు తావిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన తొలి మున్సిపల్ సమావేశం కావటంతో సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యుత్ శాఖా మంత్రి, అద్దంకి ఎమ్మెల్యే అయిన గొట్టిపాటి రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఎన్నికల ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 13 వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి ప్రతిపాదించిన ప్పటికి చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ఎలాంటి స్పందన వ్యక్తం చేయకపోగా, ఆమోదించకపోవటం పట్ల టీడీపీ కౌన్సిలర్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం నుంచి చైర్‌పర్సన్, వైసీపీ కౌన్సిలర్‌లు అర్ధంతరంగా వెళ్ళిపోవటం ఏమిటని ప్రశ్నించారు. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వానికి, స్థానిక శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్‌కు మంత్రి పదవి రావటం పట్ల హర్షం వ్యక్తం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్న విషయాన్ని టీడీపీ కౌన్సిలర్‌లు వ్యక్తం చేశారు.


టీడీపీ కూటమి అధికారం చేపట్టిన సందర్భంగా స్వీట్లు తినిపించుకుంటున్న టీడీపీ కౌన్సిలర్లు

స్వీట్లు పంచిన టీడీపీ కౌన్సిలర్‌లు

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత శుక్రవారం జరిగిన తొలి మున్సిపల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్‌లు స్వీట్లు పంచారు. చైర్‌పర్సన్, వైసీపీ కౌన్సిలర్‌లు అప్పటికే వెళ్లి పోవటంతో టీడీపీ కౌన్సిలర్‌లతో పాటు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మరో ఇద్దరు కౌన్సిలర్‌లు స్వీట్లు తినిపించుకున్నారు. మూడేళ్ళ మున్సిపల్ పాలనకు భిన్నంగా అభివృద్ధే అభిమతంగా టీడీపీ పాలనలో అద్దంకి పట్టణం మరింత అభివృద్ధి చేసేందుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సిద్ధంగా ఉన్నారని టీడీపీ కౌన్సిలర్‌లు అన్నారు. కౌన్సిలర్‌లు మాగులూరి తిరుపతమ్మ, కంపా రజనీ, మొండితోక సీతమ్మ, రంగిశెట్టి సుభాషిణి, అత్తులూరి రమేష్, విజయలక్ష్మి, జహీరా, తేజశ్వని, యేజెండ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

యద్దనపూడి, (మార్టూరు) జూన్ 28: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని,ఉన్నత చదువులు చదవాలనే ఆకాంక్షతో విద్యను అభ్యసించాలని చీరాల డీవైఈవో నిర్మలాదేవి అన్నారు. శుక్రవారం ఆమె యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ లోని వసతులను పరిశీలించారు. విద్యార్థులకు సంబంధించిన సైన్సు ల్యాబ్‌ను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

ఇంకొల్లు ,జూన్ 28: పండ్ల తోటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వంరాయితీ కల్పిస్తుందని పర్చూరు ఉద్యానశాఖ అధికారి రవిప్రకాశ్ తెలిపారు. ఇంకొల్లులో అయన సంబంధిత అధికారులతో సమావేశమైయ్యారు. ఉద్యానపంటలైన మామిడి, బత్తాయి, నిమ్మ, జామ,సీతాఫలం, నేరేడు, డ్రాగాన్‌ఫ్రూట్స్ తోటల సాగుకు అధికంగా రాయితీ ఉందన్నారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులు ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసువాలని కోరారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు



శ్రీమతి & శ్రీ అన్నంగి హరిబాబు - ప్రమీల గార్లు
ప్రిన్సిపాల్ (FAC), MJPAPBCWRS, కనిగిరి

గత 37 సంవత్సరాలుగా విద్యాశాఖనందు విధులను నిర్వహించి, ప్రిన్సిపాల్‌గా విశిష్టమైన సేవలను అందించి, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన మంచిమనిషి, మాకు అత్యంత ఆత్మీయులు, స్నేహశీలి శ్రీ అన్నంగి హరిబాబు గారు తేది. 30-06-2024న పదవీవిరమణ చేయుచున్న శుభతరుణంలో వారికి మా హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తూ... వారి సన్మాన సభ తేది. 29-06-2024న మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యుల సమక్షంలో M.S. ఫంక్షన్ హాల్, డిమార్ట్ వద్ద జరుగుతున్న సందర్భంలో వారికి మా హృదయ పూర్వక శుభాకాంక్షలు... వారి శేషజీవితం ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ... అభినందనలతో

డా॥ గంటా ధనుంజయరావు - రాధ, P.D., D.S.G.D.C(W), ఒంగోలు
కారుసాల రామాంజనేయులు - సుశీల, Rtd. Head Master, R.V.N.Z.P.H. School, రావినూతల
మోపర్తి ఆంజనేయులు - పున్నమ్మ, రావినూతల
మోపర్తి లక్ష్మీనారాయణ - పద్మావతి, Rtd. AM, A.P.S.B.C.L. రావినూతల

ముప్పవరంలో పట్టపగలు దొంగలు హల్‌చల్

- రెండు ఇళ్లలో నగదు, ఉంగరాల చోరీ


పగులకొట్టిన బీరువాను చూపుతున్న నాగేంద్రం

పంగులూరు, జూన్ 28 :మండలంలోని ముప్పవరం గ్రామంలో పట్టపగలు దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామంలోని రెండు నివాస గృహాలలో చోరీకి పాల్పడిన దొంగలు నగదు, బంగారు ఉంగరాలు అపహరించుకుపోయారు. ముందుగా గ్రామంలోని దొడ్డా నాగేంద్రం ఇంటిలోకి ప్రవేశించిన దొంగలు ఆమె ఇంటిని దోచుకున్నారు.స్థానికంగా ఉన్న పొగాకు కంపెనీలో రోజువారి కూలీగా నాగేంద్రం పనిచేస్తుంది. శుక్రవారం ఉదయం 9 గంటలకు పనికి వెళ్లిన నాగేంద్రం ఒంటిగంట సమయంలో ఇంటికి వచ్చింది. ఆ సమయానికి ఇంట్లోని సామానంతా చిందరవందరగా పడిఉండటంతో పాటు బీరువా పగులగొట్టి ఉండటం చూసి ఆందోళనకు గురయింది. ఇంటి వెనుకవైపు నుంచి తలుపు గడియ తీసుకుని లోనికి ప్రవేశించిన దొంగలు ఇంటిలోని బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.45 వేల నగదుతో పాటు రెండు ఉంగరాలను దోచుకున్నట్లు నాగేంద్రం తెలిపింది. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఇదే గ్రామంలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న తిరుమలశెట్టి వినోద్‌కుమార్ ఇంట్లో కూడా దొంగలు ప్రవేశించి 17వేల రూపాయల నగదు దోచుకున్నారు. వినోద్‌కుమార్ చోరీ సమాచారాన్ని పోలీసులకు తెలియపరిచినట్లు తెలిపారు. గ్రామంలో వేరు వేరు ప్రాంతాలలో నివాసం ఉంటున్న రెండు గృహాలలో శుక్రవారం పట్ట పగలు చోరీ జరిగిన ఘటనతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.

విద్యుదాఘాతంతో గ్రానైట్ కార్మికుడు మృతి


మృతిచెందిన కార్మికుడు రాజేష్

బల్లికురవ, జూన్ 28 : మండల పరిధిలోని వేమవరం- ఉప్పుమాగులూరు గ్రామాల మధ్య ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలలో పనిచేసే ఒడిసాకు చెందిన కార్మికుడు తంతి రాజేష్ (26) శుక్రవారం విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుడు రాజేష్ తనకు ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌లో ఉండగా శుక్రవారం ఉదయం నిద్ర లేవగానే రేకుల షెడ్ పై విద్యుత్ వైరు ఉండటాన్ని చూడక ప్రమాదవశాత్తు దానిని కార్మికుడు పట్టుకోగానే విద్యుత్ షాక్ తగిలి నేలపై పడిపోయాడు. వెంటనే తోటి కార్మికులు చిలకలూరిపేట వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగానే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి పరిశీలించారు. స్టేషన్ రైటర్ అంజనేయులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ముగిసిన పోలేరమ్మ కొలుపులు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

బల్లికురవ. జూన్ 28 : మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న పోలేరమ్మ తల్లి కొలుపులు శుక్రవారంతో ముగిశాయి. భక్తి శ్రద్ధలతో గ్రామస్థులు అయిదు దశాబ్దాల తదుపరి నిర్వహించిన కొలుపులు గ్రామంలో పండగ వాతావరణాన్ని నెలకొల్పాయి. పురాతన కాలంలో ఉన్న అచారాలను కథల రూపంలో ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా పోలేరమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించారు. సుమారు 10 వేల మందికి అన్నదానం చేశారు.

ర్యాంకులు సాధించిన అద్దంకి విద్యార్థులు

అద్దంకి, జూన్22: రాష్ట్ర స్థాయి ఎంట్రెన్స్ టెస్ట్ లలో అద్దంకి కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఏపీ పీజీ సెట్‌లో బీఏ విద్యార్థి బి. అక్షయబాబుకు హిస్టరీలో రెండో ర్యాంకు, బీఎడ్‌లో 52 వ ర్యాంకు, బీఎస్సీ విద్యార్థి షేక్ ఇస్మాయిల్‌కు జువాలజీలో 22 వ ర్యాంక్, పొన్నూరి వీరాంజనేయులుకు 174 వ ర్యాంక్, కొమర దుర్గాప్రసాద్‌కు 218 వ ర్యాంక్,ఇంగ్లీషులో పి.దిలీప్ 302 వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ మోహనరావు, అధ్యాపకులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మోహనరావు, అధ్యాపకులు

డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ

ఇంకొల్లు,జూన్ 28: ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన పథకంలో భాగంగా ఇంకొల్లు మారుతీ ఐటీఐ కాలేజిలో వ్యవసాయ డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణా కార్యక్రమం శుక్రవారం ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ కారుమూడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కోర్సుకు 45 మంది హాజరుకాగా ఆగస్టు 6వ తేది వరకు కొనసాగుతోందన్నారు.శిక్షణా కాలంలో డ్రోన్‌ట్రైనింగుతో పాటు కంప్యూటర్‌పై అవగాహన కలిపిస్తామన్నారు. ఆగస్టు రెండవ వారంలో తదుపరి బ్యాచ్ ప్రారంభమౌతుందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

చీరాల, జూన్ 28 : మున్సిపల్ పరిధిలో ప్రజలకు అధికారులు, సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి చెప్పారు. తనచాంబర్‌లో శుక్రవారం శానిటేషన్, విద్యుత్, పార్కుల నిర్వహణ అధికారులు, సిబ్బందితో వేరు,వేరుగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఆవులను పోషకులు తమ ఇళ్ల వద్దనే కట్టేసుకోవాలని చెప్పారు. లేదంటే నోటీసులు ఇవ్వాలన్నారు. పార్కుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, డివైడర్లలో ఏపుగా పెరిగే చెట్లను ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. విద్యుత్ స్తంభాలకు ఉన్న దీపాలు అన్నీ రాత్రి వేళ్లలో పూర్తిస్థాయిలో వెలిగే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంత్యక్రియలు



మరణం: 1925 — మరణం: 28-06-2024

కీ॥శే॥ చల్లపల్లి వెంకటేశ్వర్లు గారు
(ఇంకొల్లు మండల చెన్నకేశవ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మాజీ అధ్యక్షులు)
గొల్లపాలెం గ్రామం, ఇంకొల్లు(మం), బాపట్ల జిల్లా

గ్రామంలో అందరితో గౌరవంగా "పెద్దాయన (గురువు గారు)" అని పిలవబడుతూ, గ్రామానికే గురువుగా, పెద్దరికానికి మారుపేరుగా, పాతతరం పెద్ద తలకాయలలో ఒకరిగా, సుమారు వందేళ్ళ సుదీర్ఘ ప్రయాణం చేసిన మా తాతగారు కీ॥శే॥ శ్రీ చల్లపల్లి వెంకటేశ్వర్లు గారు శుక్రవారం రాత్రి అకాల మరణం చెందడం మా కుటుంబానికి, గ్రామానికి తీరనిలోటు..

ఇట్లు
మీ మనుమడు: చల్లపల్లి చంద్రశేఖర్, గొల్లపాలెం

అంతిమయాత్ర: నేడు తేది.29-06-2024 శనివారం సాయంత్రం గం॥3.00లకు గొల్లపాలెం గ్రామంలోని మా స్వగృహంనుండి బయలుదేరును. కావున తెలియజేయడమైనది.

డయేరియా నివారణకు ముందస్తు చర్యలు


మాట్లాడుతున్న ఎంఈవో అజయ్‌బాబు

చినగంజాం, జూన్ 28 : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో డయేరియాకు అవకాశం లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీ ఎస్.వేణు గోపాలకృష్ణమూర్తి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో డయేరియా నియంత్రణపై గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్లోరినేషన్, పారిశుధ్యం, అంతర్గత రోడ్లపై నీటి నిల్వలు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈవోపీఆర్డీ గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. జూలై 1వ తేదీ నుంచి పాఠశాలల్లో అతిసారం నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంఈవో బి.అజయ్‌బాబు తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏ.ఈలు డి.దాసు, కార్తీక్, చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పీ. సాయిశ్రీచరణ్, ఆయా గ్రామాల గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్‌కు అభినందనలు


ఖాజావలిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, జూన్ 28 : సెయింట్‌ఆన్స్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న ఖాజావలి అనే విద్యార్థి అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.జగదీష్‌బాబు తదితరులు ఖాజావలిని అభినందించారు. పంజాబ్ రాష్ట్రంలోని పటియాలలో జరిగిన జాతీయ జూనియర్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో రెండు బంగారు పతకాలు సాధించాడు. ఆగస్టు 21న యూరప్‌లో జరిగే అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనేందుకు సయ్యద్ ఖాజావలి అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ జగదీష్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి కల్యాణోత్సవం


అశ్వ వాహనంపై ఊరేగుతున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి

మేదరమెట్ల జూన్ 28 : మేదరమెట్లలోని శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి 40 వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. 30 మంది దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు వేకువ జాము నుంచి స్వామివారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని పండితులు నారాయణ బాలసుబ్రమణ్యచార్యులు, హైగ్రీవాచార్యులు, శ్రీనివాసచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం 700 మంది భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి అశ్వవాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణోత్సవానికి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

గ్రానైట్ పరిశ్రమల సమస్యలు ప్రభుత్వం దృష్టికి

బల్లికురవ గ్రానైట్ క్వారీ నూతన కార్యవర్గం ఎంపిక

బల్లికురవ. జూన్ 28 : గ్రానైట్ క్వారీ పరిశ్రమల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం చేసుకొందామని క్వారీ యజమానులు నిర్ణయించుకొన్నారు. శుక్రవారం బల్లికురవ వీర్ల గంగమ్మ కొండ వద్ద వీటీసీ భవనంలో గ్రానైట్ క్వారీ యజమానుల సంఘం సమావేశం జరిగింది. ఈసందర్భంగా పలువురు యజమానులు గనుల నిర్వహణలో తలెత్తుతున్న సమస్యలను వివరించారు. అనంతరం నూతనంగా క్వారీ యజమానుల సంఘాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో గనుల యజమానులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక


శ్రీకాంత్, వినోద్‌కుమార్

బల్లికురవ మండల గ్రానైట్ క్వారీ యజమానుల సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా దూళిపాళ్ల శ్రీకాంత్, ప్రదాన కార్యదర్శిగా తలశిల వినోద్‌కుమార్, ఉపాధ్యక్షునిగా కొమ్మినేని శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షునిగా ఒట్టిగొండ అంజనేయులు, ట్రెజరర్‌గా సుంకర నాగేశ్వరబాబును, యజమానులను కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి


సమస్యలు తెలుసుకొంటున్న శ్రీనివాసరావు

బల్లికురవ, జూన్ 28 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు తెలిపారు. బల్లికురవ మండలంలోని పలు పాఠశాలలో యూటీఎఫ్ సంఘ సభ్యులు పరిశీలించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈసందర్భంగా అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలను తీసుకు వెళతామన్నారు. ప్రభుత్వ బడిని రక్షించుకొనేలా ఉపాధ్యాయులు పనిచేస్తారన్నారు. జిల్లాలోని ఈపూరుపాలెం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు బిల్లులు జాప్యం చేయటం పట్ల జిల్లా అధికార్లకు ఫిర్యాదు చేస్తామన్నారు. పదవి విరమణ చేసిన ఉపాధ్యాయురాలు వలన జీతాల బిల్లులు పెట్టటంలో లోపం జరిగిందన్నారు. డిసెంబరులో జరిగే స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని ఈసందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు రామాంజనేయులు, చంటి శ్రీనివాసరెడ్డి, దూళిపాళ్ల శేషగిరి, గాలం వీరాంజనేయులు, భాస్కర్, వేణు, రామానాయక్, శ్రీకాంత్, పెదబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పలకలు, పుస్తకాల పంపిణీ

పంగులూరు, జూన్ 28 :మండలంలోని రామకూరు గ్రామంలో చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరిజన బాల బాలికలకు శుక్రవారం పలకలు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్న భానుప్రకాష్, రాజ్యలక్ష్మి దంపతుల సహకారంతో రామకూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొత్తూరు ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన

మార్టూరు, జూన్28: ఉద్యాన పంటలకు సంబంధించి ఉపాధిహామీ పథకంలో వచ్చిన మార్పులపై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో నితిన్ విచ్చేశారు.ఈ సందర్భంగా ఉపాధి పథకంలో 19 రకాల హార్టికల్చర్ ప్లాంటేషన్ గురించి, వాటి రాబడి గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి బి. హనుమంతనాయక్, వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పేద మహిళకు చేయూత

మార్టూరు, జూన్ 28: స్థానిక గొట్టిపాటినగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న పేద మహిళ పఠాన్ మస్తాన్‌బికి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఖాదర్ వలి, కన్నెగంటి శ్రీనివాసరావు,షేక్ రహీం, షేక్ హబీబా,కోటేశ్వరరావు,షేక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్

సచివాలయం సిబ్బంది ద్వారా పంపిణి

వలంటీర్లను పక్కన పెట్టిన ప్రభుత్వం

పంపిణీలో ఇతర శాఖల సిబ్బంది సేవలు

29న పింఛన్ సొమ్మును డ్రా చేయనున్న సిబ్బంది

నెల మొదటి రోజునే పింఛన్‌దారుల

ఇంటికే పింఛన్ అందించాలని ప్రభుత్వ ఆదేశం

పెరిగిన పింఛన్‌తో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు

వృద్ధులు, వితంతువులకు ఒకే సారి రూ.ఏడు వేలు

ఎన్నికల సమయంలో ఎన్డీయే మేనిఫెస్టోలో పింఛన్ మొత్తాన్ని పెంచుతామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. దానిని నెరవేర్చే దిశగా ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తోంది. జూలై ఒకటో తేదీన పెంచిన పింఛన్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇంత పెద్ద మొత్తంలో దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు పింఛన్లను పంపిణీ చేసిన ఘనత రాష్ట్ర చరిత్రలోనే లేకపోవటం గమనార్హం. ఇక ప్రతినెల ఒకటో తేదీనే పింఛన్లను పంపిణీ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. భారీగా పింఛన్లను పంపిణీ చేయటంపై లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యకమవుతున్నాయి.

ఒంగోలు నగరం, జూన్ 28 : రాష్ట్రప్రభుత్వం ఇప్పటివరకు ఇస్తున్న రూ.3 వేల పింఛన్‌ను ఒకేసారి రూ.4 వేలకు పెంచేసింది. ఈ పెంపును ఈ ఏడాది ఏప్రిల్ మాసం నుంచి అమలు చేయనుంది. పెంచిన మొత్తం బకాయిలను కలుపుకొని జూలై ఒకటో తేదీన ఒక్కో లబ్ధిదారుడికి ఏకంగా రూ.7వేలను అందజేయనున్నారు.ఎన్టీఆర్ భరోసా పేరుతో పెంచిన పింఛన్ రూ.4వేలు, మూడు నెలల బకాయిలు రూ.3వేలు మొత్తం కలుపుకొని రూ.7వేలను జూలై ఒకటో తేదీన లబ్ధిదారులైన వృద్ధులు, వితంతువులు, చేనేతలు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, గీతకార్మికులు, చర్మకారులకు ప్రభుత్వం ఇంటి వద్దకే అందజేయనుంది. దీంతోపాటు దివ్యాంగులకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.3వేల పింఛన్‌ను ఒకేసారి రూ.6వేలకు పెంచేసి ఇంటి వద్దనే అందజేయనున్నారు. పెరాలసిస్, ఇతర తీవ్ర వ్యాధులతో బాధపడుతూ పూర్తిగా మంచానికే పరిమితమై ఉన్నవారికి ఇప్పటివరకు రూ.5 వేలు పింఛన్ అందజేశారు. ఇకనుంచి వీరికి ప్రతినెలా రూ.15వేలు అందనుంది. తలసేమియా, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రస్తుతం ఇస్తున్న రూ.5వేలను ప్రభుత్వం ఏకంగా రూ.10వేలకు పెంచేసింది. ఈ మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లాలోని సెర్ప్ అధికారులు, మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వీడియో సమావేశం నిర్వహించి పింఛన్ల పంపిణీపై దిశానిర్దేశం చేశారు.

ఒకటినే పూర్తిస్థాయిలో పంపిణీ

పింఛన్ సొమ్మును సచివాలయం సిబ్బందితోపాటు ఆ బాధ్యతలను అప్పగించిన ఇతర శాఖల సిబ్బంది జూలై ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటి తలుపుతట్టి నగదును అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పింఛన్ల పంపిణీ ఉదయం 6గంటల నుంచే ప్రారంభించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. 99శాతం మందికి ఒకటో తేదీనే పింఛన్ సొమ్మును చేతికి అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా కేంద్రం నుంచి అన్ని మండలకేంద్రాలకు ఆదేశాలు గురువారమే జారీ అయ్యాయి. గ్రామాల్లో లేని వారి రెండో తేదీన అందజేయాల్సి ఉంది. పింఛన్లను పంపిణీ చేసే సిబ్బందికి ప్రత్యేకంగా లాగిన్‌ను ఇవ్వనున్నారు. ఈ లాగిన్ ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేసి నగదును అందజేయాల్సి ఉంది.

జిల్లాలో 2,91,524 పింఛన్లు

జిల్లాలో మొత్తం 2,91,524 పింఛన్లు ఉన్నాయి. వీటిలో వృద్ధాప్య పింఛన్లు 1,59,259 ఉన్నాయి. వికలాంగులు 33,729, వితంతు 68,125, చేనేత కార్మికులు 1,829, ఒంటరి మహిళలు 7,821, కల్లుగీత కార్మికులు 247, చర్మకారులు 5,363, హిజ్రాలు 90, డప్పు కళాకారులు 4725, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారివి 2,502తోపాటు ఇతర పింఛన్లు కలుపుకొని జిల్లా మొత్తం మీద 2,91,524 జిల్లాలో ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం పెంచిన మేరకు ప్రతినెలా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు రూ.19,90,77,600 అవసరం కానున్నాయి.



సచివాలయం సిబ్బందితోపాటు ఇతరశాఖల ద్వారా...

గత ప్రభుత్వం సామాజిక పింఛన్లను వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయించేది. అయితే రాష్ట్రంలో ఎక్కువమంది వలంటీర్లు గత వైసీపీ పెద్దలకు ఎన్నికల్లో తగిన సహకారం అందించేందుకు రాజీనామాలు సమర్పించారు. అయితే వారు ఊహించని విధంగా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రస్తుత ప్రభుత్వం పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారానే పంపిణీ చేయించాలని నిర్ణయించింది. ఒక్కొక్కరికి 50మంది చొప్పున ఇంటి వద్దకే నగదును అందించే విధంగా పంపిణీ ప్రణాళిక రూపొందించింది. సచివాలయ సిబ్బంది తగినంత మంది అందుబాటులో లేకపోతే రెవెన్యూ సిబ్బందినిగాని, మండల పరిషత్ ఉద్యోగులకు కానీ పంపిణీ బాధ్యతలను అప్పగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగులకే పంపిణీ బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే జిల్లా యంత్రాంగం, డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు కసరత్తును పూర్తి చేశారు.

29నే బ్యాంకుల నుంచి డ్రా చేయనున్న సిబ్బంది

జూలై 1న ఉదయం నుంచే పింఛన్లను పంపిణీ చేసేందుకు సచివాలయం సిబ్బంది అందుకు అవసరమైన నగదును ఈనెల 29నే డ్రా చేయనున్నారు. 30వతేదీ ఆదివారం కావటంతో ఒకరోజు ముందుగానే నగదును డ్రా చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామసచివాలయం కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఈ నగదును డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశాలందాయి. సచివాలయం సిబ్బంది కాకుండా ఇతర శాఖల సిబ్బంది పంపిణీకి ఎంతమంది అవసరం అవుతారో ఇప్పటికే ఎంపీడీఓలు లెక్కలు తేల్చారు. వారికి కూడా విధులు కేటాయించి వారు పంపిణీ చేయాల్సిన లబ్ధిదారుల వివరాలను అందజేసి, వారికి కూడా ప్రత్యేక లాగిన్ ఇవ్వనున్నారు. మొత్తం మీద రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ ఎన్‌డీఏ ప్రభుత్వం పింఛన్ పంపిణీని ప్రతిష్టాత్మకంగా భావించి పింఛన్ సొమ్మును ఏకంగా పెంచేయటమే కాకుండా, ప్రతినెలా మొదటిరోజునే సొమ్ము లబ్ధిదారుల చేతికి అందేలా చర్యలు చేపట్టింది.

ఏకపక్షం.. ఇక చెల్లదు

జడ్పీలో మూడేళ్లు సాగిన వైసీపీ ఆధిపత్యం

ప్రజా సమస్యలు పట్టించుకోని వైనం

తాజా ఎన్నికల్లో టీడీపీ భారీ గెలుపు

ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు

యంత్రాంగంతోపాటు పాలకమండలినీ నియంత్రించే అవకాశం

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

జనఘోషని పట్టించుకుంటేనే ఆమోదం

అన్ని శాఖల్లోనూ అస్తవ్యస్త పరిస్థితి

సవాలక్ష సమస్యల్లో జిల్లా ప్రజలు

ఒంగోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పాలకమండలిలో మూడేళ్లుగా సాగుతున్న వైసీపీ ఆధిపత్యానికి బ్రేకులు పడనున్నాయి. ప్రతిపక్షం లేకుండా సొంత పార్టీ సభ్యులతో ఏకపక్షంగా సాగిన పాలకమండలి సమావేశాలకు బ్రేక్ పడనుంది. జెడ్పీ పాలక మండలిలో సభ్యులంతా ఇప్పటికీ అంతా వైసీపీకి చెందిన వారే అయినప్పటికీ ప్రభుత్వపరంగా అటు అధికార యంత్రాంగాన్ని ఇటు పాలకమండలిని నియంత్రించే అధికారం, అవకాశం ఉన్న కీలక ప్రజాప్రతినిధులు తాజాగా జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి భారీగా ఎన్నికయ్యారు. జెడ్పీ పాలకమండలి సమావేశాలకు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా హాజరయ్యే ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలలో టీడీపీ వారే అధికంగా ఉండటంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా టీడీపీ కూటమిది కావడంతో జెడ్పీ పాలకమండలిలో వైసీపీ ఆధిపత్యం ఇక చెల్లని పరిస్థితి ఏర్పడుతున్నది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం తొలిసారి జెడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం జరుగనుండగా రాజకీయ బలాబలాల్లో వచ్చిన మార్పులు ఈ సమావేశంలో ప్రతిబింబించనున్నాయి.

అంతా ఇష్టారాజ్యం

ప్రస్తుత జడ్పీ పాలకమండలి 2021 జూలైలో ఏర్పడగా అప్పట్లో ఉమ్మడి జిల్లాలోని 56 మండలాల నుంచి మొత్తం జెడ్పీటీసీలు, ఎంపీపీలు వైసీపీకి చెందిన వారే ఎన్నికయ్యారు. ఇద్దరు ఎంపీలు అలాగే ఎమ్మెల్యేలులో కూడా 12 మందిలో ఎనిమిది మంది ఆ పార్టీ వారే కాగా తర్వాత కాలంలో మరొక టీడీపీ ఎమ్మెల్యే వైసీపీకి మద్దతు పలికారు. ఆ రకంగా జడ్పీలో పూర్తిగా వైసీపీ ఆధిపత్యం కొనసాగింది. జెడ్పీ చైర్‌పర్సన్‌గా బూచేపల్లి వెంకాయమ్మ వ్యవహరిస్తుండగా వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు ప్రత్యేకించి బాలినేని హవా సాగింది. అయితే ఆ సమావేశాలలో ప్రజల సమస్యలు గురించి, జిల్లా అభివృద్ధి అంశాలు, ప్రభుత్వ శాఖల పనితీరుపైన పెద్దగా చర్చలు జరగడం కానీ, స్థానిక ప్రజాప్రతినిధుల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వ చర్యలు కానీ ఎక్కడా కనిపించలేదు. ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ప్రజాప్రతినిదులు ఉన్నదే తక్కువ కాగా వారు కూడా పెద్దగా సమావేశాలకు రాకపోవడంతో ప్రశ్నించేవారు లేక మొక్కుబడిగానే సమావేశాలు ముగిసేవి. దీంతో జడ్పీలో ఆ సంస్థ పర్యవేక్షించే శాఖల్లో వైసీపీ నేతలు, పార్టీ మద్దతుగా ఉండే ఉద్యోగులు, అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా నడిచింది. అయితే ఇక అలాంటి పరిస్థితి సాగే అవకాశం లేదు.


జడ్పీ సమావేశపు హాలు

వైసీపీ ఆధిపత్యానికి బ్రేక్

జడ్పీ జనరల్ బాడీల్లో జెడ్పీటీసీ సభ్యులు ఓటు అర్హత ఉన్న సభ్యులు అయినప్పటికీ ఎక్స్ అఫిషియో సభ్యులుగా వచ్చే ఎంపీ, ఎమ్మెల్సీలు ప్రత్యేకించి ఎమ్మెల్యేలు అత్యంత కీలకంగా వ్యవహరిస్తారు. సమావేశ నిర్వహణ జడ్పీ చైర్‌పర్సన్ అయినా ఎమ్మెల్యేలు, ఆ స్థాయి నుంచి మంత్రులు అంతా ప్రభుత్వం తరఫున సమావేశంలో పాల్గొనే వారి సూచనలకు అనుగుణంగా నడుస్తుంది. అలాంటి కీలక పాత్రలోకి ప్రస్తుతం టీడీపీ ప్రజాప్రతినిధులు వచ్చారు. ఉమ్మడి జిల్లా నుంచి తాజా ఎన్నికల్లో 12 మంది ఎమ్మెల్యేలులో 10 మంది టీడీపీకి చెందిన వారు గెలుపొందగా జిల్లాతో సంబంధం ఉన్న ముగ్గురు ఎంపీలు కూడా టీడీపీ వారే. అదేసమయంలో ఉమ్మడి జిల్లా నుంచి కేబినెట్‌లో గొట్టిపాటి రవికుమార్, స్వామిలు మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ రకంగా జడ్పీలో వైసీపీ ఆధిపత్యానికి బ్రేక్‌లు పడి టీడీపీదే పైచేయికానుంది. జడ్పీ నిర్వహణ, శాఖల పనితీరుపై వారి పర్యవేక్షణ పెరిగే అవకాశం ఉంది. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వ కాలంలో కేవలం సీఎం జగన్ బటన్ నొక్కే పథకాలు తప్ప జనం బాధలు గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యలకు అనుగుణమైన చర్యలు కూడా పెద్దగా జడ్పీలో జరుగలేదు.

అస్తవ్యస్తంగా జడ్పీ నిధుల కేటాయింపు

ఈ నేపథ్యంలో శనివారం జడ్పీ సర్వసభ్య సమావేశం జరగనుండగా ప్రభుత్వపరంగా పాల్గొనే మంత్రులు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా పాల్గొనే టీడీపీ ప్రజాప్రతినిధులు జిల్లా అభివృద్ధి, ప్రజల తక్షణ సమస్యలు పరిష్కారం, వివిధ ప్రభుత్వ శాఖల్లో పేరుకుపోయిన అవినీతి, నిర్లక్ష్యంపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా చూస్తే జిల్లాలో వ్యవసాయ సీజన్ ప్రతికూలంగా ఉండగా, నేటికి వందలాది గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. పశుగ్రాసం తీవ్రత వేధిస్తుండగా సీజనల్ వ్యాధులు విజృంభించే పరిస్థితి కనిపిస్తోంది. ఇలా అనేక సమస్యలతోపాటు కీలకమైన వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టులు, ట్రిపుల్‌ఐటీతోపాటు పారిశ్రామిక ప్రగతి పడకేసింది. మౌలిక రంగాలలో రోడ్లు, విద్య, వైద్యసంస్థలు అధ్వానంగా ఉన్నాయి. ఇక శాఖలపరంగా చూస్తే రెవెన్యూ, డ్వామా, వైద్య ఆరోగ్య శాఖలు అవినీతికి ఆలవాలంగా మారాయి. గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థ ఆశించిన మేర పనిచేయడం లేదు. జడ్పీ నిధులు కేటాయింపు ఏకపక్షంగా జరగాయన్న ఆరోపణలు ఉండగా మండలాల్లో పాలన పడకేసింది. ఈ మొత్తం అంశాలను పరిగణనలోకి తీసుకొని టీడీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులుగా పాల్గొనే ఆ పార్టీకి చెందిన మంత్రులు ఈ జడ్పీ సమావేశం నుంచే జిల్లా ప్రజల బాగోగులు, అభివృద్ధి అంశాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అస్తవ్యస్తంగా రేషన్ పంపిణీ

యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలింపు

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న డీలర్లు

సరుకులు అందక ప్రజలకు అవస్థలు

దర్శి జూన్ 28: దర్శి నియోజకవర్గంలో రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. గత మూడు నెలలుగా ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో ఎవరూ పట్టించుకోకపోవటంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కార్డుదారులకు సక్రమంగా ఇవ్వకుండా యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో తమను ఎలాగూ ఉంచరన్న ఉద్దేశంతో పాత డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగింది. డీలర్లు, దళారులు రైస్ మిల్లర్లకు ఈ వ్యాపారం కల్పవృక్షంగా మారింది. వైసీపీ నాయకులు కొంతమంది ముండ్లమూరు మండలంలో ఒక మిల్లును లీజుకు తీసుకొని రేషన్ బియ్యాన్ని అక్కడకు తరలించేవారు. అక్కడ బియ్యాన్ని పాలిష్ వేసి రవాణా చేస్తూ ప్రతినెలా లక్షలాది రూపాయలు సంపాదించిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో డీలర్ల వ్యవస్థ ప్రక్షాళన జరిగి సక్రమంగా రేషన్ పంపిణీ జరుగుతుందని ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

దర్శి నియోజకవర్గంలో మొత్తం 152 రేషన్ షాపులు ఉన్నాయి. ప్రతినెలా 1100 టన్నుల బియ్యం సరఫరా అవుతుంది. అందులో సగానికిపైగా బియ్యం బ్లాక్‌మార్కెట్‌కు తరలివెళ్తుంది. కొంతమంది డీలర్లు కార్డుదారులు బియ్యం అడిగినప్పుడు నిల్వలు లేవని కేజీకి రూ.10 చొప్పున డబ్బులు ఇస్తున్నారు. ఇదేమిటని అడిగితే మీచేతనైనది చేసుకోమని కొందరు బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్నారు.

ప్రక్షాళనకు రంగం సిద్ధం

అస్తవ్యస్తంగా మారిన డీలర్ల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు రంగం సిద్ధమైంది. నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి రేషన్ పంపిణీ జరుగుతున్న తీరుపై ఇప్పటికే పూర్తి సమాచారం తీసుకున్నట్లు తెలిసింది. రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయని డీలర్లను సాగనంపేందుకు రంగం సిద్ధం చేశారు. దీంతో కొంతమంది డీలర్లు ఇప్పటికే రాజీనామాలు చేశారు. మరికొందరు రాజీనామాలకు సిద్ధమవుతున్నారు.

18 మంది డీలర్లు రాజీనామా

నియోజకవర్గంలో ఇప్పటివరకు 18మంది డీలర్లు రాజీనామాలు చేశారు. తాళ్ళూరు మండలంలో పదిమంది, కురిచేడు మండలంలో ఐదుగురు, ముండ్లమూరు మండలంలో ఇద్దరు, దొనకొండ మండలంలో ఒక డీలరు రాజీనామాలు చేశారు. మరికొంతమంది రెండు మూడు రోజుల్లో రాజీనామాలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటివరకు కొనసాగిన టీడీపీ సానుభూతిపరులైన డీలర్లను బలవంతంగా తొలగించారు. నిజాయితీగా పనిచేస్తున్న వారిపై కూడా అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారు. కొంతమంది కోర్టులకు వెళ్లి స్టే తెచ్చుకొని మళ్లీ కేసులు పెట్టకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకొని నిబంధనల మేరకు రేషన్ పంపిణీ చేశారు. ఆ షాపులలో సీసీ కెమెరాలు ఉండటంతో అధికారులు తప్పుడు కేసులు బనాయించేందుకు వెనుకంజవేశారు. వైసీపీ సానుభూతిపరులైన డీలర్లు మాత్రం రేషన్ పంపిణీ సక్రమంగా చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం క్లాసిఫైడ్స్

WANTED

■ మా ప్లే స్కూల్ నందు పనిచేయుటకు స్పోకెన్ ఇంగ్లీషులో అనుభవం కలిగిన లేడీ టీచర్స్ కావలెను. వివరములకు సంప్రదించ సెల్: 7032047909.
AJO-183882

వరుడు కావలెను

■ బిఇజ/ రెండో పెళ్లి/38/5'3"/M.Sc/ గవర్నమెంట్ ఎంప్లాయ్ / అందమైన వధువు తగిన వరుడు కావలెను. అన్ని కులాల వారి పెళ్లి సంబంధాల కొరకు సంప్రదించండి. కోట రవి నాయుడు, మధువల్లిక మ్యారేజెస్, సెల్ : 93921 92193
AJO-183937

BUILDING FOR RENT / SALE

■ ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ ఎదురు, రామ్‌నగర్, 6వ లైను, N.R.K.M లాడ్జి ప్రక్కన, 5అంతస్తుల బిల్డింగ్ (40X80 RCC) కొలతలతో అద్దె / అమ్మకానికి కలదు. సెల్: 9866659049, 7013261494
AJO-190171

PLOT FOR SALE

■ మారం వెంకారెడ్డి రియల్ ఎస్టేట్స్ ఒంగోలు NH-5 నుండి మంగమూరు రోడ్డు, పవర్ ఆఫీస్ దాటాక తక్షణం ఇల్లు నిర్మించుటకు, ఇన్వెస్ట్‌మెంట్‌కి అనుకూలంగా ఒక గది కేవలం 36 వేలకే ప్లాట్స్ కలవు. సంప్ర: 9885184207 స్పాట్ రి.
AJG-9462

రియల్ ఎస్టేట్

■ అవకాశ వ్యవసాయ భూమి అమ్మకం :- 4 లక్షలకే 11 సెంట్స్ / 8 లక్షలకే 22 సెంట్స్ / 16 లక్షలకే 44 సెంట్స్ / 30 లక్షలకే 88 సెంట్స్, బంట్రవారం, ముండ్లమూరు, అద్దంకి, సంప్ర: 8500031223, స్పాట్ రిజిస్ట్రేషన్.
AJG-191464

FLATS FOR SALE

■ గుంటూరు సిటీ, అమరావతి రోడ్‌కు దగ్గరలో వారాహి ఇన్‌ఫ్రా "నంది హోమ్స్" లో 3X విల్లాస్ మరియు సత్తెనపల్లిలో "షణ్ముఖ రాయల్" గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్స్‌లో అపార్ట్‌మెంట్స్, విల్లాస్ & డూప్లెక్స్ హౌసెస్ అమ్మకమునకు కలవు. ఫుల్ ఫినిష్డ్ రెడీ టు ఆక్యుపై. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. AP RERA NO. P07150120231. సంప్ర. 97016 89312
AJG-89

ప్లాట్లు కొనబడును

■ నెల్లూరులోని ముత్తుకూరు రోడ్, కనుపర్తిపాడు, బుజబుజనెల్లూరు, మైపాడు రోడ్ ఏరియాలోని ప్లాట్లు కొనబడును. సం.ప్ర. సెల్: 93464 48054, 79812 46665
AJR-193520

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



కర్షకుల కన్నీరు ఆగేనా ?

- గత ప్రభుత్వంలో అష్టకష్టాలు
- పథకాల అమలుకు ఎన్నో నిబంధనలు
- ముప్పుతిప్పలు పెట్టిన సున్నా వడ్డీ
- ఐదేళ్లుగా అందని సూక్ష్మపోషకాలు
- ఏటేటా పెరుగుతున్న సాగు వ్యయం
- అప్పుల ఊబిలో అన్నదాతలు
- కోలుకోలేని స్థితిలో కౌలురైతులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



పొలం చదును చేసే పరికరం కొనుగోలు చేయలేక కుటుంబ సభ్యులతో పొలం చదును చేస్తున్న రైతు

సంగం, జూన్ 28 : గత వైసీపీ పాలనలో పంటల సాగు భారమైంది. అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ఏటా పెరుగుతున్న సాగు వ్యయంతో సతమతమయ్యారు. మరోపక్క తెగుళ్ల దెబ్బకు సక్రమంగా పంటలు పండక రైతులు ఎంతో నష్టపోయారు. ఇంకోవైపు పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోయారు. వైసీపీ ప్రభుత్వంలో ఇక తమకు కన్నీళ్లతప్ప సంతోషం లేదని, రైతులంతా ఎన్డీఏ కూటమికి పట్టం కట్టారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ కష్టాలు తీరుతాయా, లేదా ? అని వారు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని కాలువలు, చెరువులు, బోర్ల కింద మాగాణి, మెట్టతో కలిపి సుమారు 10 లక్షల ఆయకట్టు ఉంది. ఇందులో 8 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. జిల్లాలో సుమారు 7.5 లక్షల మంది రైతులు ఉన్నారు. వారంతా గత ప్రభుత్వ హయాంలో అన్యాయానికి గురయ్యారు. ఎలాగంటే ఈ కథనం చదవాల్సిందే.

కొందరికే సున్నా వడ్డీ

బ్యాంకుల్లో రూ. లక్షలోపు రుణం తీసుకున్న రైతులు వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే చెల్లిస్తుందని వైసీపీ ప్రకటించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు నాలుగు లక్షలమంది రైతులు బ్యాంకుల్లో రుణం తీసుకుంటే, వారిలో కేవలం నాలుగో వంతు మందికి మాత్రమే సున్నా వడ్డీ పథకాన్ని వర్తింపచేశారు. అత్యధికశాతం రైతులకు సున్నావడ్డీ పథకం అమలు కాకపోవడంతో బ్యాంకులు, సహకార సంఘాలు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగారు.

సూక్ష్మ పోషకాలేవి..?

నిస్సారమైన భూములను సారవంతం చేసే సూక్ష్మ పోషకాలను రైతులకు పంపిణీ చేసే పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. ఐదేళ్లుగా రైతులు సూక్ష్మ పోషకాలకు దూరమయ్యారు. తెగుళ్లు, క్రిమికీటకాలతో పంటలు సక్రమంగా చేతికి అందక రైతులు నష్టాల పాలయ్యారు.

కాగితాల్లోనే భూసార పరీక్షలు

గత వైసీపీ ప్రభుత్వంలో భూసార పరీక్షలకు కూడా అధికారులు స్వస్తి పలికారు. దీంతో రైతులు తమ పొలాల్లో ఏయే ఎరువుల కొరత ఉందో తెలుసుకునే అవకాశం లేక ఇష్టారాజ్యంగా రసాయన ఎరువులు వినియోగించి, భూమి నిస్సారంగా మారేలా చేసుకున్నారు.

పొలంబడి ఎక్కడ ?

పొలం బడి కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం మాటలకే పరిమితం చేసింది. కొన్ని మండలాల్లో పొలంబడి కార్యక్రమాన్ని ఆర్బీకే సిబ్బందితో బలవంతంగా అమలు చేశారు. అది కూడా మొదట్లో మండలానికి ఒకటి, ఆ తరువాత సబ్ డివిజన్‌కు ఒకటి చొప్పున మొక్కుబడిగానే నిర్వహించారు. నిధులు కేటాయింపులు లేక ఆర్బీకే సిబ్బందితోపాటు మండల వ్యవసాయాధికారులు నానా కష్టాలు పడ్డారు.

డ్రిప్ ఇరిగేషన్ కనుమరుగు

జిల్లాలో నీటి లభ్యత తక్కువగా ఉండే మెట్ట ప్రాంతాల్లో డ్రిప్ ఇరిగేషన్ పథకం కీలకం. అందుకు అయ్యే ఖర్చులో 90 శాతం రాయితీ ఇచ్చేవారు. అలాంటి బహృత్తర పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా కనుమరుగు చేసింది. జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు మెట్ట ప్రాంతాల్లో ఉద్యాన పంటలకు డ్రిప్ ఇరిగేషన్ ఎంతో ప్రయోజనం చేకూర్చేది. డ్రిప్ కంపెనీలకు సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో వారు రైతుల పొలాల్లో డ్రిప్ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రాలేదు.

విత్తన రాయితీలోనూ కోతే..

ప్రభుత్వం ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ పంటలకు 40 నుంచి 50 శాతంతో రాయితీ విత్తనాలను అందించేది. ఈ కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీన్ని వల్ల ఏపీ సీడ్స్ సంస్థకు విత్తనాలు అందించే వ్యాపారులు లబ్ధి పొందడం తప్పితే.. రైతులకు ఏ మాత్రం ప్రయోజనం కలగలేదు.

ఆధునిక పరికరాలేవి ?

వైసీపీ ప్రభుత్వంతో రాయితీతో అందించే ఆధునిక పరికరాల జాడే లేదు. రైతు సంఘాల పేరుతో కేవలం ఆర్బీకేలో ఒక సంఘానికే.. అందులో ఆ పార్టీ కార్యకర్తలకే పరికరాలు ముట్టచెప్పారు. వాటిని వారి సొంతానికి వాడుకున్నారు. సన్నచిన్నకారు రైతులకు ఉపయోగపడలేదు.

కౌలు రైతుల పరిస్థితి అంతే..

జిల్లాలో సుమారు లక్ష మంది కౌలు రైతులు ఉంటే వారిలో సగం మందికి కూడా సీసీఆర్ కార్డులు లేవు. సీసీ కార్డులు ఉన్నా బ్యాంకుల రుణాలు మాత్రం కొందరికే ఇచ్చారు. ఇకపోతే వైసీపీ పాలనలో భూముల హక్కులపై రైతుల్లో నమ్మకం సన్నగిల్లింది. దీంతో సాగుపత్రాలపై సంతకాలకు ఎవరూ ముందుకు రాలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఇన్ని కష్టాలు అనుభవించిన రైతు కొత్త ప్రభుత్వంలో తమకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నాడు. ఎన్డీఏ ప్రభుత్వమైనా కర్షకుల కన్నీళ్లు తుడిస్తుందని ఆశిద్దాం.

పథకాలు సక్రమంగా అమలు చేయాలి



గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అన్నదాతలకు ఎంతో నష్టం జరిగింది. పథకాలన్నీ కాగితాల్లో తప్పితే.. ఆచరణలో ఏమాత్రం అమలు కాలేదు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతే అరకొరగానే ఇన్‌పుట్ సబ్సిడీని అందించారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వమైనా రైతులను ఆదుకోవాలి.

- నారాయణరెడ్డి, ఏఎస్ కండ్రిక, సంగం మండలం

భగ్గుమంటున్న బియ్యం

- ధరలు పెంచి విక్రయిస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని పర్యవేక్షణ కమిటీ
- అధికరేట్లతో అల్లాడుతున్న ప్రజలు



నెల్లూరు (హరనాథపురం), జూన్ 28: జిల్లాలో బియ్యం ధరలు మండి పోతున్నాయి. కేజీ రూ. 50 నుంచి రూ. 74 వరకు విక్రయిస్తున్నారు. దీంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలో సన్నాలు, జిలకర్లు అనే రెండు పేర్లు చెప్పి వ్యాపారులు ప్రజలను అడ్డంగా దోచుకుంటున్నారు. అయితే ధరల పర్యవేక్షణ కమిటీ ఇవేమి పట్టించుకోకుండా మౌనవ్రతం దాల్చింది.

తూకం తగ్గిన బస్తా

గతంలో బియ్యం బస్తా అంటే వందకిలోలు, 70 కిలోలుగా ఉండేది. దాని ధర రూ.వెయ్యిలోపే ఉండేది. కాలక్రమేణా బియ్యం బస్తా అంటే 25 కిలోలు, పది, ఐదు కిలోలకు తగ్గించారు. లూజ్ బియ్యాన్ని కిలో లెక్కన విక్రయిస్తున్నారు. రెండు నెలల కిందట 25 కిలోల బస్తా రూ.1,300గా ఉండేది. ప్రస్తుతం సన్నాలు అయితే రూ. 1500 నుంచి రూ.1700వరకు, జిలకర్లు రూ. 1,500లకు అమ్ముతున్నారు. పాత బియ్యం పేరు చెప్పి వాటి ధర పెంచి విక్రయిస్తున్నారు. ఇంటికి తెచ్చి వండితే అన్నం ముద్దగా, సంగటిలాగా తయారవుతోంది. పాత బియ్యం అని చెప్పి కొత్త బియ్యాన్ని అమ్ముతూ వ్యాపారులు ప్రజలను మోసం చేస్తున్నారు. నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, చిన్నబజారు ప్రాంతాల్లో బియ్యం అమ్మకాలు ఎక్కువగా జరుగుతుంటాయి. స్టోన్‌హౌస్‌పేటలోని ఓ దుకాణంలో ఉన్న రేటు మరో దుకాణంలో ఉండటం లేదు. బియ్యం ప్యాకింగ్‌కు వాడే ప్లాస్టిక్ గోతాలమీద ఎవరో ఒక సినీ నటి బొమ్మ ముద్రించో.. లేక అందరికీ తెలిసిన వ్యక్తి పేరో వేసో అమ్ముతున్నారు. సినీ నటి బొమ్మ ఉన్న బస్తా ధర కాస్త ఎక్కువ, బొమ్మ ముద్రించని బస్తా ధర రూ. 100 తక్కువని అమ్ముతున్నారు. 25 కిలోల బియ్యం బస్తా ముగ్గురు ఉండే కుటుంబం సరిగా తింటే ఒక నెల వస్తుంది. ఈ క్రమంలో చాలిచాలనీ జీతాలు అందుకుంటున్న ఎందరో రూ.1,500 నుంచి రూ. 1700 ధర పెట్టి బియ్యం కొనలేక పోతున్నారు.

పట్టించుకోని కమిటీ

జిల్లాలో ధరల పర్యవేక్షణ కమిటీ ఉంది. ఈ కమిటీ ఇటీవల జేసీ సేతుమాధవన్ ఆధ్వర్యంలో సమావేశమైంది. ఉల్లిపాయలు, టమోటాల ధరలు పెరగడంతో వాటి ధరలు పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో జేసీ ఆదేశించారు. దీంతో వాటి ధరలు కొంత వరకు తగ్గాయి.అయితే బియ్యం ధరల పెరుగదలపై క మిటీ దృష్టి పెట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ధాన్యం విరివిగా పండుతోంది. ఖరీఫ్‌లో రెండు లక్షల ఎకరాల్లో ధాన్యం పండింది. బయట మార్కెట్‌లో పుట్టి ధాన్యం ధర రూ. 19 నుంచి రూ. 23వేల వరకు ఉంది. రైతుల పండించిన ధాన్యానికి బయట మార్కెట్‌లో మంచిరేటే ఉంది. ధాన్యం దిగుబడులు జిల్లాలో ఎక్కువగా ఉన్నా, బయట మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పెరుగుతున్న ధరలకనుగుణంగా కొందరు వ్యాపారులు బియ్యాన్ని గోదాముల్లో దాచుకొని వారిష్టమైన ధరలకు అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా ధరల పర్యవేక్షణ కమిటీ చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



దిల్ రుబా ఆఖరి కళాకారుడు శ్రీనివాసరావు మృతి

వెంకటగిరి టౌన్, జూన్ 28 : వెంకటగిరికి చెందిన అరుదైన దిల్‌రుబా వాయిద్య కళాకారుడు శ్రీనివాసరావు కన్నుమూశారు. ఆయన వయసు 104 సంవత్సరాలు. రాయదుర్గంలోని తన మేనల్లుడు డాక్టర్ గోపాల్ వద్ద కొంతకాలం గా ఉంటున్న శ్రీనివాసరావు గురువారం రాత్రి ఆఖరిశ్వాస విడిచారు. హిందుస్థానీ వాయిద్యం అయిన దిల్‌రుబా మీద కర్ణాటక సంగీతాన్ని పలికించడం శ్రీనివాసరావు ప్రత్యేకత. ఉత్తర భారతదేశంలోనే అరుదైన ఈ సంగీత వాయిద్యాన్ని దక్షిణభారత దేశంలో వాయించే ఆఖరి కళాకారుడు ఈయన. వయోలిన్, జలతరంగిణి, హార్మోనియం, కీ-బోర్డు ల్లోనూ శ్రీనివాసరావు దిట్ట. 1933 నుంచి వెంకటగిరిలోని అమెచ్యూర్ ఆర్టిస్ట్ అసోసియేషన్, వెంకటగిరి ఆర్ట్స్ థియేటర్, కల్చరల్ ఆర్ట్ థియేటర్స్, నట సమాఖ్య, ఆజాద్ అమెచ్యూర్ ఆర్టిస్ట్స్ వంటి సంస్థల్లో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. 1940-50 మధ్య వెంకటగిరి క్లబ్ కార్యదర్శిగా పది సంవత్స రాలు సేవలందించారు. పంచాయతీ బోర్డు సభ్యుడి గానూ పనిచేశారు. ఎస్వీబీసీ మాజీ చైర్మన్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర సంగీత గేయధారకు హార్మోనియం సహకారం అం దించారు.ఆచార్య ఆత్రేయతో మంచి సాన్నిహిత్యం ఉండేది. శ్రీనివాస రావు సంగీతమే ఊపిరిగా జీవించారు. పెళ్లి చేసుకోలేదు. కొన్నేళ్లుగా మేనల్లుడి వద్ద ఉంటూ గురువారం కన్నుమూశారు.

నూతన విభాగం.. నిరుపయోగం !

- కరోనా సమయంలో చిన్నారుల కోసం అధునాతన వార్డు
- జీజీహెచ్‌లో 50 పడకలతో ఏర్పాటు
- ఒక్కరోజు సేవలందిస్తే ఒట్టు
- అధికారుల తీరుపై పలువురి ఆగ్రహం

నెల్లూరు (వైద్యం) జూన్ 28 : కరోనా సమయంలో చిన్నారుల కోసం నెల్లూరు జీజీహెచ్‌లో అధునాతన విభాగాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆ విభాగాన్ని నేటికి వాడుకోలేదంటే వైద్యాధికారుల తీరు ఎలాఉందో తెలుస్తుంది. కొంతమంది వైద్యులు దీని వినియోగంపై అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా ఫలితం లేదు. ఈ పరిస్థితిలో మనకెందుకులే అని వైద్యులు, సిబ్బంది నోరు మెదపటం లేదు. ఇప్పటికే మూడేళ్లు కావస్తున్నా ఆ విభాగాన్ని మాత్రం నేటికి ఎవరికీ వినియోగించలేదు. ఈ నేపథ్యంలో అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వినియోగంలోకి రాని 50 పడకల ఆధునిక విభాగం

రూ. 20 లక్షల వృథా

2021లో జూలైలో కరోనాను దృష్టిలో పెట్టుకుని కొత్త ఐపీ బ్లాక్ మొదటి అంతస్థులో 50 పడకలతో అధునాతన చిన్న పిల్లల విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ కొత్త ఏసీలతో పాటు కర్టెన్లు వంటి వాటిని సిద్ధం చేశారు. ప్రతి పడకలకు ఆక్సిజన్ సరఫరాకు రంగం సిద్ధం చేశారు. రెండు గదుల్లో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ. 20 లక్షల పైగా ఖర్చు చేశారు. చిన్నపిల్లలకు ఈ విభాగంలో మెరుగైన చికిత్సలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే మూడేళ్లు కావస్తున్నా నేటికీ ఈ ఆధునిక విభాగాన్ని వినియోగంలోకి తీసుకు రాలేదు. కొందరు సెక్యూరిటీ సిబ్బంది దీన్ని వినియోగించుకుంటున్నారు. గత వేసవిలో ఈ విభాగాన్ని బాలింతల కోసం వినియోగించాలని అధికారులు భావించినా, ఆ దిశగా అడుగులు పడలేదు. కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వం అయినా వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఐసీయూ రోగులకిస్తే మేలు

ప్రస్తుతం ఐసీయూ రోగులకైనా ఈ విభాగాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఆయా విభాగాల్లో రోగులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఇక్కడ నాలుగో అంతస్థులో ఒక్కక్క దానిలో 36 పడకల ఐసీయూ ఉంది. సర్జరీ చేయించుకున్న రోగులను మాత్రమే ఐసీయూకీ తరలిస్తుంటారు. ఐసీయూలో ఉండే సాధారణ రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆధునిక విభాగాన్ని ఐసీయూ రోగులకు కేటాయించాలని పలువురు అధికారులకు ప్రతిపాదనలు పంపినా ఫలితం కనిపించలేదు. ఇదిలాఉంటే ఆధునిక విభాగంలోని ఏసీలలో కొన్నింటిని ఇతర విభాగాలకు తరలించారు.

వినియోగంలోకి తీసుకువస్తాం..

ఎంతో అధునాతనంగా రూపొందించిన 50 పడకల విభాగాన్ని త్వరలో వినియోగంలోకి తీసుకు వస్తాం. పూర్తిస్థాయి పరిశీలన జరిపి ఎవరికి అవసరం అవుతుందో వారికే కేటాయిస్తాం. అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

- డాక్టర్ సిద్ధానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

మూడేళ్లయినా తేలని భోక్తలు

- 'సర్వేపల్లి'లో గ్రావెల్ కొల్లగొట్టిందెవరు ?
- రూ.100 కోట్లు సంపద దోచుకున్నారనే ఆరోపణలు
- అక్రమాలు నిగ్గుతేల్చినా చర్యలు శూన్యం
- ఎంపీ మాగుంట పేరు వాడిందెవరో..?
- అటకెక్కిన పోలీసు కేసు
- జరిమానా చెల్లించి తప్పించుకునే ప్రయత్నాలు ?



అక్రమ తవ్వకాలతో సర్వేపల్లి రిజర్వాయర్‌లో ఏర్పడిన భారీ గుంతలు(ఫైల్)

నెల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రిజర్వాయర్‌లో ఎక్కడ చూసినా భారీగుంతలు.. అనుమతులు పొం దింది గోరంత... తవ్వకాలు జరిపింది మాత్రం కొండంత.. సుమా రు రూ.100 కోట్ల విలువ చేసే గ్రావెల్‌ను తవ్వేశారని ప్రతిపక్షాల ఆరోపణ. అధికారుల విచారణలో అక్రమ తవ్వకాలు బట్టబయలు... ఏకంగా ఓ ఎంపీకి తెలియకుండా ఆయన పేరుతో మట్టి తరలింపు.. చివరకు ఆయనపై పోలీసు కేసు కూడా నమోదు.. ఇవీ మూడేళ్ల క్రితం రాష్ట్రవ్యాప్తం గా సంచలనం సృష్టించిన అంశాలు. అధికార బలంతో ఆ తర్వాత అన్నీ సర్దుకున్నాయి. అసలు తప్పే జరగలేదన్న ట్లు ఎవరికి వారు మిన్నకుండిపోయారు. కానీ ప్రతిపక్ష టీడీపీ నేతలు మాత్రం ఈ అక్రమాలను వదల్లేదు. ఆధారాలతో సహా లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. విచారణకు స్వీకరించిన లోకాయుక్త మైన్స్, పోలీసు అధికారులకు నోటీసులు జారీ చేసింది. మైనింగ్, ఇరిగే షన్ శాఖల అధికారులు లోకాయుక్తకు నివేదికలు కూడా అందజేశారు. సర్వేపల్లి రిజర్వాయర్‌లో మట్టి తవ్వకాలు అక్రమంగా జరిగింది నిజమేనని తేల్చారు. అయినా పోలీసు విచారణ మాత్రం ముందుకు సాగలేదు. ఈలోపు ఈ కేసును మాఫీ చేసేందుకు రకరకాల ప్రయత్నాలు జరిగాయి. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం మారడంతో ఇప్పటికైనా సర్వేపల్లి రిజర్వాయర్ గ్రావెల్ భోక్తలు ఎవరన్నది తేలుస్తారా..? అన్నది ఆసక్తిగా మారింది.

నిగ్గు తేల్చిన అధికారులు

వెంకటాచలం మండలం సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి మట్టి తవ్వకాలు జరుపుకునేందుకు 2021 మే, జూన్ నెలల్లో ముగ్గురు వ్యక్తులు అనుమతులు తీసుకున్నారు. తూపిలి ఉదయకుమార్‌రెడ్డి, ఎం శ్రీనివాసులురెడ్డి, బీ శ్రీధర్‌రెడ్డిలు 8 వేల క్యూబిక్ మీటర్లకు పలు దఫాలుగా అనుమతులు పొందారు. ఒక్క ఎం శ్రీనివాసులురెడ్డి తండ్రి రాఘవరెడ్డి పేరుతో నాలుగువేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకున్నారు. కానీ తీసుకున్న అనుమతులకు తవ్విన తవ్వకాలకు పొంతనే లేదు. ఇష్టానుసారం తవ్వేసి అధికార పార్టీ నేతలు రూ.కోట్లు గడించారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధారాలతో సహా బయటపెట్టారు. తొలుత రాజకీయ ఒత్తిళ్లతో స్పందించని జిల్లా అధికారులు, రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టారు. సర్వేపల్లి రిజర్వాయర్‌లో జరిగిన తవ్వకాలను పరిశీలించి, కొలతలు వేసి అనుమతులకు మించి తవ్వకాలు జరిగినట్లుగా గుర్తించారు. మొత్తం 8 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వగా, 18,629 క్యూబిక్ మీటర్లు తవ్వినట్లు తేల్చారు. అయితే అక్రమ తవ్వకాలు ఇంకా భారీ స్థాయిలోనే ఉన్నప్పటికీ అప్పటి ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఈ మేరకు మాత్రమే అనుమతులకు మించి తవ్వినట్లు చూపించారు. అనుమతులకు మించి తవ్వకాలు జరిపిన నేపథ్యంలో నిబంధనల ప్రకారం ఇరిగేషన్ జేఈ కే ప్రసాద్ వెంకటాచలం పోలీసుస్టేషన్‌లో అనుమతులు పొందిన ముగ్గురిపై ఫిర్యాదు చేశారు. దీంతో జూన్ 21న ఏ1గా తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏ2గా ఎం శ్రీనివాసులురెడ్డి, ఏ3గా బి శ్రీధర్‌రెడ్డిలను చేరుస్తూ 427ఐపీసీ, 21(4)ఎంఎండీఏఆర్‌ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఎంపీ పేరు దుర్వినియోగం

నెల్లూరు నగర పరిధిలో ఉన్న మాగుంట ఆగ్రో ఫార్మ్‌కు మట్టి అవసరమైనట్లు ఆ ఫార్మ్ యజమాని అయిన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరు మీద అక్రమార్కులు దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తు మాటున రూ.కోట్ల విలువైన గ్రావెల్‌ను లేఅవుట్లకు అమ్ముకున్నారు. పోలీసు కేసుతో ఎంపీ మాగుంట పేరు వెలుగులోకి వచ్చింది. దీనిపై అప్పట్లోనే మాగుంట ఎస్పీకు ఫిర్యాదు చేయడంతో స్వయంగా ఎస్పీ విచారణ చేపట్టారు. ఇప్పటి వరకూ ఎంపీ పేరుతో అనుమతులు పొందింది ఎవరన్నది తేల్చలేకపోయారు. ఇరిగేషన్ అధికారులను విచారించగా అప్పటి ఓ ప్రజాప్రతినిధి వద్ద ఆర్థిక వ్యవహారాలు చూసే ఓ వ్యక్తి మట్టి తవ్వకాలకు దరఖాస్తు చేసుకున్నట్లు పోలీసులకు స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేసి ఉంటే అసలు దొంగల గుట్టు బయటకొచ్చి ఉండేది. కానీ నాడు ఓ ప్రజా ప్రతినిధి ఒత్తిడితో పోలీసులు కేసును పక్కన పెట్టేశారు. అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపిన దాని కన్నా ఓ ఎంపీ పేరును దుర్వినియోగం చేయడం పెద్ద నేరమని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఇదిలాఉంటే అనుమతులకు మించి తవ్వకాలకుగానూ నాడు ఇరిగేషన్ అధికారులు రూ.10 లక్షలు జరిమానా విధించారు. అయితే కేసు పెండింగ్‌లో ఉండగా ఇరిగేషన్ అధికారులు జరిమానా ఎలా కట్టించుకున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పకుండా దాచిపెట్టారు. పోనీ ఆ తర్వాతైనా పోలీసులు విచారణ చేసి ఉంటే ఏ బ్యాంకు ఖాతా నుంచి మొదట చలానా కట్టారు..? తర్వాత ఏ ఖాతా నుంచి జరిమానా చెల్లించారన్న అన్నది తేలిపోతుంది. అప్పుడు వారిని అరెస్టు చేస్తే అసలు దొంగలు బయటకొచ్చే అవకాశముంది. కానీ ఇప్పటి వరకూ ఆ దిశగా విచారణ సాగలేదు.

సహస్రలింగేశ్వరుడి ఆలయ భూమికి రక్షణ కల్పించండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని ఇరుగాళమ్మ ఆలయం సమీపంలో ఫోర్జరీ పట్టాలతో ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూమి రక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'సహస్ర లింగేశ్వరా నీ భూమిని నువ్వు కాపాడుకో' అనే కథనానికి కలెక్టర్ స్పందించారు. ఫోర్జరీ పట్టాలతో చేసిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని సూచించారు. సహస్ర లింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన ఈ భూమిని గతంలో టిడ్కో ఇళ్ల కోసం సేకరించి కార్పొరేషన్‌కు అప్పగించారు. అయినా ఆ భూమిని నిషేధిత జాబితాలో చేర్చలేదు. దీన్ని అదునుగా తీసుకున్న కొంతమంది అక్రమార్కులు ఫోర్జరీ పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేశారు. ఇప్పుడు ఈ భూమిని నిషేధిత జాబితాలోకి చేర్చడంతోపాటు వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో పేర్లు మార్పునున్నట్లు జేసీ సేతమాధవన్ తెలిపారు.



నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

- తాగునీటి పథకాల పరిశుభ్రత
- కుళాయి నీటికి నమూనా పరీక్షలు

మర్రిపాడు, జూన్ 28: వాతావరణంలో వస్తున్న మార్పులతో గ్రామాల్లో డయేరియా కేసుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో శుద్ధజలం సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించింది. ఈ మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంపీడీవో మనోహర్‌రాజు రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేయటం, ట్యాంకులు క్లోరినేషన్ చేయించి ప్రజలకు అవగాహనతో చైతన్య పరుస్తూ.. కార్యాచరణ చేపట్టారు. రక్షిత మంచినీటి పథకాల పర్యవేక్షణలో గ్రామీణ నీటి సరఫరా విభాగ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్ల మధ్య సమన్వయలోపంతో ఇప్పటివరకు ఉత్పన్నమవుతున్న సమస్యలపై పరిష్కారం దిశగా అధికారులు గతంలో అడుగులు వేయలేదు. ప్రత్యేకశ్రద్ధ పెట్టాల్సిన పంచాయతీ సర్పంచులు నిధుల కొరతతో ఈ కార్యక్రమాన్ని అటకెక్కించారు. నిబంధనల ప్రకారం ప్రతి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను 15రోజులకోసారి శుభ్రం చేసి తేదీతో సహా అక్కడ నమోదు చేయాలి. కానీ ఇలా ఎక్కడా జరగటంలేదు. ఇటీవల ప్రతి రక్షితనీటి పథకానికి వారం రోజుల నుండి యుద్ధ ప్రాతిపదికన గ్రామాల్లో మంచినీటి శుద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సంబంధిత టెస్టుల కిట్లను ప్రతి సచివాలయానికి అందజేశారు.



సీతారామపురం: కుళాయి నీటి నమూనాను సేకరిస్తున్న అధికారులు

● అన్ని గ్రామాల్లో పనులు

- మనోహర్‌రాజ్, మర్రిపాడు ఎంపీడీవో

మండలంలోని గ్రామాల్లో రక్షిత నీటి పథకాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేసేలా చర్యలు తీసుకున్నాం. ఈ పనులను కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు ఈ విషయంపై అవగాహన కల్పిస్తున్నాం. అన్నిట్యాంక్‌లలోని నీటిని టెస్టులు చేయి స్తున్నాం.





మంచినీటి ప్లాంట్లలోని నీటి శాంపిల్ సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

● గ్రామాల్లో తాగునీటి పరీక్షలు

సీతారామపురం: డయేరియా నివారణ చర్యల్లో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో వైద్యఆరోగ్య, పంచాయతీ సిబ్బంది శుక్రవారం తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో సీతారామ పురంలోని వీధుల్లో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ ఆధ్వర్యంలో కుళాయిల వద్ద నీటి నమూనాలు సేకరించి గ్రామ సచివాలయంలో పరీక్షలు చేశారు. తాగునీటి క్లోరినేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి, ఏఎన్ఎం సుబ్బమ్మ, వైద్య సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్ నరసింహులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సంగం, జూన్ 28: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో 6,7,9 తరగతుల్లో మిగిలిన సీట్లకు శుక్రవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 6లో పది సీట్లు, 7లో ఆరు సీట్లు, 9లో మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. 128మంది దరఖాస్తు చేసుకోగా 111మంది పరీక్ష రాయగా, 17మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుమతి తెలిపారు.

ఉదయగిరి డిపోకు రూ.6.52 లక్షల ఆదాయం

ఉదయగిరి, జూన్ 28: దుత్తలూరు మండలం నర్రవాడ శ్రీవెంగమాంబ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయగిరి ఆర్టీసీ డిపోకు రూ.6.52 లక్షల ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 26, 27వ తేదీల్లో 24 ప్రత్యేక బస్సులు నడిపామన్నారు. ప్రత్యేకసర్వీసులు నడిపినందుకు సహకరించిన సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దీక్ష యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్‌వలి

సీతారామపురం, జూన్ 28: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంఈవో మస్తాన్‌వలి దీక్షాయాప్‌పై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. 1వతరగతి నుండి 8వ తరగతి వరకు చదివే విద్యార్థుల వివరాలను దీక్షా యాప్‌లో పొందుపరిచేలా ప్రధానోపాధ్యాయులు చూడాలన్నారు. జూలై 1 నుంచి 25 వరకు ర్యాలీ నిర్వహించాలన్నారు. గ్రామస్థులతో పాఠశాల సందర్శన, కళాజాతాలు, ప్రభుత్వ పాఠశాలలో లభించే సౌకర్యాల ప్రదర్శన, ప్రచార కార్యక్రమాలతో ఎక్కువ మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు

ఉదయగిరి, జూన్ 28: జులై 1వ తేదీ నుంచి ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు శుక్రవారం ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. మండలంలోని 17పంచాయతీల్లో 4,963 పింఛన్‌దారులు ఉండగా వారి కోసం రూ.3.36కోట్లు సచివాలయాల సిబ్బంది చేతికి అందజేస్తామన్నారు. పింఛన్ అందజేసేందుకు వారివెంట తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది ఉంటారన్నారు.

వినుకొండ నుంచి తిరుమలకు..

- టీడీపీ శ్రేణుల పాదయాత్ర



సేదతీరుతున్న టీడీపీ శ్రేణులు

అనంతసాగరం, జూన్ 28: పల్నాడు జిల్లా వినుకొండ మండలం కొత్తపాలెం ప్రాంతానికి చెందిన 12మంది టీడీపీ శ్రేణులు రెండు గ్రూపులుగా కలినడకన తిరుమలకు బయలుదేరారు. అందులో భాగంగా శుక్రవారం వారు అనంతసాగరంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. వైకోపోయి.. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తిరుమలకు కాలినడక వస్తామని మొక్కుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పెంచలకోన, రాపూరు, వెంకటగిరి మీదుగా తిరుపతికి మరో 6రోజుల్లో చేరుకుంటామన్నారు. వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకొని ముఖ్య మంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సుభిక్షంగా వుండేలా మొక్కులు తీర్చుకుంటామన్నారు. టీడీపీ జెండాలు చేత పట్టి కాలినడకన సూదుర ప్రాంతం నుంచి పాదయాత్ర చేస్తున్న వీరిలో నలుగురు మహిళలు ఉన్నారు.

కొరవడిన పారిశుధ్యం

ఉదయగిరి, జూన్ 28: జీ.చెరువుపల్లి పంచాయతీలోని సంజీవరాజుపల్లిలో మురుగునీరు నిల్వలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణంలో ఏర్పడిన మార్పులతో దోమలవ్యాప్తి ఎక్కువైనట్లు చెప్పారు. మురుగునీటి నిల్వలను తొలగించడంలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగారప్పమ్మకు పొంగళ్లు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 28: నర్రవాడ నాగారప్పమ్మ అమ్మవారికి భక్తులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. తొలుత మహిళలు గ్రామంలోని ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి నూతన బుట్టల్లో పొంగళ్ల సామగ్రితో మహిళలు మేళతాళాలు, బాణసంచా పేలుళ్లతో గ్రామపురవీధుల్లో ఊరేగింపుగా శివారులోని నాగారప్పమ్మ పుట్ట వద్దకు చేరుకొన్నారు. అనంతరం పుట్ట చుట్టూ ప్రదక్షణలు చేసి ఆవరణలో పొంగళ్లు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. నిర్వాహకులు భక్తులు అన్నదానం చేశారు.



పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

ఉదయగిరి రూరల్: సున్నంవారిచింతలలో వెలసిన కోదండరామస్వామి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, నవగ్రహ మండపా రాధన, పంచామృతాభిషేకం, విశేష పూజలు, అలంకరణలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు.



ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు

వరికుంటపాడు: తూర్పు రొంపిదొడ్లలో వెలసిన శ్రీమానసాదేవి ఆలయ వార్షికోత్సవాత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహమండపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ నిర్వాహకులు అర్చకులతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, టీడీపీ నాయకులు చంద్ర వెంక య్య, మహేశ్వరరెడ్డి, నాదిండ్ల రాజా, మల్లంపాటి వెంగయ్య, పేరం సుధాకర్‌రెడ్డి, తెల్లగొర్ల వెంకటయ్య పాల్గొన్నారు.

ఇసుక రీచ్ వద్ద కందకాల ఏర్పాటు

సంగం, జూన్ 28: ముక్తాపురం పెన్నానది రీచ్ నుంచి ఇసుకను అక్రమంగా తరలించకుండా రెవెన్యూ అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. రీచ్‌లోకి వాహనాలు వెళ్లకుండా రహదారికి అడ్డంగా కందకాలు ఏర్పాటు చేయించారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కొద్ది రోజులుగా రాత్రి వేళ్లలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. దీనిపై స్థానిక టీడీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు తీసుకున్నారు. సంఘటన స్థలంలోని కందకాలు పూడ్చి అక్రమంగా రీచ్‌లోకి ప్రవేశించి ఇసుక తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



ఇసుక రీచ్‌లోకి వెళ్లకుండా యంత్రంతో రహదారికి అడ్డంగా తవ్విన కందకం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉదయగిరి రూరల్, జూన్ 28: గండిపాళెం జిల్లా ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యాసం వత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం పాఠ శాలలో ఆత్మీయ సమావేశం ని ర్వహించారు. 28ఏళ్ల క్రితం చదువుకున్న వారంతా ఒకే వేది కపైకి చేరడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డ వారంతా సమావేశానికి హాజరయ్యారు. ఒకరినొకరు పరి చయం చేసుకుంటూ గత స్మృతులను నెమరవేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం సామూహిక భోజనం చేశారు.

నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయండి


ఉదయగిరి రూరల్, జూన్ 28: పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆత్మకూరు డిప్యూటీ ఈవో కె.గోపాల్ సూచించారు. శుక్రవారం గండిపాళెం, వెంగళరావు నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు తనిఖీ చేసి సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నూర్జహాన్ పాల్గొన్నారు.



గండిపాళెం ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో గోపాల్

గాజుల అలంకరణలో అలరించిన కలుగోళ శాంభవి

కావలిటౌన్, జూన్ 28: కావలి గ్రామదేవత కలుగోళశాంభవి శుక్రవారం ప్రత్యేక గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చక బృందం పర్యవేక్షణలో ఉదయం పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక లలిత సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం పల్లకీ సేవ, విశేష పూజలు నిర్వహించారు. భక్తజనంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వైద్యసేవలు మెరుగుపరచండి

- ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఇంటూరి తనిఖీలు

కందుకూరు, జూన్ 28: కందుకూరు ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపరచాలని, పేషెంట్లు పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఏ చిన్న సంఘటన జరిగినా కఠినంగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కందుకూరు ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించటంతో పాటు వార్డులలో రోగుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న సౌకర్యాలు, చికిత్స గురించి ఆరా తీశారు. ముఖ్యంగా ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిమాణం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టరు ఇంద్రాణి, ఇతర వైద్యులు, సిబ్బందితో సమావేశమై పరికరాలు, సదుపాయాల కొరత తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. రోగులకు సరిపడా మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రిలోనే ఎక్కువ కాన్పులు జరిగేలా చూడాలని, అందుబాటులో ఉన్న అధునాతన పరికరాలను సక్రమంగా ఉపయోగించి రోగులకు మెరుగైనసేవలు అందించాలని ఆదేశించారు. శానిటేషన్, తాగునీరు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అవసరమైన మేరకు డాక్టర్లు లేరని, సిబ్బంది, వైద్య పరికరాల కొరత గురించి తనకు తెలుసునని, త్వరలోనే సంబంధిత మంత్రితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, చదలవాడ కొండయ్య, షేక్ రఫి తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఇంటూరికి సన్మానం : పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావును స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుపై పూలవర్షం కురిపిస్తూ ఓపెన్‌టాప్ వాహనంపై ఊరేగింపుగా కాలనీలోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదప్రజల సంక్షేమానికి పాటుపడ తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ల అధ్యక్షులకు సత్కారం



అసోసియేషన్ల అధ్యక్షులను సత్కరిస్తున్న సెవెన్ లైన్స్ సభ్యులు

కావలి, జూన్ 28: కావలి పట్టణ బులియన్ మర్చంట్స్, కుదువ వ్యాపారుల అసోసియేషన్‌లకు అధ్యక్షులుగా ఎన్నికైన మొగళ్లపల్లి రాజా, కోటా రమేష్‌లను శుక్రవారం కావలిలో సత్కరించారు. సెవెన్‌లైన్స్ సభ్యులు వారిని కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ బంగారువ్యాపారులు, కుదువ వ్యాపారులకు ఎలాంటి కష్టాలు వచ్చినా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సహకారంతో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెవెన్‌లైన్స్ సభ్యులు అనుమలిశెట్టి శివ, గాదంశెట్టి వేణుగోపాల్, పాదర్తి నాగరాజు, సువర్ణ శ్రీను, పెట్బుగాని రమేష్, గాదంశెట్టి రవికుమార్,సుబ్బారావు, పెసల పవన్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం



చెన్నకేశవులు దంపతులను సత్కరిస్తున్న అధికారులు

కొండాపురం, జూన్ 28: పదవీ విరమణ చెందుతున్న పంచాయతీ కార్యదర్శికి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఘనంగా సన్మానం జరిగింది. సాయిపేట పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎల్.చెన్నకేశవులు ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చెందుతున్నారు. దీంతో ఎంపీపీ బొడ్డు అనూరాధ, ఎంపీడీవో సుజాత, తహసీల్దారు మస్తానయ్య, కార్యాలయాల అధికారులు, సిబ్బంది చెన్నకేశవులు దంపతులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, వీఆర్‌వోలు, ఎంపీటీసీలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించండి

- కాకర్లకు వైద్య సిబ్బంది వినతి

కలిగిరి, జూన్ 28: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వింజమూరు తాలూకా పరిధిలోని కలిగిరి, వింజమూరు, కొండాపురం వైద్యశాలల్లో పనిచేస్తున్న ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ హెల్త్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీ హంస) సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను బొమ్మరాజుచెరువు వద్ద పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా వైద్య సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కప్పా నారాయణరాజు, సభ్యులు ఎస్ చెంచురామయ్య, కే వెంకటసుబ్బయ్య, డీ దొరసానమ్మ, ఎం సరోజిని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల భూములు లాక్కోవడం దుర్మార్గం

జలదంకి, జూన్ 28: పార్వతీపురం మన్యం జిల్లా శివం గ్రామంలో 1970లో ప్రభుత్వం అక్కడి దళితులు 14 మందికి 28 ఎకరాలు ప్రభుత్వభూమి పట్టాలు మంజూరు చేయగా వాటిని పెత్తందారీలు లాక్కోవడం దుర్మార్గమైన చర్య అని సీపీఎం నాయకుడు తాళ్లూరి మాల్యాద్రి ఖండించారు. స్థానిక సీపీఎం కార్యాలయం సురే చెంచురెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్షణం ప్రభుత్వం కలుగజేసుకుని బాధిత దళిత కుటుంబాలకు న్యాయం చేసి దాడులకు పాల్పడ్డ పెత్తందారీలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మేలంగి ఆంథోనీబాబు ఉన్నారు.

ప్రభుత్వం మారినా .. మారని సూచిక బోర్డులు!



ఉర్దూ స్కూల్ రోడ్డులో జగన్, రామిరెడ్డి ఫొటోలతో ఉన్న సూచిక బోర్డు

కావలి రూరల్, జూన్ 28: ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయి టీడీపీ అధికారం చేజిక్కించుకుంది. ప్రభుత్వం మారినా కావలి పట్టణంలో గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిల ఫొటోలతో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు ఇంకా దర్శనమిస్తూనే ఉన్నాయి. పట్టణంలోని ఉర్దూ పాఠశాల రోడ్డులో ఉన్న 2వ వార్డు సచివాలయం సూచిక బోర్డు మార్చకపోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో కూడా సచివాలయంపై పార్టీ జెండాలు ఎగరవేసి ఉండటం అప్పట్లో చర్చనీయాంశమైంది. అధికారులు బోర్డు మార్చాలని స్థానికులు, టీడీపీ నేతలు కోరుతున్నారు.

రోడ్డుపైకి బోరుబావి మట్టి, నీరు..!

- బురదలో అవస్థలు పడ్డ ప్రజలు

కావలి, జూన్ 28: పట్టణంలోని ట్రంకు రోడ్డులో ఏరియా వైద్యశాల పక్కన చిన్న స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఓ వ్యక్తి గురువారం రాత్రి బోర్ బావి తవ్వించారు. అందులో నుంచి వచ్చిన మట్టి నీటిని పక్కన గుంట తీసి అక్కడకు వదలాల్సింది పోయి రోడ్డు మీదకు వదిలారు. దీంతో ఆ ప్రాంతంలో రోడ్డంతా శుద్ధ మట్టి నీటితో బురదమయంగా మారింది. చుట్టుపక్కల వ్యాపారులు కూడా తమ దుకాణాలు తెరుచుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం మున్సిపల్ అధికారులకు తెలపగా వారు పారిశుధ్య కార్మికులను పంపి ఎంత క్లీన్ చేసినా రోడ్డుపైన ఉన్న శుద్ధ మట్టి పోక పోగా ఆ మట్టి అంతా డ్రైనేజీలో చేరి కాలువ పూడి పోవడంతో దుకాణాల ముందు బురదమట్టితో వ్యాపారస్థులతో పాటు ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవటం వలనే ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు.



ఏరియా వైద్యశాల వద్ద బోర్‌బావి మట్టి, నీరుతో బురదమయమైన రోడ్డు

సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ

అల్లూరు, జూన్ 28 : కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా చేపట్టే పించన్ల పంపిణీ సచివాలయల సిబ్బందితోనే చేపట్టనున్నట్లు అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో జ్యోతి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని 60 నుంచి 70 ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్ల పంపిణీ చేపట్టాలన్నారు. అదేవిధంగా ఈనెల 30న ఆదివారం సెలవు దినం కావడంతో 29నే పింఛన్ల తాలూకు నగదును బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకోవాలన్నారు. సోమవారం 90 శాతంపైబడి పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని, మరుసటి రోజుతో నూరుశాతం పూర్తి చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న కమిషనర్ ఫణికుమార్

గట్టుపల్లి గ్రామ సచివాలయంలో ప్రభుత్వాధినేతల చిత్రపటాల ఏర్పాటు

జలదంకి, జూన్ 28: మండలంలోని గట్టుపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను ఎన్డీఏ కూటమి నాయకులు ఏర్పాటు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు తల్లపనేని మధుసూదనరావు, కొల్లా క్రిష్ణ, గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు, గొట్టిపాటి మనోజ్, అంబటి హరిప్రసాద్‌నాయుడు, జనసేన నాయకుడు నిమ్మలపల్లి రామ్‌చైతన్య తదితర నాయకులు పాల్గొన్నారు.



గట్టుపల్లి సచివాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధినేతల చిత్రపటాలు ఏర్పాటు చేసిన శ్రేణులు

సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాల ఏర్పాటు

కావలిటౌన్, జూన్ 28: ముసునూరు 15వ వార్డు సచివాలయానికి శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిల చిత్రపటాలను స్థానిక టీడీపీ నేతలు బహూకరించారు. సచివాలయంలో నేతల చిత్రపటాలను ఏర్పాటు చేసి టీడీపీ, జనసేన శ్రేణులు మిఠాయిలు తినిపించి సంబరాలు జరుపు కున్నారు. కార్యక్రమంలో నేత లు, మాజీ కౌన్సిలర్ ఉప్పు వెంకటస్వామి, కన్నం శ్రీధర్, బిట్రగుంట వెంకట్రావు, కృష్ణ, నాయబ్, మహేష్, హరిరెడ్డి, రవి, మాధవ తదితరులు పాల్గొన్నారు.



15వ వార్డు సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలతో టీడీపీ నేతలు

కమనీయం సీతారాముల కల్యాణోత్సవం

కందుకూరు, జూన్ 28: మండలంలోని మహదేవపురంలో శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరైన సీతారాములును దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ సలహాదారు గుళ్లా శ్రీను, ఓరుగంటి రమణయ్య, సుధాకర్, నర్రా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అతిసార వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

ఉలవపాడు, జూన్ 28 : అతిసార వ్యాధి(డయేరియా)పై విద్యార్థులకు అవగాహన ఉండాలని చాకిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రణతి అన్నారు. శుక్రవారం చాకిచర్ల పెద్దపట్టపుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సలీంబాషా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని విద్యార్థులకు డయేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు వెలిచర్ల కోటేశ్వరరావు, శరత్‌లు అతిసార వ్యాధిపై ఈసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం గ్రామ పెద్దలు వైద్యాధికారిణిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



డాక్టర్ ప్రణీతిని సత్కరిస్తున్న గ్రామ పెద్దలు